www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

భోగి శుభాకాంక్షలు

సోమవారం | 14-1-2019 | పేజీలు: 16 + 20 | వెల: రూ.6.50 | సంపుటి: 15 సంచిక: 189 | నిజామాబాద్ సిటీ*

శ్రీవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 12.38 తదుపరి నవమి; నక్షత్రం: రేవతి మ. 12.53 తదుపరి అశ్వని; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: మ. 12.47-1.31, మ. 2.59-3.43; అమృతఘడియలు: ఉ. 10.18-12.01, తె. 6.25 మొదలు; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.55; సూర్యాస్తమయం: 5.55

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



సన్నాయి రాగానికి బసవన్న విన్యాసం.. దాని బరువునంతా మోస్తున్నట్లుగా గంగిరెద్దుల పెద్దాయన ఆయాసం! సంక్రాంతి సంబురాలు కనుమా అంటూ ఆనందాల భోగి వచ్చేసింది. కష్టాలు, బాధల చీకట్లను చీల్చి ఏడాదంతా సంతోషాలనిచ్చే వెలుగు దివ్వె తాను అన్నట్లుగా భోగి మంటలు ఎగిసిపడతాయి. ముగ్గులు వేస్తూ.. నోముల వాయనాలు ఇచ్చి పుచ్చుకొంటూ అతివల సందళ్లు.. పతంగులను ఎగురవేస్తూ బుడతల కేరింతలు.. మొత్తంగా ఈ మూడు రోజులూ ఆనందాల హరివిల్లే!!

ఖర్చు ఇంతే ఇదో వింతే!

అసెంబ్లీ ఎన్నికలు కారు చౌకగా జరిగాయట!

సగటు అభ్యర్థి వ్యయం రూ.10 లక్షలే

గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ ఖర్చు 6.53 లక్షలు

కొడంగల్‌లో రేవంత్ వ్యయం 7.4 లక్షలేనట

ఈసీ పరిమితి దరిదాపులకూ చేరని ఖర్చు

చేసిన ఖర్చుల్లో ఒక్క శాతమే వెల్లడి

మద్యం, నగదు పంపిణీ ప్రస్తావన ఉంటే ఒట్టు

ఎన్నికల కమిషన్‌కు అభ్యర్థుల మాయ లెక్కలు

కొడంగల్‌లో ఈసారి ఎలక్షన్ హై టెన్షన్‌కు తాతను తలపించింది. ఇరు పక్షాలూ నువ్వా నేనా అన్నట్లు మోహరించి.. ఓట్లను కొనుగోలు చేశాయి. కానీ, ఇక్కడ ఓటమి పాలైన కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్ రెడ్డి చేసిన ఎన్నికల ఖర్చు కేవలం 7.4 లక్షలు మాత్రమేనట!

సూర్యాపేటలో త్రిముఖ పోటీ నెలకొంది. ముగ్గురూ ఎవరికి వారే.. నువ్వా నేనా అన్నట్లు ప్రచారం చేశారు. రూ.2000 నోట్లను వెదజల్లి మరీ ఓట్లు కొన్నట్టు ప్రచారం సాగింది. అయినా, ఇక్కడ టీఆర్ఎస్ అభ్యర్థి జగదీశ్ రెడ్డి చేసిన ఖర్చు కేవలం రూ.16 లక్షలేనట!

పలువురు అభ్యర్థులు ఈసీకి సమర్పించిన ఖర్చు వివరాలివీ!

- సిరిసిల్ల నుంచి పోటీ చేసి గెలిచిన కేటీఆర్ ఎన్నికల వ్యయం రూ. 7.53 లక్షలు.
- హుజూర్‌నగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన ఖర్చు రూ.17.06 లక్షలు మాత్రమే.
- అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో సంపన్నుల్లో ఒకరైన నాగర్ కర్నూలు టీఆర్ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్ రెడ్డి కూడా ఈ ఎన్నికల్లో వెచ్చించింది రూ.17.77 లక్షలే.
- కొల్లాపూర్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన ఖర్చు రూ.18.39 లక్షలు.
- పాలేరు టీఆర్ఎస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికల వ్యయం రూ.14.44 లక్షలే.

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): .. ఇవేంటీ!? ఎన్నికల ఖర్చులు మరీ ఇంత తక్కువా? ఎవరూ పట్టుమని పాతిక లక్షలు కూడా ఖర్చు చేయలేదా? కట్టలు తెగాయని.. కోట్లు ఖర్చు చేశారని ప్రచారం జరిగిందే అని ఆశ్చర్యపోవద్దు. 'మాకు 500 ఇచ్చారు. నియోజకవర్గంలో కనీసం 40 వేల మందికి పంచారు. దీని ప్రకారం, ఒక్క నగదు పంపిణీ లెక్కే రూ.2 కోట్లు ఉంటుందే!' అని నివ్వెరపోవద్దు. ఇవన్నీ ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన లెక్కలు. రోజువారీగా చేసిన వ్యయాన్ని లెక్కలు, రసీదులతో సహా అందించిన వివరాలివి. అంతేనా.. ఈ లెక్కలను కొన్ని సందర్భాల్లో ఎన్నికల వ్యయ పరిశీలకులు ధ్రువీకరించారు కూడా. రాష్ట్రంలోని అన్ని పార్టీల అభ్యర్థులూ సగటున రూ.10 లక్షలకు అటూ ఇటుగానే ఖర్చు చేశారట. ఈసారి అసెంబ్లీ ఎన్నికలు చాలా ఖర్చుతో కూడుకున్నవని



మిగతా 2వ పేజీలో...

...సంక్రాంతి ప్రత్యేకం

చిరు ధాన్యమే లక్ష్మి

ప్రజల్లో పెరిగిన ఆరోగ్య అవగాహన.. భోజనంగా కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు

వరి బువ్వ ఒక పూట బంద్ చేసి 'చిరు' భోజనం

కొందరికి సంపూర్ణ ఆహారంగా చిరు ధాన్యాలే

ఉన్నతవర్గాల ప్రజలకైతే 'తృణమే' గొప్ప ఫలం

ఇటీవలి కాలంలో రాష్ట్రంలో విక్రయాలు రెట్టింపు

హైదరాబాద్‌లో రోజుకు 25 టన్నుల అమ్మకాలు

ధరలు పైపైకి.. ఆర్నెల్లలో 20 శాతం పెరుగుదల

కేరళ, కర్ణాటక, తమిళనాడు నుంచి దిగుమతులు



జొన్నకలి..
జొన్న యంబలి
జొన్నన్నము..
జొన్న పిసరు
జొన్నలు తప్పన్
సన్నన్నము
సున్న సుమీ!

..పల్నాడు పల్లెల్లోని పరిస్థితులపై ఇలా దెప్పిపొడిచిన మహాకవి శ్రీనాథుడు ఇప్పుడుంటే గనక 'సన్నన్నము చేటు.. జొన్నన్నమే మేలు సుమీ' అని చెప్పేవాడేమో! 'పరమేశా.. గరళము మింగానని మిడిసిపడుతున్నావేమో, దమ్ముంటే జొన్న మెతుకులు తిను' అని వ్యంగ్యమాడిన శ్రీనాథుడే ఇప్పుడుంటే 'జొన్న వంటలే మిన్న' అని సవరించుకునేవాడేమో! మల్లెల్లాంటి సన్నబువ్వను మనసు వద్దంటోంది. నెమ్మదిగా వరి అన్నం చేదవుతోంది.

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రోజులు మారాయి. ఇప్పుడు ఆరోగ్యాలు అంతంత మాత్రమే. 'తీర్థమిస్తే సర్దీ.. హారతిస్తే వేడి' అన్నట్లుగా పరిస్థితి తయారైంది. ముప్పై.. ముప్పై ఐదేళ్లు వచ్చేసరికే బీపీ, షుగర్లు వచ్చేస్తున్నాయి. ఆధునిక జీవనశైలి, ఉరుకుల పరుగుల జీవితంలో పడి

మిగతా 2వ పేజీలో...

వైసీపీలోకి దగ్గుబాటి?

కుమారుడికి పర్చూరు టికెట్

విజయసాయిరెడ్డి దౌత్యం

పురందేశ్వరి బీజేపీలోనే!!

వైసీపీ ఫ్లెక్సీలపై దగ్గుబాటి, తనయుడు హితేశ్ ఫొటోలు

5

శబరిమలలో సంప్రదాయమూ ముఖ్యమే!

నా వైఖరిని మార్చుకున్నా..

రాహుల్ గాంధీ వెల్లడి

13



రక్షణ గోడను ఢీకొట్టి గాలిలోకి లేచిన బస్సు

గాలిలో బస్సు!

శ్రీశైలం ఘాట్‌లో అదుపు తప్పిన టూరిస్టు బస్సు

500 అడుగుల లోయవైపు ఒరిగిన వాహనం.. త్రుటిలో తప్పిన ఘోరం

ముందుభాగం లోయవైపు.. ఘాట్‌రోడ్డు గోడను తాకి ఆగిన వెనుకభాగం

బస్సులోని 50మంది సురక్షితం.. యాత్రికులంతా మహారాష్ట్రీయులే

పెద్దదోర్నాల/శ్రీశైలం, జనవరి 13: పక్కనే ఐదొందల అడుగుల లోయ.. ఘాట్‌రోడ్డు మీద యాభై మంది ప్రయాణికులతో వెళుతున్న బస్సు అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొట్టింది. గోడను దాటుకొని రాకాసి లోయలోకి ఒరిగింది! ఆ బస్సు తలకిందులుగా లోయలోకి పడిపోయేదే. క్షణంలో వందోవంతులో ఏదో మాయ జరిగింది. గాల్లో తేలుతున్నట్లుగా బస్సు రక్షణ గోడపైనే ఆగిపోయింది. బస్సు ముందరి భాగం లోయలో వంగివుంటే.. మిగతా సగం పైకి! బస్సులో ఉన్నవారి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి! శ్రీశైలం ఘాట్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం 8:30 గంటలకు ఈ ప్రమాదం సంభవించింది. తీవ్ర భయాందోళనలతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. అయితే బస్సులోని అందరూ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. వివరాలివీ.. మహారాష్ట్రలోని బీడు జిల్లా లోకండిసవర్గా గ్రామానికి చెందిన 50 మంది దక్షిణాది యాత్రకు టూరిస్టు బస్సులో వచ్చారు. శనివారం

మిగతా 5వ పేజీలో...

బాలికపై రెండేళ్లుగా గ్యాంగ్‌రేప్

సమీప బంధువే రాబందు

మత్తుమందు కలిపి అఘాయిత్యం

వీడియో తీసి స్నేహితులకు షేరింగ్

దాన్ని బూచిగా చూపించి అత్యాచారం చేసిన 10 మంది

ప్రధాన నిందితుడు, ముగ్గురు అరెస్టు

మరో నిందితుడిని సాక్షిగా చేర్చడంపై కుటుంబసభ్యుల ఆందోళన



రిమాండ్‌లో ఉన్న నిందితులు

మదీన/హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆ బాలిక వయసు పదహారేళ్లు! కొన్నిరోజులుగా భయం భయంగా.. ఆందోళనగా ఉంటున్న ఆమె బయటపెట్టిన ఓ విషయం ఆ ఇంట్లోవారి గుండెలను మెలిపెట్టింది! రెండేళ్లుగా ఆ బాలిక సామూహిక అత్యాచారానికి గురైంది. 11మంది యువకులు ఈ ఘోరానికి పాల్పడ్డారు. మరీ ఘోరం ఏమిటంటే.. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు ఆ బాలిక

మిగతా 5వ పేజీలో...

సీపీఎస్‌పై దేశవ్యాప్త ఉద్యమం

ప్రభుత్వాలు అడగనివి మాపై రుద్దుతూ అడిగినవి పట్టించుకోవట్లేదు

వాటా పెంపుతో ప్రయోజనం శూన్యం.. మా సొమ్ము షేర్‌మార్కెట్ పాలు

ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదు.. ఎన్ఎంవోపీఎస్ ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ

రాంచీలో భారీ బహిరంగ సభ.. వివిధ రాష్ట్రాల ఉద్యోగుల హాజరు

3

• వినోద బాధ

డబ్బులిచ్చి యాడ్స్ చూడాలా?

పెయిడ్ చానళ్లకు బంపర్ ఆఫర్

అసలును మించే కొసరు ఆదాయం

2



పరంజ్యోతి

తీర్థ క్షేత్రాల్లో పరిశుభ్రత ఆధ్యాత్మికతలో భాగమే!



కార్తీక స్నానం, మాఘ స్నానం, పుష్కర స్నానం గురించి మనకు శాస్త్రం గొప్పగా చెప్పింది. దానిని దృష్టిలో పెట్టుకొని ఒక సాధువు సముద్ర స్నానానికి వెళ్లాడు. తనదగ్గరున్న భిక్షా పాత్రను ఒడ్డును పెడితే ఎవరైనా దొంగిలిస్తారని తీరంలో దూరంగా వెళ్లి, జనం తక్కువగా ఉన్న చోట ఇసుకలో పాతిపెట్టాడు. గుర్తు కోసం ఆ పాతిపెట్టిన చోట ఇసుకతో గోపురంలాగా నిర్మించాడు. ఇదంతా జనం గమనించారు. "ఓహో! సముద్ర స్నానానికి వెళ్లేటపుడు ఇసుక గోపురాలను నిర్మించి స్నానానికి వెళ్లాలేమో" అనుకున్నారు. అందరూ వెళ్లి సాధువులాగానే.. తలా ఓ గోపురం నిర్మించి స్నానానికి వెళ్లారట. ఇటీవలికాలంలో భక్తులంతా ఇలాగే చేస్తున్నారు. దాని వల్ల మన తీర్థ క్షేత్రాలు అపరిశుభ్రంగా మారడమే గాక అపవిత్రం అవుతున్నాయి. వ్యాపారం కోసం కొందరు వ్యక్తులు నదిలో వదలాలని నమ్మించి అమ్ముకుంటున్న వస్తువులను భక్తులంతా ఇష్టానుసారం పవిత్ర నదుల్లో వేసి వాటిని కాలుష్యకాసారాలుగా మార్చేస్తున్నారు. కొందరేమో నదుల ప్రక్కనే మలమూత్ర విసర్జన చేసి వాటిని అపవిత్ర తీర్థాలుగా మార్చేస్తున్నారు. కానీ, తీర్థ క్షేత్రాలు గొప్ప శక్తి కేంద్రాలు. గోపురం క్రింద కూర్చొని మంత్రోచ్ఛారణ చేస్తే అక్కడ గోపురం - దేవాలయం మాయమై శబ్ద బ్రహ్మ అయిన పరమాత్మనే మిగులుతాడు. ఇలా శబ్ద బ్రహ్మగా ఉన్న భగవంతుని అన్వేషణకు ఏకైక పరిశోధన కేంద్రం క్షేత్రం. అలాగే నదులు, సరస్సులు, పుష్కరిణి మొదలైన ఆలయ అనుసంధానమైన జలాశయాలు ప్రకృతికి ప్రతీకలు. పరమాత్మ యొక్క స్త్రీ తత్వానికి ప్రతీకలు. వాటిలో ప్రవహించే నీటి నుండి వచ్చే విద్యుత్ తరంగాలు మనలో ఉత్సాహాన్ని, చైతన్యాన్ని నింపుతాయి. ఇంత పరమ పవిత్రమైన తీర్థ, క్షేత్రాలను మనం ప్లాస్టిక్ కవర్లు మొదలుకొని అనేక నకారాత్మక వస్తువులతో ధ్వంసం చేయడం దేవునికి ఇష్టం ఉండదు. దేవుని ధ్యానానికి 'శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమానస మాత్మనః".. శుచి అయిన ప్రదేశంలో కూర్చోవాలని శ్రీకృష్ణుడు బోధించాడు. అలాగే ఎక్కడ శుచి, శుభ్రత ఉంటుందో అక్కడ స్థిరంగా లక్ష్మీదేవి ఉంటుందని చెప్పారు. అందుకే మన ఇళ్లలో జరిగే శుభకార్యాల్లో శుచికి ప్రాధాన్యం ఇచ్చారు. అలా కాకుండా మన ఇష్టానుసారంగా ప్లాస్టిక్‌ను, వ్యర్థ పదార్థాలను, ప్రకృతికి హానికారకమైన వాటిని తీర్థక్షేత్రాలలో వేయడం శాస్త్ర సమ్మతం కాదు. అలాగే శక్తి తరంగాలతో నిండిన క్షేత్రాలను మలమూత్ర విసర్జన, ఉమ్మి, వ్యర్థాలతో అపవిత్రంగా మార్చడం భక్తులకు సంస్కారం కాదు. ఆగమశాస్త్ర సమ్మతమైన విషయాలను స్వీకరించి ఆయా క్షేత్రాలను ఆరాధిస్తే అక్కడ పవిత్రత నెలకొంటుంది.

శ్రుతి స్మృతి విధానేన పూజాకార్యయుగత్రయే
ఆగమోక్త విధానేన కతాదేవాన్ యజేత్సుధీః

శ్రుతి, స్మృతి విహితాలైన పూజావిధులు కృత, త్రేత, ద్వాపరయుగాలకు పరిమితం కాగా కలియుగంలో ఆగమాల్లో చెప్పిన పూజావిధులతో బుద్ధిమంతులు దేవుని అర్చించాలి. పశుపక్ష్యాదులు, చిన్న క్రిములు కూడా తమకు తామే ఇళ్లు నిర్మించుకుంటాయి. కానీ దేవునికే గృహనిర్మాణం చేసిన మానవులు వాటిని అపరిశుభ్రం చేయడం అపవిత్రతకు తావు ఇవ్వడమే.

- డా॥ పి.భాస్కరయోగి

డబ్బులిచ్చి మరీ యాడ్స్ చూడాలా?

ఓ వంద టికెట్ పెట్టి సినిమాకు వెళ్లారు! మధ్యలో ఒకే ఒక్క బ్రేక్... అదే ఇంటర్వెల్! ఎక్కడా 'ఫీల్' మిస్ కాకుండా సినిమా చూసే అవకాశం!

నెలకు రూ.వంద కట్టి ఐపీ టీవీ యాప్‌లో సభ్యత్వం తీసుకుంటే... అందుబాటులో ఉన్న అన్ని సినిమాలను వ్యాపార ప్రకటనల బెడద లేకుండా ఎంచక్కా చూడొచ్చు!

ఇక అసలు విషయానికి వద్దాం! తెలుగులోని ఓ ప్రధాన చానల్‌లో మనకు నచ్చిన సినిమా వస్తోంది! కానీ... ప్రతి 20 నిమిషాలకు ఒక బ్రేక్! సినిమా చూసినట్లే లేదు!

అదేం లెక్క... వందా-150 టికెట్ పెట్టి చూసే సినిమాకు, సంవత్సరానికి రూ.1000 కట్టి చూసే ఐపీ టీవీ యాప్‌కూ.. ఇంట్లో కేబుల్ బిల్లుకూ మధ్య పోలికేంటి అంటున్నారా!? మొన్నటిదాకా ఈ ప్రశ్న అడిగితే ఓకే! కానీ... ఇప్పుడు ఇదే ప్రశ్నను మరింత నిగ్గదీసి, నిలదీసి మరీ అడగొచ్చు! ఎందుకంటే... ఈ చానళ్లు మనకేం 'ఫ్రీ'గా రావడంలేదు. 'నచ్చిన చానళ్లు మాత్రమే చూడండి' అంటూ ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తున్నారు. మరి... డబ్బులిచ్చి యాడ్‌లు చూడాలా??



భారత టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) నిబంధనల ప్రకారం... ఫిబ్రవరి నుంచి రూ.130లకు వంద చానళ్లు ఉచితం! అదనంగా ప్రతి 20 ఉచిత చానళ్లకు రూ. 20 చొప్పున చెల్లించాల్సిందే! ఆపై మనకు నచ్చిన చానళ్లను ఎంచుకోవాలంటే.. అదనపు డబ్బులు చెల్లించాల్సిందే! ఎందుకంటే... అవన్నీ 'పెయిడ్' చానళ్లు మరి! మొన్నటిదాకా వినియోగదారులకు తాము 'వినోద సేవ' చేస్తున్నామంటూ.. ప్రకటనల ద్వారా ఆదాయం పొందేవారు. అది వాటి మనుగడకు అవసరం కూడా. కానీ.. వినియోగదారుల నుంచి నేరుగా డబ్బు వసూలు చేస్తున్నప్పుడు 'యాడ్స్' ఎందుకు వేయాలి? ఒక అంచనా ప్రకారం.. తెలుగు పెయిడ్ చానళ్లకు వ్యాపార ప్రకటనల ద్వారా ఏటా దాదాపు 2వేల కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఇప్పుడు వినియోగదారుల నుంచి వసూలు చేసే మొత్తం అంతకుమించి పోతుందని అంచనా! తెలుగు రాష్ట్రాల్లో రెండు కోట్ల మంది కేబుల్, డీటీహెచ్ వినియోగదారులున్నారు. నలుగురు బ్రాడ్‌కాస్టర్లు అందించే అన్ని పెయిడ్ తెలుగు చానళ్ల టారిఫ్ ప్రస్తుతం రూ. 113గా ఉంది. 2 కోట్ల మంది ఆ చానళ్లన్నింటినీ సబ్‌స్క్రైబ్ చేస్తే.. నెలకు రూ. 226 కోట్ల చొప్పున.. ఏటా రూ. 2,712 కోట్ల ఆదాయం సమకూరనుంది. అంటే.. పెయిడ్ తెలుగు చానళ్లకు ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం కంటే.. ఇకపై వినియోగదారులు చెల్లించే మొత్తంతో మరింత ఎక్కువ రెవెన్యూ అందనుంది. అలాంటప్పుడు.. యాడ్స్ లేని ప్రసారాల డిమాండ్ అటు కేబుల్ ఆపరేటర్ల నుంచి, ఇటు వినియోగదారుల నుంచి పెరుగుతోంది. ఇప్పటి వరకు ఆరు రూపాయలకే ఆరేడు చానళ్లు అందించిన బ్రాడ్‌కాస్టర్లు.. ట్రాయ్ తాజా నిబంధనలతో ధరను నాలుగు నుంచి ఆరు రెట్ల మేర పెంచేశారు. ఫిబ్రవరి నుంచి కొత్త ధరలు అమలులోకి వస్తాయి. బ్రాడ్ కాస్టర్లకు కేబుల్ కనెక్షన్ల నుంచే భారీగా ఆదాయం సమకూరనుంది.

అదే ప్రోగ్రాం... పదేపదే!

చానళ్లు చూసేందుకు అంతంత చార్జీలు ఎందుకని ప్రశ్నిస్తే.. మనం చూసే సినిమాల శాటిలైట్ రైట్స్, ఇతర కార్యక్రమాల చిత్రీకరణకు కోట్లు, లక్షలు ఖర్చువుతుందనే సమాధానం వస్తుంది. కానీ.. ఒకే ప్రోగ్రామ్ రకరకాల పేర్లతో వేర్వే చానళ్లలో ప్రసారం చేస్తూ, అన్నింటినీ 'పెయిడ్'గా మార్చడంపైనే జనం అభ్యంతరం! ఒకటే యాజమాన్యం.. అనేక పేర్లతో వివిధ చానళ్లను నిర్వహిస్తోంది. ప్రధాన చానల్ ఒక్కటైతే.. మిగిలినవి వాటి పిల్ల చానళ్లు! సినిమాలు, సంగీతం, కామెడీ... ఇలా! వీటన్నింటి 'సరుకు' ఒక్కటే! ఒక సినిమా తొలుత ప్రధాన చానల్‌లో వస్తుంది. ఆ తర్వాత మార్చిమార్చి పిల్ల చానళ్లలోనూ ప్రసారవుతుంది. వాటిలోని పాటలు, బిట్లుగా సీన్లు అన్నీ మార్చి మార్చి చూపిస్తారు.

వినోద బాధ

వేరే దారేది...

సీరియళ్లు, సినిమాలకు గతంలో చానళ్లకు ప్రత్యామ్నాయం ఉండేది కాదు. ఇప్పుడు ట్రెండ్ మారింది. హాట్‌స్టార్, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, యప్ టీవీ, యూట్యూబ్ చానళ్లలో ఎంచక్కా ఎప్పుడు కావాలంటే అప్పుడు సీరియళ్లు, సినిమాలు, ఇతర కార్యక్రమాలు చూడొచ్చు. ట్రాయ్ నిబంధనల నేపథ్యంలో టీవీ వినోదం భారంగా మారుతున్నందున... ప్రత్యామ్నాయ మార్గాలకు మరింత డిమాండ్ పెరిగే అవకాశముంది. - సెంట్రల్ డెస్క్

తెలుగు రాష్ట్రాల్లో వినియోగదారులిలా!

రాష్ట్రం	కేబుల్ టీవీ	డీటీహెచ్	మొత్తం
తెలంగాణ	81,55,700	16,06,300	97,62,000
ఆంధ్రప్రదేశ్	74,40,400	28,03,000	1,02,43,400
మొత్తం	1,55,96,100	44,09,300	2,00,05,400

దేశవ్యాప్తంగా బ్రాడ్‌కాస్టర్ల ఆదాయం (రూ. కోట్లలో)

సంవత్సరం	ప్రకటనల ద్వారా	చందాదారుల ద్వారా	మొత్తం
2016	24,300	9,000	33,300
2017	26,700	9,900	36,600
2018	30,400	10,900	41,300
భవిష్యత్ అంచనాలు			
2019	33,500	11,700	45,200
2020	36,800	12,500	49,300

(గమనిక.. ఇవి ట్రాయ్ అందజేసిన అధికారిక గణాంకాలే. అనధికారి అంచనా ప్రకారం.. 2018లో బ్రాడ్‌కాస్టర్ల ఆదాయం రూ. 66వేల కోట్లుగా ఉంది. కొత్త టారిఫ్ విధానం కారణంగా ఈ ఏడాది అది రూ. 85వేల కోట్లకు చేరే అవకాశాలున్నాయి.)

ప్రకటనల్లోనూ.. నిబంధనల ఉల్లంఘన

శాటిలైట్ చానళ్లు ఉచిత సేవలు అందిస్తున్న సమయంలో ప్రకటనలు, వాటిని ప్రసారం చేసే సమయం వంటి అంశాలను ట్రాయ్ పేర్కొంది. లాభాపేక్షతో పనిచేసే చానళ్లు యాడ్స్‌ను ప్రసారం చేయకూడదు. నిజానికి.. గంటలో కేవలం 12 నిమిషాలు మాత్రమే ప్రకటనలను ప్రసారం చేయాలి. అది కూడా వెనువెంటనే కాదు. ప్రతి 15 నిమిషాల్లో 3 నిమిషాలు ఉండాలి. చాలా చానళ్లు నిబంధనలకు విరుద్ధంగా ప్రతి 15 నిమిషాల్లో 4 నిమిషాల స్లాట్‌ను ప్రకటనలకు కేటాయిస్తోంది. అంటే.. గంటకు 16 నిమిషాలు, అంతకు మించి యాడ్స్ వస్తున్నాయి. ట్రాయ్ తాజా నిబంధనలు బ్రాడ్‌కాస్టర్లు వినియోగదారుల ముక్కుపిండి టారిఫ్ వసూలు చేస్తే.. ఆ చానళ్లలో ప్రకటనలను నిషేధించాలి. ఇదే వాదనను ఇటీవలి ట్రాయ్ సమావేశంలో బలంగా వినిపించాం.

- ఎస్.జగదీశ్వర్‌రావు, తెలంగాణ డిజిటల్ కేబుల్ ఆపరేటర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు

ఆ ఒక్కటి ప్రస్తుతానికి వెసులుబాటే

కొందరు బ్రాడ్‌కాస్టర్లు గంపగుత్తగా తమ చానళ్లను సబ్‌స్క్రైబ్ చేస్తే.. చాలా తక్కువ టారిఫ్‌కే ఇస్తామంటూ ప్రకటనలిస్తున్నారు. ఆ మేరకు ఎమ్మెస్వోలు వినియోగదారుల ముక్కు పిండేందుకు సిద్ధమయ్యారు. 100 ఉచిత చానళ్లను నిర్ణయించేది ఎమ్మెస్వోలే. అయితే.. తెలంగాణ కేబుల్ ఆపరేటర్లు బలంగా వాదించడంతో.. ట్రాయ్ ఇందులో కొన్ని సవరణలు చేసింది. డీటీహెచ్, కేబుల్ టీవీ సంస్థలు తమ వెబ్‌సైట్లలో వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా చానళ్లను ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించాలని సూచించింది. 100 ఉచిత చానళ్లలో 38 డీడీ చానళ్లు తప్పనిసరి కాగా.. మిగతా 62 చానళ్లను వినియోగదారుడే ఎంపిక చేసుకోవచ్చు. గంపగుత్తగా బ్రాడ్‌కాస్టర్లు టారిఫ్ ప్రకటించినా.. వినియోగదారుడు తనకు కావాల్సిన పెయిడ్ చానల్స్‌ను ఎంచుకోవచ్చు. ఇందులో ఎమ్మెస్వోల బలవంతం ఉండకూడదు.

ఖర్చు ఇంతే.. ఇదో వింతే!

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేశారు. ఎన్నికల ప్రచారం తీరుతెన్నులు చూసిన వారు కూడా ఒక్కో అభ్యర్థి పదుల కోట్లలో ఖర్చు చేసినట్లుగా భావించారు. తీరా లెక్కల్లోకి వచ్చేసరికి ఖర్చు నామమాత్రమేనని తేలిపోయింది. గజ్వేల్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా కేవలం రూ.6.53 లక్షలే ఖర్చు చేశారని ఈసీకి నివేదిక సమర్పించారు. పంచాయతీ సర్పంచ్ పదవి కోసం రూ.50 లక్షలు విరాళం అందించేందుకైనా లేదా అంతే మొత్తం ఖర్చు చేసేందుకు సిద్ధపడి పోటీ చేస్తున్న ఈ రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలకు ఇంత తక్కువగా ఖర్చు చేశారంటే నమ్మి తీరాల్సిందే మరి. అన్ని పార్టీల అభ్యర్థులు చేతికి ఎముక లేనట్లు కోట్లలో ఖర్చు చేసినా.. ఎన్నికల కమిషన్‌కు లెక్క చూపినప్పుడు మాత్రం పొదుపు పాటించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయాన్ని ఎన్నికల కమిషన్‌కు సమర్పిస్తున్నారు. నిబంధనల ప్రకారం అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి తన ఎన్నికల ప్రచారానికి రూ.28 లక్షల వరకే ఖర్చు చేయాల్సి ఉంది. దాంతో, పరిమితి లోపే ఖర్చు పెట్టినట్లు తమ నివేదికలు సమర్పించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాలకు 1821 మంది పోటీ చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు 500 మందికిపైగా ఉండగా.. మిగతా వారు స్వతంత్రులు, ఇతర పార్టీల నుంచి పోటీ చేసినవారు. ఈసీ నిబంధనల మేరకు తమ ఎన్నికల వ్యయాన్ని కొందరు ఇప్పటికే సమర్పించారు. ఇంకా కొందరు సమర్పించాల్సి ఉంది. నిజానికి, కరపత్రాలు, వాల్ పోస్టర్లు, ప్రచారంలో వాడే వాహనాల అద్దెలు, బహిరంగ సభలు, సమావేశాలకు వినియోగించే ధ్వని పరికరాలు, ఇతర ఏర్పాట్లన్నీ వ్యయం కిందకే వస్తాయి. కార్యకర్తలకు అందించే అల్పాహారం, భోజనం కూడా ఖర్చులో భాగమే. టీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలు ప్రచారాన్ని హోరెత్తించాయి. స్టార్ క్యాంపెయినర్లతో ప్రచారం చేయించాయి. ఉదాహరణకు సీఎం కేసీఆర్ తన ఎన్నికల పర్యటనలో భాగంగా సూర్యాపేటకు వెళ్లారు. కానీ, అక్కడ పోటీ చేసిన జగదీశ్‌రెడ్డి ఒకరోజు అత్యధికంగా చేసిన ఖర్చు రూ.1.42 లక్షలు మాత్రమే.

మద్యం పంపిణీయా..!? హవ్వ!

ఎన్నికల్లో మద్యం ఏరులై పారింది. అబ్కారీ లెక్కల్లోనూ ఇదే విషయం తేలింది. సర్కారుకు ఎక్సైజ్ ఆదాయం కూడా భారీగా పెరిగింది. కానీ, అభ్యర్థులు ఎవరూ మద్యం పంపిణీ చేయలేదట. ఎందుకంటే, ఒక్కరంటే ఒక్కరు కూడా మద్యం ఖర్చును తమ ఎన్నికల వ్యయంలో చూపలేదు మరి. ఈసారి ఎన్నికల్లో 500 నుంచి 2000 వరకూ ఓటుకు నోటు పంపిణీ చేశారు. ఓటర్ల సాక్షిగా ఇది నిజం. కానీ, నగదు, ఆభరణాలు, ఇతర వస్తువుల పంపిణీ వంటి వాటి ప్రస్తావన కూడా లేదు. కేవలం రవాణా కోసం వాహనాలు, ఇంధనం, కరపత్రాలు, వాల్ పోస్టర్లకు మాత్రమే అభ్యర్థులు ఖర్చు పెట్టారట. తద్వారా, తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు అత్యంత నిజాయితీగా జరిగాయని అభ్యర్థుల అఫిడవిట్లను బట్టి తెలుస్తోంది. ఎవరూ కూడా ఎన్నికల కమిషన్ విధించిన వ్యయ పరిమితి గీత దాటలేదు. అంతేకాదు.. పరిమితికి కనీసం చేరువలోనూ ఖర్చు చేయలేదు. ఎన్నికల వ్యయాన్ని ఇప్పటికే సమర్పించిన వారిలో ఏ ఒక్కరూ కూడా అన్ని రోజుల్లో కలిపి వంద వాహనాలు ప్రచారానికి వినియోగించినట్లుగా చూపలేదు.

ఖర్చులో ఒక్క శాతమే చూపారా?

వంద అంటే '100'గా రాస్తాము. కానీ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు సున్న (0)కు విలువ లేదని భావించారేమో! కొన్ని నియోజకవర్గాల్లో ఒక్కో అభ్యర్థి రూ.30 కోట్లకుపైగా ఖర్చు చేశారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్నవారు సైతం విరాళాల రూపంలో సేకరించి మరీ కనీసంగా రూ.5 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు ప్రచారంలో ఉంది. కీలకమైన అభ్యర్థులు పోటీ చేసినచోట ప్రధాన పార్టీల అభ్యర్థుల వ్యయం 50 కోట్లు దాటిందని అంచనా. కానీ, వారు ఈసీకి సమర్పించిన లెక్కల్లో పాతిక లక్షలు కూడా ఉండడం లేదు. బహుశా వందలో చివరి రెండు సున్నాలు వదిలేసినట్లు.. తాము చేసిన ఖర్చులోనూ చివరి రెండు సున్నాలు వదిలేసి లెక్కలు చూపారేమో? మొత్తం 1,821 మంది అభ్యర్థుల వ్యయం మొత్తం కలిపినా రూ.25 కోట్లకు మించదేమో!?

చిరు ధాన్యమే లక్ష్మి

(మొదటి పేజీ తరువాయి)

జబ్బులతో ఒళ్లు గుల్ల చేసుకుంటున్న ప్రజలు ఆలస్యంగానైనా 'హెల్త్ ఈజ్ వెల్త్' అనే సత్యాన్ని గుర్తిస్తున్నారు. బతికినంత కాలం ఆరోగ్యంగా బతకాలనే స్పృహ ప్రజల్లో పెరుగుతోంది. ఆ ప్రకారంగా తమ ఆహార అలవాట్లను మార్చుకుంటున్నారు. చిరుధాన్యాలవైపు మొగ్గుతున్నారు. 'కొర్రలు, సామలను రోట్లో వేసి దంచి.. ఒక పూట ముందే నానబెట్టి వండుకునేవారట కదా' అని తాతా, అవ్వలను ఆటపట్టించిన వాళ్లే.. 'పెద్ద మనుషులూ మీరే గ్రేట్' అని కొనియాడుతున్నారు. వారి సీక్రెట్ ఆఫ్ ఎనర్జీ చిరుధాన్యాలే అని గుర్తిస్తూ వాటినే మేమూ తింటామని అంటున్నారు. ప్రస్తుతం చిరుధాన్యాలది పిజ్జాలు, బర్గర్లకు మించిన క్రేజ్! సంక్రాంతి ముగ్గులపై గొబ్బెమ్మలతో పాటు ఒదిగే కొత్త పంట అయిన చిరు ధాన్యం.. ఇప్పుడెంతో అపురూపం. ప్రజల రోజువారీ ఆహారంలో భాగం. వంటింట్లో బియ్యం, గోధుమ పిండి డబ్బాలను పక్కకు నెట్టి 'ఆరోగ్య ప్రదాయిని'గా దర్జా ఒలకబోస్తున్నాయి. ఉన్నత వర్గాలు సహా అందరూ చిరుధాన్యాలే ముద్దంటున్నారు. రెండు పూటలా తినే వరిబువ్వకు ఒక పూట బైబై చెబుతున్నారు. ఆ పూట కొర్రలతోనో.. అరికెలతోనూ.. ఊదలతోనో భోజనం చేస్తున్నారు. ఇంకొందరైతే చిరు ధాన్యాలనే సంపూర్ణ ఆహారంగా తీసుకుంటున్నారు. పెద్ద పెద్ద హోటళ్లకు వెళ్లి చిరు ధాన్యాలతో తయారుచేసిన వంటకాలు తినే సంస్కృతి పెరిగిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ చిరు ధాన్యాల వినియోగం ఎక్కువగానే ఉంది.

బియ్యం, చక్కెర, గోధుమకు దూరం

గత 40 ఏళ్లుగా రాష్ట్రంలో వరే ప్రధాన పంట. ఆహారంగానూ ప్రజలు వరి బియ్యాన్నే వాడుతున్నారు. మునుపు వడ్లను రోకళ్లతో దంచి.. బియ్యంగా మార్చి తినేవారు. వరిపొట్టు మాత్రమే తొలగి పోషకవిలువలతో కూడిన బియ్యం అందుబాటులో ఉండేది. మిల్లులు రావడంతో బియ్యాన్ని పూర్తిగా పాలిష్ చేస్తున్నారు. దీంతో బియ్యంపైన ఉండే పోషకవిలువలు తౌడు రూపంలో వృథాగా పోతున్నాయి. మల్లెల్లా మెరిసే బియ్యాన్ని వండుకొని తింటున్నా.. అందులో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండడంతో ఆరోగ్యానికి తూట్లు పడుతున్నాయి. ఊబకాయం, షుగర్ సమస్య పెరిగిపోతుండడంతో అన్నం మితంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బియ్యంతో పాటు చక్కెర, గోధుమలకూ దూరంగా ఉండాలని చెబుతున్నారు. జాతీయ సలహా మండలి(ఎన్ఏపీ) ఇటీవలి కాలంలో చిరుధాన్యాలను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయాలని నిర్ణయం తీసుకుంది.

పీచు పదార్థం.. ఐరన్ మెండుగా

పీచు పదార్థంతో కూడిన ఆహారపదార్థాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు చెబుతారు. చిరుధాన్యాల్లో పీచు పదార్థం మెండు. బియ్యంలో పైపొరలోనే పీచు ఉంటుంది. గోధుమల్లో ఇది 0.2 నుంచి 1.2 శాతం మాత్రమే. అదే.. కొర్రల్లో 8 శాతం, అరికల్లో 9 శాతం, అండుకొర్రల్లో 12.5 శాతం, సామల్లో 9.8 శాతం, ఊదల్లో 10 శాతం పీచు పదార్థం ఉంటుంది. దీనికి తోడు బీ-1, బీ-3 విటమిన్లు, ప్రొటీన్లు ఉంటాయి. జొన్నలు, కొర్రల్లో మాత్రమే బీ-6, బీ-5 విటమిన్లు ఉంటాయని పోషకాహార సంస్థ పరిశోధనల్లో తేలింది.

యాదాద్రి, నాగర్ కర్నూల్‌లో తినేస్తున్నారు

రాష్ట్రంలో చిరుధాన్యాల తలసరి వినియోగం 12.6 కిలోలు. మంచిర్యాల జిల్లాలో ఇది 10.5 కిలోలుగా ఉంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్ జిల్లాలో వినియోగిస్తున్నారు. ఈ జిల్లాల్లో ఒక్కొక్కరు 17.5 కిలోల చొప్పున తృణధాన్యాలు తింటున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్, జగిత్యాల, జనగామ, కామారెడ్డి, ఖమ్మం, మహబూబాబాద్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్ జిల్లాల్లో బియ్యం వినియోగం కంటే చిరు ధాన్యాల వినియోగమే ఎక్కువ.

కిలోకు 60 నుంచి 150 దాకా

షాపుల్లో నిన్నటిదాకా బియ్యం కొన్నవాళ్లే.. కొర్రలు.. సామలు.. అండు కొర్రలు ఉన్నాయా? అని అడిగి కిలోలకొద్దీ కొని పట్టుకు పోతున్నారు. అమ్మకాలు బాగా పెరగడంతో చిరుధాన్యాల ధరలు పెరుగుతున్నాయి. బెంగళూరులో అండుకొర్రలను కిలో రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. హైదరాబాద్‌లో ధరలు కాస్త తక్కువగా ఉన్నాయి. అండు కొర్రలను రూ.100 నుంచి రూ.150 దాకా అమ్ముతున్నారు. ఇక నిన్నటిదాకా రూ.50 దాకా ఉన్న కొర్రలు రూ.80కి పెరిగాయి. అరికెలు, ఊదలు. సామలను రూ.90 నుంచి రూ.130 దాకా విక్రయిస్తున్నారు. సజ్జలు, రాగులు, జొన్నలు కిలో రూ. 60 చొప్పున దొరుకుతున్నాయి. మొక్కజొన్న రూ.23, పచ్చజొన్న రూ.45 నుంచి రూ.52 దాకా దొరుకుతున్నాయి. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే పంటల్లో 30 నుంచి 40శాతం దాకా వినియోగం ఇక్కడే ఉంటోంది. హైదరాబాద్‌లో రోజుకు 15 నుంచి 25 టన్నుల చిరుధాన్యాల అమ్ముడవుతున్నాయి.

6నెలల్లో 20% పెరుగుదల



ఇప్పుడు చాలా మంది చిరుధాన్యాలు కొంటున్నారు. గత ఆరు నెలల్లో వీటి అమ్మకాలు రెట్టింపయ్యాయి. నిరుటికంటే ఈసారి మేం తమిళనాడు, కర్ణాటక నుంచి దిగుమతికి రెట్టింపు ఆర్డర్లు ఇచ్చాం. ముఖ్యంగా సంపన్నవర్గాలు, వ్యాపారాల్లో స్థిరపడినవారు, డాక్టర్లు, ఆరోగ్యం పట్ల అవగాహన ఉన్నవారు వీటిని కొనుగోలు చేస్తున్నారు. తాజాగా అన్నివర్గాలూ మిల్లెట్స్ కోసం వస్తున్నారు. దీంతో ధరలు ఆరు నెలల్లో 20శాతం మేర పెరిగాయి.

–పన్నాలాల్ పూఖ్‌రాజ్, హోల్‌సేల్ గ్రెయిన్ వ్యాపారి

కొర్రలు 30% దాకా పెరిగాయి



ఇటీవల కొర్రల ధరలు 30శాతం దాకా పెరిగాయి. అండు కొర్రలైతే దొరకడమే కష్టంగా మారింది. ఎంత ధర పెట్టయినా కొనేందుకు కస్టమర్లు సిద్ధపడుతున్నారు. చాలా ముందుగానే కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చినా ఎవరైతే ఎక్కువ రేటు పెడుతున్నారో వారికే సరఫరా చేస్తున్నారు.

- యుగంధర్, ఉషోదయా సూపర్ మార్కెట్ యజమాని, హైదరాబాద్

లోకం తీరు




చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	16.0	31.0
నల్లగొండ	16.4	30.0
వరంగల్	17.5	29.0
హైదరాబాద్	17.5	29.6
అదిలాబాద్	19.2	31.3

మరో 2 రోజులు పొగమంచు

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మరో రెండురోజుల పాటు ఉదయం, రాత్రి వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రానున్న మూడు రోజుల్లో పొడి వాతావరణమే ఉంటుందని, తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నట్లు తెలిపారు. ఉత్తర కర్ణాటక నుంచి మధ్య మహారాష్ట్ర వరకు 0.9 కి.మీ ఎత్తు వద్ద ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు వాతావరణ కేంద్రం ప్రకటించింది.



ఓబీసీ రిజర్వేషన్లు 10% పెంచాలి

విద్య, ఉద్యోగాల్లో ఓబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు పెంచాలి. ప్రస్తుతం ఉన్న 27 శాతం రిజర్వేషన్లను 37 శాతానికి పెంచాలి. అప్పుడే ఆర్థిక బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కల్పించడంపై ఇతర వర్గాల నుంచి వస్తున్న వ్యతిరేకత తగ్గుతుంది. నా ఉద్దేశం ప్రకారం మొత్తం రిజర్వేషన్లను 70 శాతానికి పెంచాలి.

- రాందాస్ అఠవాలే, కేంద్ర మంత్రి



పిల్లల ముందు పోట్లాడుకోవద్దు

" భార్యాభర్తలు గొడవ పడటం సహజం. వాళ్లు ఒకరిపై మరొకరు అరుచుకోకపోతేనే ఆశ్చర్యమేస్తుంది. కాబట్టి వాళ్లు తగాదాలు పెట్టుకోవచ్చు.. పోట్లాడుకోవచ్చు. కానీ దాన్ని పిల్లలు చూడకుండా, వినకుండా జాగ్రత్తలు తీసుకోండి. మీ గొడవల వల్ల పిల్లలు చాలా మానసిక క్షోభకు గురవుతారు."

- పోప్ ఫ్రాన్సిస్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.74.00	పాత ధర 69.24
కొత్త ధర రూ.74.40	కొత్త ధర 69.77
పెరిగింది 40 పైసలు	పెరిగింది 53 పైసలు



చక్కెరకు చెక్ పెట్టండిలా!

న్యూఢిల్లీ, జనవరి 13: చక్కెర ఆరోగ్యానికి చాలా హాని చేస్తుంది. ప్రాసెస్డ్ షుగర్ ఉత్పత్తులను ఎక్కువగా తీసుకోవడం వలన అది నికోటిన్, కొకెయిన్, మత్తుమందుల్లాగా.. మెదడుపై ప్రభావం చూపుతుంది. దీంతో అలసట, ఆందోళ, మానసిక ఒత్తిడి, నిరాశ వంటి లక్షణాలను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. కాబట్టి పంచదార వినియోగాన్ని తగ్గిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే చక్కెర వలన కలిగే దుష్ప్రభవాల నుంచి బయటపడేందుకు కొన్ని చిట్కాలను పాటించాలని అంటున్నారు. ఆహారంలో ప్రొటీన్లు ఎక్కువగా తీసుకొని.. చక్కెరను తగ్గించవచ్చని, తద్వారా అసలట తగ్గుతుందని చెప్పారు. అలాగే పీచు పదార్థాలున్న ఆహారాన్ని కూడా ఎక్కువ తీసుకుంటే వికారం, తలనొప్పి వంటి సమస్యలు తగ్గుతాయని తెలిపారు. కృత్రిమ తీపి పదార్థాలను తినడం తగ్గిస్తే ఒత్తిడి దూరమవుతుందన్నారు.

వైరస్‌లను తక్షణమే గుర్తించొచ్చు!

వాషింగ్టన్, జనవరి 13: ఎబోలా, జికా వంటి ప్రమాకర వైరస్‌లను అప్పటికప్పుడే గుర్తించే కొత్త పద్ధతిని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మొబైల్ లేబరోటరీల్లో ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని వారు చెబుతున్నారు. ప్రమాదకరమైన వైరస్‌లను వెంటనే గుర్తించడం వలన దాని వలన ఎదురయ్యే సమస్యలను దీటుగా ఎదుర్కొనవచ్చని పరిశోధకులు తెలిపారు. న్యూక్లియోటైడ్ సీక్వెన్స్ ద్వారా నిర్ణయించిన సాంకేతికత ఆధారంగా వైరస్ జన్యువుల శ్రేణిని గుర్తించవచ్చని ఆయన పేర్కొన్నారు.

యాదాద్రిలో భక్తుల సందడి




యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సంక్రాంతి సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు దీపారాధన పూజలు చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రభాత వేళ బాలాలయంలో ఆచార్యులు ఆండాళ్ అమ్మవారిని ఆరాధిస్తూ తిరుప్పావై పాశుర పఠనం జరిపారు. కల్యాణ మండపంలో గోదాదేవిని పెళ్లి కూతురిగా దివ్య మనోహరంగా అలంకరించి నీరాటోత్సవ వేడుకలు చేపట్టారు. గర్భాలయంలో మూలవరులకు ఆరాధనలు చేపట్టిన పూజారులు బాలాలయంలోని కవచమూర్తులను హారతితో కొలిచారు. సుదర్శన నారసింహ యాగం, లక్ష్మీనరసింహుల నిత్యకల్యాణోత్సవ పర్వాలను నిర్వహించారు. స్వామికి ఆదివారం భక్తుల నుంచి 16.73 లక్షల ఆదాయం సమకూరింది. - యాదాద్రి టౌన్

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం

- ఇప్పటికీ అసెంబ్లీని సమావేశపర్చరా?: భట్టి.. భద్రాద్రికి ఇస్తానన్న 100 కోట్లేవి?: వనమా
- ఆదివాసీలను పట్టించుకోని కేసీఆర్: పోదెం.. 'పోడు' సమస్యను పరిష్కరిస్తాం: హరిప్రియ


మాట్లాడుతున్న భట్టి.. చిత్రంలో వనమా, పోదెం, హరిప్రియ

భద్రాచలం, జనవరి 13: కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేతో ప్రమాణ స్వీకారం చేయించకపోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మధిర ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగి నెల రోజులు దాటినా శాసనసభను సమావేశపర్చకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రజాకూటమి నుంచి 8మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారని, అందులో కాంగ్రెస్ పోటీ చేసిన 6 చోట్ల అభ్యర్థులను గెలిపించడం పట్ల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామిని భట్టివిక్రమార్కతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, పోదెం వీరయ్య, హరిప్రియ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. భద్రాచలం ఆలయాన్ని రూ.100కోట్లతో అభివృద్ధి చేస్తామన్న కేసీఆర్, ఆ విషయాన్ని మరిచిపోయారని ఎమ్మెల్యే వనమా విమర్శించారు. ఎమ్మెల్యే పోదెం వీరయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు సమయంలో భద్రాద్రిని ముక్కలు చేస్తున్నా పట్టించుకోని సీఎం ఆదివాసీలను పోలవరం ముంపులోకి నెట్టారన్నారు. నియోజకవర్గంలో పోడు భూముల సమస్యను పరిష్కరిస్తామని, బయ్యారం ఉక్కు పరిశ్రమ, రైల్వేస్టేషన్ సాధన కోసం కృషి చేస్తానని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ చెప్పారు.

వాటర్ ట్యాంక్ ఎక్కిన సర్పంచ్ అభ్యర్థి భర్త

- గ్రామస్తులు నమ్మించి మోసం చేశారని ఆవేదన


ట్యాంక్‌పై సర్పంచ్ అభ్యర్థి భర్త

కడెం, జనవరి 13: పంచాయతీ ఎన్నికల్లో తమకు మద్దతు పలికిన గ్రామస్తులు, చివరకు మోసం చేశారంటూ ఓ సర్పంచ్ అభ్యర్థి భర్త వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలపడం నిర్మల్ జిల్లాలో చర్చనీయాంశమైంది. కడెం మండలంలోని నవాబుపేట గ్రామ సర్పంచ్ రిజర్వేషన్ బీసీ మహిళకు రావడంతో, గ్రామంనుంచే ఒకరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గ్రామస్తులు నిర్ణయించారు. అందుకు జెల్ల లావణ్యను ఎంపిక చేశారు. తీరా నామినేషన్లు వేసే సమయానికి మరో ముగ్గురు నామినేషన్లు వేశారు. ముందు మద్దతు పలికిన సదరు అభ్యర్థులు చివరివరకూ విత్‌డ్రా చేసుకోకపోవడంతో, తమను మోసం చేశారంటూ లావణ్య భర్త జెల్ల శంకరయ్య గ్రామంలోని వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కాడు. ముందుగా అనుకున్నట్టుగానే తన భార్యను ఏకగ్రీవంగా గెలిపించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, శంకరయ్యకు కౌన్సెలింగ్ ఇచ్చి కిందకు దింపారు.


నామినేషన్ వేస్తున్న రత్తమ్మ

90ఏళ్ల వయసులో పోటీకి 'సై'!

పెనుబల్లి, ముదిగొండ, జనవరి 13: ఆమె వయసు 90.. స్వాతంత్ర్య సమరయోధుడైన తన భర్త అడుగుజాడల్లో నడుస్తూ.. రెండుసారు సర్పంచ్‌గా.. ఒకసారి జడ్పీటీసీ సభ్యురాలిగా ప్రజాసేవ చేశారు. తాజా పంచాయతీ ఎన్నికల్లో మరోమారు సర్పంచుగా బరిలోకి దిగుతున్నారు. దీంతో ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని తుమ్మలపల్లి గ్రామం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. స్థానికురాలైన 90ఏళ్ల రత్తమ్మ 2001-06, 2008-13 కాలంలో తుమ్మలపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. పెనుబల్లి తొలి జడ్పీటీసీగా ప్రజాసేవలో పాలుపంచుకున్నారు. తాజా ఎన్నికల్లో ఈ గ్రామం బీసీ మహిళలకు రిజర్వ్ కావడంతో.. ముదిమి వయసులోనూ మరోసారి ప్రజాసేవకు నడుం బిగించారామె. ఆదివారం ఆమె స్వయంగా రిటర్నింగ్ అధికారి దగ్గరకు వెళ్లి, తన నామినేషన్‌ను దాఖలు చేశారు. రత్తమ్మ భర్త ఈడా చెన్నయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయన కూడా రెండుసార్లు గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పదేళ్లపాటు గ్రామాభివృద్ధికి పాటుపడ్డారు. రత్తమ్మకు ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఊరికోసం ఎన్నారై పోటీ


దమ్మాలపాటి మార్క్స్

ఊరికోసం ఓ ఎన్నారై తన ఉద్యోగాన్ని వదులుకుని పంచాయతీ ఎన్నికల బరిలో నిలబడ్డారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వనంవారికృష్ణాపురం (కొత్త గ్రామపంచాయతీ)కి చెందిన దమ్మాలపాటి మార్క్స్ ఇంజనీరింగ్ పూర్తిచేసి, స్వీడన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. తమ గ్రామాభివృద్ధి కోసం సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించిన మార్క్స్.. గ్రామాన్ని అభివృద్ధిబాటన నడిపించేందుకే తాను సర్పంచ్ అవ్వాలనుకుంటున్నట్లు తెలిపారు.

పంచాయతీల్లో ఏకగ్రీవాల జోరు

వందల్లో సర్పంచులు.. వేలల్లో వార్డు సభ్యులు.. ఇంకా ధ్రువీకరించని అధికారులు.. పరిశీలన తర్వాత ప్రకటించే చాన్స్

- చిన్న గ్రామాల్లో చొరవ.. పెద్ద గ్రామాల్లో పోటీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఆ గ్రామస్తులందరిదీ ఒకే మాట, ఒకే బాట. ఏ సమస్య వచ్చినా రచ్చబండపై కూర్చుని వారికి వారే పరిష్కరించుకోవడం ఇక్కడ ఆనవాయితీ. చివరకు పంచాయతీ ఎన్నికల్లోనూ వారిది అదే దారి. పంచాయతీ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి ఏనాడూ అక్కడ ఎన్నికలు జరగలేదు. గత 60ఏళ్లుగా ప్రతిసారీ అక్కడ ఏకగ్రీవమే. ఇది ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి పంచాయతీ ఘనత. అయితే, ఈసారి ఏకంగా ఐదుగురు అభ్యర్థులు సర్పంచ్ పదవికి నామినేషన్లు దాఖలు చేయడంతో రసవత్తర పోరు తథ్యమని అందరూ భావించారు. కానీ, అనేక నాటకీయ పరిణామాల మధ్య కొద్దిరోజులుగా ఏర్పడిన ఉత్కంఠకు ఆదివారం తెరపడింది. నలుగురు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకుని.. సిద్దిపేట కోటయ్య ఏకగ్రీవానికి సహకరించారు. దీంతో మరోసారి తెల్దారుపల్లి పంచాయతీ సంప్రదాయం నిలిచింది. ఇదే తరహాలో రాష్ట్రంలోని పలు పంచాయతీల్లో ఏకగ్రీవాలు జోరందుకున్నాయి. మొదటి విడతలో 4,479 పంచాయతీల్లోని సర్పంచులు, వాటి పరిధిలోని 39,822 వార్డు పదవులకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. నామినేషన్ల దాఖలు గడువు ముగిసిన తదుపరి రోజు 11 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, 206 వార్డు సభ్యుల పదవులకు కనీసం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. మిగిలిన చోట్ల ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు నామినేషన్‌ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పలు చోట్ల సర్పంచ్ పదవులు, వార్డు సభ్యులకు ఒక్కొక్కరే పోటీలో మిగిలారు. వీరంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లే. మొత్తంగా మొదటి విడత పంచాయతీల్లో వందల సంఖ్యలో సర్పంచ్‌లు, వేల సంఖ్యలో వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సదరు ఫలితాలను రిటర్నింగ్ అధికారులు(ఆర్ఓ) అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. చాలా చోట్ల చిన్న పంచాయతీలు ఏకగ్రీవం కాగా, పెద్ద పంచాయతీల్లో పోటీ తీవ్రంగానే కనిపిస్తోంది. సిద్దిపేట పరిధిలో 21, గజ్వేల్ డివిజన్ పరిధిలో 13, కామారెడ్డి జిల్లా భిక్కనూరు పరిధిలో 2, ఆర్మూర్ డివిజన్‌లో 34 పంచాయతీలు ఏకగ్రీవమైనట్లు తెలిసింది. పోటీ నెలకొన్న పంచాయతీల్లో అభ్యర్థుల జాబితాను ప్రకటించి వారికి గుర్తులు కేటాయించారు. ఈ నెల 21న తొలి విడత ఎన్నికలు జరగనున్నాయి. ఏక గ్రీవం కోసం చాలా చోట్ల పదవులను వేలం వేసినట్లుగా వార్తలొస్తున్న క్రమంలో... రిటర్నింగ్ అధికారి పరిశీలించిన తరువాతే ఫలితాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. కాగా, వేలం పాట ద్వారా గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేయడం చట్టరీత్యా నేరమని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి.నాగిరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేసులు రుజువైతే అభ్యర్థులు పదవి కోల్పోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.




సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం నర్సాపూర్‌లో నామినేషన్లు వేయడానికి వచ్చిన మహిళలు

అనధికారిక ఎన్నికలో ఇద్దరికీ సమాన ఓట్లు

అధికారిక ఎన్నికల వైపు గ్రామస్తుల మొగ్గు

ఖానాపూర్ రూరల్, జనవరి 13: ఆ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిని ఎన్నుకునేందుకు గ్రామస్తులు విచిత్రమైన పద్ధతిని ఎంచుకున్నారు. అనధికారికంగా ఎన్నికలు నిర్వహించుకున్నారు. అయితే.. వీటిలో ఫలితాలు ఇద్దరి మధ్య సమానంగా రావడంతో.. ఇక అధికారిక ఎన్నికలకు వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ మండలం గోడలపంపు గ్రామంలో శనివారం జరిగిన అంతర్గత ఎన్నికల్లో సన్నివేశం ఇది. ఓట్ల లెక్కింపులో ఒకరికి 106 ఓట్లు, మరొకరికి 85 ఓట్లు రాగా, మరో ఇద్దరు అభ్యర్థులకు మాత్రం 162 ఓట్ల చొప్పున వచ్చాయి. ఇద్దరిలో ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో.. ఇక అధికారిక ఎన్నికల్లోనే సర్పంచ్‌ను ఎన్నుకోవాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు.

నర్సాపూర్‌లో మహిళా పాలకవర్గం

సర్పంచ్ సహా వార్డు సభ్యుల పదవులన్నింటినీ మహిళల కోసం ఏకగ్రీవం చేసుకుని నర్సాపూర్ గ్రామస్థులు ఆదర్శంగా నిలిచారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండల పరిధిలో ఉన్న ఈ గ్రామంలో మహిళలనే ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని తీర్మానం చేసుకున్నారు. చివరి రోజు సర్పంచ్‌గా గోసాయిపల్లి నాగమ్మ, ఉప సర్పంచ్‌గా పుప్పాల పాపమ్మ, వార్డు సభ్యులుగా కంసమ్మ, సావిత్రి, జయశ్రీ, భూమమ్మ, సంగమ్మ, చున్నుబీ, జయమ్మ నామినేషన్లు దాఖలు చేశారు. కాగా.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం రంగాపురం తాజా మాజీ సర్పంచ్ భూక్య పార్వతి ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎన్నికల్లో ఆమె పోటీ చేయాలని భావించగా, ఏకగ్రీవంపై చర్చించేందుకు తన భర్త వెళ్లాడన్న మనస్తాపంతో ఆమె ఈ ఘటనకు పాల్పడినట్లు తెలిసింది. అయితే, చర్చలతో ఈ ఘటనకు సంబంధం లేదని, తమ మధ్య ఉన్న గొడవ వల్లే పార్వతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆమె భర్త లింగ్యా తెలిపారు.

తండ్రిబాటలో బీటెక్ గ్రాడ్యుయేట్


వేణుగోపాల్‌రెడ్డి

ముదిగొండ, జనవరి 13: బీటెక్ గ్రాడ్యుయేట్ అయిన ఆ యువకుడు.. ఉన్నత ఉద్యోగాల ప్రయత్నాల్లో ఉండగానే.. రాజకీయ నేత అయిన అతడి తండ్రి కన్నుమూశారు. దీంతో.. తండ్రి ఆశయాలను నెరవేర్చేందుకు సర్పంచ్‌గా బరిలోకి దిగుతున్నాడు ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మాదాపురం గ్రామానికి చెందిన యర్రబోలు వేణుగోపాల్‌రెడ్డి. ఆయన తండ్రి అచ్చిరెడ్డి 30 ఏళ్లుగా ప్రజాసేవకు అంకితమయ్యారు. ఆయన ఆశయాలను సాధించేందుకే తాను పోటీ చేస్తున్నట్లు వేణుగోపాల్ చెప్పారు.

'టెపోల్' ద్వారా ఓటరు స్లిప్పులు



హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు టెపోల్(టీఈ పీఓఎల్ఎల్) యాప్ ద్వారా ఓటరు స్లిప్పులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆండ్రాయిడ్ ఫోన్‌లోని ప్లే స్టోర్‌లోకి వెళ్లి టెపోల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత జిల్లా, ఎపిక్ నంబర్‌ను ఎంటర్ చేసి ఓటరు స్లిప్పును పొందవచ్చని ఎస్ఈసీ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు.

ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలంలో గౌరిగూడెంకు చెందిన గుంటూరి నాగేశ్వరరావు(61) శనివారం సాయంత్రం తన పొలంలో ఉన్న చెత్తను పోగు చేసి నిప్పు అంటించగా ప్రమాదవశాత్తు ఆ మంటలు అతడికి అంటుకుని మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. - సత్తుపల్లి రూరల్


సీపీఎస్ ఉద్యోగుల బహిరంగ సభలో స్థితప్రజ్ఞ

సీపీఎస్ రద్దు కోసం దేశవ్యాప్త ఉద్యమం

- ఎన్ఎంవోపీఎస్ ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పింఛను పథకం (సీపీఎస్) రద్దుకు దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని సీపీఎస్ నాయకులు ప్రతినబూనారు. ఇందుకు సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. తాము కోరిన డిమాండ్లను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం.. అడగని వాటిని తమపై రుద్దుతోందని మండిపడ్డారు. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో ఆదివారం ఎన్ఎంవోపీఎస్ (నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్) ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరిగింది. అనేక రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున సీపీఎస్ ఉద్యోగులు దీనికి హాజరయ్యారు. ఈ సభలో ఎన్ఎంవోపీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడారు. సీపీఎస్‌లో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ వాటాను 10 శాతం నుంచి 14 శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదని అభిప్రాయపడ్డారు. సీపీఎస్‌లో వాటాను పెంచడమంటే ఉద్యోగుల సొమ్మును షేర్ మార్కెట్ పాలు చేయడమేనని ధ్వజమెత్తారు. కేంద్రం నిర్ణయాన్ని ఎన్ఎంవోపీఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, దీనిపై జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వెల్లడించారు. సీపీఎస్ విధానాన్ని 21 రాష్ట్రాల్లోని ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సీపీఎస్ రద్దు దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

చాసో స్ఫూర్తి పురస్కార ప్రదానం

చాసో 104వ జయంతి సందర్భంగా 2019 - చాసో స్ఫూర్తి పురస్కార ప్రదానోత్సవం జనవరి 17 సా.6 గం.లకు చాసో వేదిక హాలు, గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం, విజయనగరంలో జరుగుతుంది. వేంపల్లె షరీఫ్ పురస్కారాన్ని అందుకొంటారు. కందిమళ్ల సాంబశివరావు, రెహానా, జి.ఎస్. చలం పాల్గొంటారు.

చాగంటి తులసి

లోక్‌నాయక్ ఫౌండేషన్ అవార్డు

లోక్‌నాయక్ ఫౌండేషన్, విశాఖపట్నం 15వ వార్షిక పురస్కార ప్రదానోత్సవం జనవరి 19 సా.5గం.లకు కళాభారతి, మద్దిపాలెం, విశాఖపట్నం నందు జరుగుతుంది. అంపశయ్య నవీన్ పురస్కారాన్ని అందుకొంటారు. జాస్తి చలమేశ్వర్, శరద్ అరవింద్ బాబ్డే, లావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

'బల్దేర్ బండి' కవితా సంపుటి

భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సౌజన్యంతో రమేష్ కార్తీక్ నాయక్ రాసిన కవితా సంపుటి 'బల్దేర్ బండి' ఆవిష్కరణ సభ జనవరి 20 సా.6గం.లకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. యాకూబ్, సౌభాగ్య తదితరులు పాల్గొంటారు.

రమేష్ కార్తీక్ నాయక్

'చేను చెక్కిన శిల్పాలు' నానీలు

సోమేపల్లి వెంకట సుబ్బయ్య నానీల సంపుటి 'చేను చెక్కిన శిల్పాలు', ఎస్.ఎం. సుభానీ నానీల సంపుటి 'సామాజిక నానీలు' ఆవిష్కరణ సభ జనవరి 20 ఉ.10.30గం.లకు జిల్లా పరిషత్ మీటింగ్ హాల్, గుంటూరు నందు జరుగుతుంది.

చలపాక ప్రకాష్

కందుకూరి శతవర్ధంతి

కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి సందర్భంగా 'క్రాంతదర్శి కందుకూరి' పుస్తకావిష్కరణసభ జనవరి 20 ఉ.10 గం.లకు విశాఖ పౌర గ్రంథాలయంలో జరుగుతుంది. ఎల్.ఆర్.స్వామి, జి.నాగేశ్వరరావు, దాట్ల దేవదానం రాజు, డి.వి.సూర్యారావు, తూమాటి సంజీవరావు పాల్గొంటారు.

రామతీర్థ

పరావలయం

నా కలలను ఎవరో ఎత్తుకెళ్ళారు
పున్నమి వెన్నెల్లో, పూదోటల్లో
పరిమళమై విహరిస్తున్న
నా కలలను ఎవరో ఎత్తుకెళ్ళారు
చీకటి రాత్రి చెరువు గట్టు మీద
నిశ్చలమైన నీటి చల్లని అంచులపైన
పవళించిన నా కలలను ఎవరో ఎత్తుకెళ్ళారు

తొలిసంధ్య వాకిలిలో
విరిసిన పూల జాడల్లో
వెచ్చని పొత్తిళ్ళను వెతుక్కుంటూ వెళ్ళిన
నా అడుగుల కలలను ఎవరో ఎత్తుకెళ్ళారు

వెండి మబ్బుల కింద
నల్లని గుట్టల నీటి పాయలో
తడవాల్సిన నా ఆటల కలలను ఎవరో ఎత్తుకెళ్ళారు


పొలాల మడి కట్లలో
సాయం సంధ్య వెలుతురు ముసురులో
నా ఆలోచనలను కమ్ముకున్న
నిన్నటి రాత్రి చివరి కలలను ఎవరో ఎత్తుకెళ్ళారు

నేను దీప దీపాలుగా విస్తరిస్తూ
మొదటి రోజు కమ్ముకున్న
పురిటి వాసనల స్పర్శమీదుగా
ఎదురు చూపుల ఇంటి గుమ్మం నవ్వునై
మొగ్గలు దోసిట్లో పువ్వులౌతున్న సమయాన

నా కలల కన్నులను ఎవరో ఎత్తుకెళ్ళారు

■ ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్
98490 82693





చైనా గోడ

నా దేహం లోంచి పోతుందో
ఈ దేశం లోంచి పోతుందో
తెలియని సుప్త చేతనావస్థలో వున్నాను.
మనస్సును ఛిద్రం చేస్తూ
చుట్టలు చుట్టలుగా ముడుచుకుంటున్న
ఒక అవిచ్ఛిన్న సరీసృపాకృతి
తలపోతలను మేల్కొల్పుతున్నది.

ఇది ఒక సుదీర్ఘ చరిత్రను
వెంట తీసుకొని
కాలాన్ని చీలుస్తూ సాగుతున్న గోడ.
నేను నడుస్తూ వుంటే
గోడా నడుస్తుంది.
ఎక్కడో ఒక చోట
గోడ పూర్తిగా ఆగిపోతుంది.

అక్కడ గాలి రెండు పక్కలా
హాయిగా నిట్టూరుస్తుంది.

ఇది ఐదు రాజవంశాల
ధారావాహిక నవల,
అతుకులను కలిపి కుట్టిన
శిలాశోభిత చిరేతి హాసం,
నూరు సంవత్సరాల
శ్రామికుల స్వేదవర్షాన్ని
ఆరకుండా దాచుకున్న విషాద సంగీతం,
ఫ్యూడల్ అద్భుతాల వెనుక దాగిన
అగాధమైన చీకటి గాథల
శవాల పర్యవసానం.

అప్పటి మేఘాలు లేవు
చంద్రుడూ ముసలివాడైపోయాడు.
శతాబ్దాలు నిశ్శబ్దాల్లో కొట్టుకపోయాయి.
అవును ఇది
ఒకప్పటి మానవప్రయత్నానికి బృహత్ప్రతీక,
భద్రతాభ్రమలకు

తిరుగులేని సరిహద్దురేఖ.


పర్వతాలను అలంకరిస్తూ ఎగిరే
డ్రాగన్‌కు ప్రతికృతి ఇది,
గోడ దేశానికి
ప్రసిద్ధి తెచ్చిపెట్టిన
విచిత్ర కావ్యకృతి.

అయితే దేశం లోపల
వేలాది సంవత్సరాలుగా మొలిచిన
అంతరాల గోడలు,
అంతులేని మానవయాతనల
దయనీయ జాడలు.

గోడలు ఎప్పటికైనా పగలాల్సిందే కదా!
పగుల గొట్టిన మొనగాడొచ్చాడు.
గోడలు లేని దేశంలో
ఇప్పుడీ గోడ
వొట్టి మ్యూజియం గోడే!

■ ఎన్. గోపి

కాగితం మీద అక్షరానికి కట్టుబడ్డ కవి



వరవరరావు కవిగా ప్రజల పక్షం, అధ్యాపకుడిగా విద్యార్థుల పక్షం, చర్చల ప్రతినిధిగా విప్లవకారుల వైపు, రచయితగా పోరాడే ప్రజల వైపు, వక్తగా ప్రజల గొంతును విన్పించే ఉపన్యాసకుడు. ఏలికకు ఇది నచ్చలేదు. 'నా వైపు నీవు లేవంటే నా శత్రువు' అని ప్రకటించారు.

ఇది కాలం వెంట వెలుగులు విరజిమ్ముతూ పరుగిడిన అక్షరాల సంగతి. నీలి ఆకాశంలో ఉదయించిన సోషలిస్టు చంద్రుడిని పరిచయం చేసి, ఆకాశం అంచు మీద వికసితమైన పుడమి తల్లి ప్రస్తావన. రాలిపోయిన చుక్కల నెత్తురు తాగి చీకట్లను కురుస్తున్న రాత్రిని తుదముట్టించిన చలినెగళ్ల చరిత్ర. జెయిలు గోడ ముళ్ల తీగ మీద కూర్చొని పక్షులు పాడుతున్న స్వేచ్ఛా గీతం.

వరవరరావు (వివి) యాభై ఏళ్లకుపైగా కవిత్వం రాస్తున్నారు. ఒక రకంగా యాభై ఏళ్ల తెలుగు సామాజిక చరిత్రకు ఆయన కవిత్వం దాఖలా. బహుశా సామాజిక, రాజకీయార్థిక, సాంస్కృతిక అంశాలు ఇతివృత్తంగా స్వీకరించి ఇంత విస్తృతంగా రాసిన మరో తెలుగు కవి లేడు. తిరగబడు కవిగా ప్రస్థానం మొదలుపెట్టి, విప్లవ కవిగా రూపొందాక ఆయన కాగితం మీద అక్షరానికి కమిటై ఉన్నారు. విరసం వ్యవస్థాపక సభ్యునిగా కీలకంగా వ్యవహరించారు. నిషేధాలు, నిర్బంధాలు ఆయన అక్షరానికి పరిమితులు విధించలేకపోయాయి. పైగా అక్షరం మరింత పదునెక్కింది. కృష్ణశాస్త్రి ప్రభావంలో నుంచి బయటపడిన శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వానికి బాటలు వేసారు. వి.వి నేరుగా శ్రీశ్రీ ప్రభావంలోకి వెళ్లారు. పెండ్యాల కిషన్ రావు వి.వికి కృష్ణశాస్త్రిని, శ్రీశ్రీని పరిచయం చేసారు. వి.వి మాటల్లోనే చెప్పాలంటే "మాకు కిషన్‌రావు గారు సాహిత్యంలోకి కిటికీలే కాదు ద్వారాలు తెరిచాడు". కాళోజీ, పొట్లపల్లి రామారావు, శ్రీశ్రీ గేయాలను పాడుతూ కంది చేలల్లో తిరిగిన బాల్యం వి.విని కవిత్వం వైపు మళ్లించింది.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో (3 జనవరి, 1940) భూమి మీద పడ్డ వి.వి కళ్లు తెరిచి సాహిత్యంలోకి అడుగు పెట్టే నాటికి అధికార మార్పిడి జరిగిపోయి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ధాత కరువు, యుద్ధ సంక్షోభం, గ్రంథాలయ ఉద్యమం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మొదలైన సంక్షుభిత ప్రభావాలన్నీ ప్రత్యక్షంగా, పరోక్షంగా వి.వి మీద పడ్డాయి. దేశోద్ధారక గ్రంథమాల ప్రచురణ 'ప్రజల మనిషి', 'గంగు' నవలల అధ్యయనం ఆయనకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. అస్తిత్వమే చైతన్యాన్ని నిర్ణయిస్తుందని మార్క్స్ చెప్పినట్లు-తన చుట్టూ ఉండిన చరిత్రే కవిగా వి.వి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది. అందుకే ఈనాటికీ ఆయన కలానికి అంతటి నిబద్ధత ఉంది. సరిగ్గా ఈ సమయంలోనే శ్రీపతి (పి.చలపతిరావు) వి.వికి పాణిగ్రాహిని పరిచయం చేసాడు. పాణిగ్రాహి పాటల ద్వారా వి.వికి నక్సల్బరీ, శ్రీకాకుళ రాజకీయాలు పరిచయమయ్యాయి. 1965 నాటికే 'సృజన' ఏర్పాటు, రచనా వ్యాపకంపై నక్సల్బరీ రాజకీయాల ప్రభావం ఉంది. ఈ నేపథ్యంలోనే వరంగల్ జిల్లా రచయితల సభలలో (1968) 'స్వచ్ఛంద కవిత్వం-సామాజిక నిబద్ధత' అనే అంశంపై మాట్లాడుతూ "కాగితం మీద అక్షరానికి కమిట్ కావడమే కవి బాధ్యత" అని వి.వి చెప్పారు. ఆయనే చెప్పిన మాటకు ఐదు దశాబ్దాలుగా ఆయన నిబద్ధుడై ఉన్నారు.

వరవరరావు కవి, పరిశోధకుడు, విమర్శకుడిగా కంటే వ్యాస రచయితగా ఎక్కువగా తెలుసు. ఐదు దశాబ్దాలుగా కళ్ల ముందరి కాలాన్ని వ్యాఖ్యానిస్తూ వస్తున్నాడు. విప్లవం, యుద్ధం, నిర్బంధం, దళితులు, ఆదివాసులు, ముస్లింలు, వ్యవసాయం, పారిశ్రామిక రంగం, ప్రాంతీయ, జాతుల ఉద్యమాలు, విద్యారంగం, గ్లోబలైజేషన్, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఇట్లా అనేక విషయాల మీద వందల కొద్ది వ్యాసాలు రాసాడు. ఒక సమస్య మీద శాస్త్రీయమైన అవగాహనను ఏర్పరచుకోవడానికి వి.వి వ్యాసాల కోసం ఎదురు చూసే మేధావి వర్గం ఇప్పటికీ ఉందంటే తెలుగు సమాజంపై ఆయన ముద్ర ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. కవిత్వం కంటే తక్షణ స్పందనగా ఆయన వ్యాస ప్రక్రియనే ఎంపిక చేసుకుంటారు. చెప్పదల్చుకున్న విషయం ఎక్కువ మంది పాఠకులకు చేరాలంటే వ్యాస ప్రక్రియ తప్ప మరొకటి ఆ ప్రయోజనాన్ని నెరవేర్చదని భావిస్తారు.

వి.వి ఉత్తమ పరిశోధకుడనే విషయం కొందరికే తెలుసు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో సాహిత్యాన్ని చదువుకున్నారు. 'ఏ' హాస్టల్ నుంచి అటు ఎన్‌సీసీ, ఇటు తార్నాక వరకు క్యాంపస్ దారులవెంట రాలిన బొడ్డుమల్లెలు వెదజల్లిన సువాసన వలె ఆయన కవిత్వం వికసించింది. సృజనాత్మక ప్రక్రియ వద్దనే ఆగిపోకుండా ఆయనలోని పరిశోధకుడిని తట్టిలేపారు. ఫలితంగా 'తెలంగాణ విమోచనోద్యమం-తెలుగు నవలలు' విశ్లేషణ గ్రంథం వచ్చింది. నవలలో ప్రతిఫలించిన సమాజాన్ని గతితార్కిక పద్ధతి ద్వారా వివరించే పరిశోధన లక్షణాన్ని వి.వి ప్రవేశపెట్టాడు. "సాహిత్యం సామాజిక చైతన్యరూపం కాబట్టి ఈ సాహిత్యాన్ని పరిశీలించేటప్పుడు ఉత్పత్తి శక్తుల అభివృద్ధి ఉత్పత్తి సంబంధాల మార్పు దృష్టితోనే పరిశీలించాలి. సామాజిక అస్తిత్వంతో అన్వయించకుండా సాహిత్యాన్ని పరిశీలించకూడదు" (సాహిత్యంలో సమాజ చలనపు ప్రతిఫలనం; 2013, పుట.3) అని వి.వి తన పరిశోధన ద్వారా ఆనాడే ప్రతిపాదించారు.

వరవరరావు విమర్శకుడు కూడా. వందల పుస్తకాలకు పీఠికలు రాసాడు. ముందు మాటలలో కేవలం వాచక విశ్లేషణ కాకుండా నేపథ్య వివరణ, between the linesలో ఉండే భావం, రచనకు రచయితకు మధ్య ఉండే గతితార్కిక సంబంధం, కావ్య ఇతివృత్తానికి శిల్ప సౌందర్యానికి మధ్య ఉండే సామాజిక-సాహిత్య సంబంధాల విశ్లేషణ ఆయన పీఠికలలో ఉంటుంది. ఏ రచనకైనా దానికదిగా ప్రత్యేక అస్తిత్వం ఏమీలేదని, సామాజిక అంతర్ ఘర్షణ ప్రతిబింబమే సాహిత్య వ్యక్తీకరణ అని వి.వి దృక్పథం. ఆయన విమర్శనా శక్తిని పట్టుకోవాలంటే శుద్ధ సాహిత్య జ్ఞానం సరిపోదు. చరిత్ర, రాజకీయార్థిక అధ్యయన సంస్కారం ఉండి తీరాల్సిందే. 'భూమితో మాట్లాడు: కల్పనా సాహిత్యం-వస్తు వివేచన' అని 2005లో ఒక పుస్తకం వచ్చింది. 'ప్రజల మనిషి', 'గంగు', 'అంపశయ్య', 'కొమురంభీం', 'కొలిమంటుకున్నది' మొదలైన నవలలు, కొన్ని కథల మీద వి.వి రాసిన 23 వ్యాసాలతో ఈ పుస్తకం వచ్చింది.

ఇవన్నీ ఒక ఎత్తయితే వక్తగా వరవరరావు ప్రభావం ఈ సమాజం మీద అద్భుతమైనది. ఆ తరంలో ప్రభావశీలమైన వక్తల పేర్లు చెప్పవల్సివస్తే కాశీపతి, జ్వాలాముఖి, త్రిపురనేని మధుసూదనరావు, వరవరరావు, కత్తిపద్మారావు. వక్తృత్వాన్ని ఒక కళగా వి.వి అభివృద్ధి చేసాడు. డెబ్బై ఎనిమిది ఏళ్లలోకూడా ఆయన కంచు కంఠంలోని రాజకీయ స్పష్టత తగ్గలేదు. కాగితంమీద అక్షరానికి కమిటైనట్లే సభలోని మాటల ఒరవడికి కూడా ఆయన నిబద్ధుడై ఉన్నాడు. 'గాత్ర మంతా గాత్రమై' అని సంస్కృతంలో ఒక మాట ఉంది, అంటే శరీరమంతా పాటై అని అర్థం. సరిగ్గా వక్తృత్వం ద్వారా ఈ పనిని చేస్తున్నాడు వి.వి.

వరవరరావు యాభైఏళ్ల కవిత్వాన్ని ఒకే పుస్తకంగా 2008లో ప్రచురించారు. ఒక వెయ్యా ముప్పై పేజీల రచన అది. కాని తెలుగు సాహిత్య ప్రపంచం దానిని విశ్లేషించే, అంచనా కట్టే పని చేయలేదు. ఐదు దశాబ్దాలుగా కవిత్వ సృజన చేసిన, కవిగా గణనీయమైన గుర్తింపు ఉన్న వి.వి కవిత్వాన్ని తూచే విమర్శకులు లేకపోవటమా? సీరియస్ శాస్త్రీయ విమర్శ లేని లోపం వలననే ఈ సమస్య ఉందని నాకు అన్పిస్తుంది. ఇప్పుడు తెలుగు సాహిత్యం విమర్శ లేమిని ఎదుర్కొంటున్నది. వరవరరావు కవిత్వాన్ని అంచనా వేయాలంటే ఐదు దశాబ్దాల చరిత్ర, రాజకీయార్థిక పరిణామాలు, సాంస్కృతిక మార్పులు తెలిసి ఉండాలి. అప్పుడే ఆయన కవిత్వాన్ని సరిగ్గా అంచనా వేయగలుగుతాం.

వరవరరావు కవిత్వాన్ని అంచనా వేయాలంటే ఐదు దశాబ్దాల చరిత్ర, రాజకీయార్థిక పరిణామాలు, సాంస్కృతిక మార్పులు తెలిసి ఉండాలి. అంతమాత్రమే కాదు, వాటి పట్ల అవగాహన ఉండాలి. ప్రతీ మార్పుకు కార్యకారణ సంబంధమేమిటో తెలియాలి. అప్పుడే ఆయన కవిత్వాన్ని సరిగ్గా అంచనా వేయగలుగుతాం.

రచయితలను పాలకులు ఎప్పుడూ ప్రతిపక్షంగానే చూస్తారు. ప్రతిపక్షాలు శూన్యమైన సందర్భంలో రచయితలు, కవుల పాత్ర మరింతగా పెరుగుతుంది. ఆ పాత్రనే వరవరరావు నిర్వహిస్తున్నారు. దేశంలో అమలవుతున్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా గొంతెత్తి మాట్లాడుతున్నారు. వరవరరావు కవిగా ప్రజల పక్షం, అధ్యాపకుడిగా విద్యార్థుల పక్షం, చర్చల ప్రతినిధిగా విప్లవకారుల వైపు, రచయితగా పోరాడే ప్రజలవైపు, వక్తగా ప్రజల గొంతును విన్పించే ఉపన్యాసకుడు. ఏలికకు ఇది నచ్చలేదు. 'నా వైపు నీవు లేవంటే నా శత్రువు' అని ప్రకటించారు.

అసమ్మతిని ఒప్పుకోలేని కాలంలో జీవిస్తున్నాం. పార్లమెంటరీ, ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న సందర్భంలో ఉన్నాం. దళితులు, ముస్లింలు, ఆదివాసులు, మహిళలు, విప్లవకారులు, హేతువాదులు, ప్రజాస్వామికవాదుల మీద నాలుగు పడగల హైందవ నాగరాజు పడగ విప్పి బుస కొడుతున్నాడు. ఈ సందర్భంలో బుద్ధిజీవుల పాత్ర విస్మరించలేనిది. భావప్రకటన స్వేచ్ఛకోసం సామూహిక స్వరం వినిపించకపోతే చరిత్రలో నేరస్థులమయ్యే స్థితి వస్తుందేమో. వరవరరావే రాసినట్లు:-

నేరమే అధికారమై
ప్రజల్ని నేరస్థుల్ని చేసి వేటాడుతుంటే
ఊరక కూర్చున్న
నోరున్న ప్రతివాడూ నేరస్థుడే"

(కవిగా వరవరరావు యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా)

■ **చింతకింది కాశీం**

"ఒక రిక్షా మీద చూసిన వాక్యం ఈ పుస్తకానికి ప్రేరణ"

ఇటీవల మీ సంపాదకత్వంలో వేర్వేరు రచయితల 24 కథలతో వచ్చిన 'ఆనాటి వాన చినుకులు' కథా సంకలనం వెనుక ప్రేరణ గురించి చెప్పండి?

చెట్టుమీద నుంచి ఒక యాపిల్ తనమీద పడినప్పుడు "ఇది కిందకు ఎందుకు పడిందీ... పైకెందుకు వెళ్ళలేదూ" అని ఎప్పుడో న్యూటన్‌కి వచ్చిన ఆలోచనవల్ల 'భూమ్యాకర్షణ' అన్న వైజ్ఞానిక వాస్తవం మనకు తెలిసింది. అలాగే ఎన్నో ఏళ్ళ క్రిందం, కృష్ణా జిల్లాలోని మా ప్రాంతంలో తిరిగే గూడు రిక్షా మీద వున్న "ఆనాటి వాన చినుకులు" అన్న వాక్యం నాలో రేకెత్తించిన ఆలోచనే ఈ పుస్తకం రావటానికి కారణమైంది. ఆ వాక్యం చూసిన వెంటనే నాకు అబ్బురం అనిపించింది. మామూలుగా దేవుళ్ళ బొమ్మలూ, సినిమా తారల బొమ్మలూ, సినిమాల పేర్లూ, ప్రకృతి దృశ్యాలూ ఉండేచోట ఇంత భావుకత నిండిన వాక్యం ఎలా వచ్చిందీ అన్న ఆలోచన. ఆ ఆలోచన కొన్ని ప్రశ్నలకు దారితీసింది. ఈ వాక్యానికి కర్తలు ఎవరూ అన్నది తొలి ప్రశ్న. సమాధానంగా రిక్షా నడిపే వ్యక్తీ, రంగువేసిన పెయింటరూ, రిక్షా తయారైన కర్మాగారం యజమానీ, ఇలా కొంతమంది ఆలోచనల్లో తిరిగారు. ఆ తర్వాత అసలు ఈ వాక్యం వెనక కథ ఏమై ఉంటుందీ అన్న ప్రశ్న పుట్టింది. ఏదో ఒక అనుభవమో, అనుభూతో, సంఘటనో లేకుండా ఈ వాక్యం పుట్టదు కదా అనిపించింది. ఆ ఆలోచన అక్కడ ఆగలేదు. అసలు ఆ వాక్యం వెనక కథ ఏమై వుంటుందీ అనిపించింది. ఆ 'కథ' ప్రేమ కథ కావచ్చు, ఆకలి కథ కావచ్చు, రైతు కథ కావచ్చు, ఒక స్త్రీ వేదన కావచ్చు... ఇలా ఎన్నో రకాలుగా ఉండే అవకాశం వుంది కదా అనిపించింది.

ఈ ఆలోచనలన్నీ నాలో ఒక ఉత్కంఠను రేపాయి. కొంతమంది రచయితలు ఈ వాక్యం వెనక 'కథలు'గా తమ అనుభవాలనుంచో, తమ కల్పనా చాతుర్యంతోనో రాస్తే ఎలా వుంటుందీ అన్న కొత్త ఆలోచన పుట్టింది.

ఈ ఆలోచనలన్నీ దర్శకుడు-రచయిత వంశీతో చెప్పాను ఒక సందర్భంలో. అతను స్పందించి ఆ పేరుతో ఒక కథ రాయటమూ, ఒక పత్రికలో అది ప్రచురింపబడటమూ జరిగింది. అలా 'ఆనాటి వాన చినుకులు' పేరుతో తొలి కథ పుట్టింది. ఆ కథతో మరికొన్ని కలిపి 'ఆనాటి వాన చినుకులు' పేరుతో కథా సంకలనం తెచ్చాడు కూడా వంశీ. ఇది దాదాపు ఇరవై ఏళ్ళ కిందటి విషయం. తర్వాత నాలుగేళ్ల క్రితం, ఈ ఆలోచన మళ్ళీ కదిలింది నాలో. అప్పట్లో ఒక సినిమాకు పని చేయగా వచ్చిన పారితోషికం దన్నుతో ఇలా ఒక కథా సంకలనం తేవచ్చు కదా అనిపించి ఆ ప్రయత్నం మొదలెట్టాను. ఫలితమే ఈ కథా కదంబం.

ఈ సంకలనానికి రచయితల నుంచీ కథలు సమకూర్చే ప్రయత్నంలో మీ అనుభవాలు?

ఈ పుస్తకం తెద్దామన్న ఆలోచన వచ్చాక రచయితలుగా ఎవర్ని ఎన్నుకోవాలని ఆలోచించాను. నేను 1970 నుంచీ 73 వరకూ స్వాతి మాస పత్రికలోనూ, 73 నుంచీ 82 వరకూ జ్యోతి మాస పత్రికలోనూ సంపాదక శాఖలో పని చేశాను. ఆ కారణంగా చాలామంది ఆ తరం రచయితలతో చాలా పరిచయాలున్నాయి. తర్వాత సినిమాలలోకి వెళ్ళినా 'చదవటం' ఆపకపోవటంతో తర్వాతి తరం రచయితల రచనలతోనూ పరిచయం ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకొని మొదట ఒక పదిమంది రచయితలనెన్నుకొని, కొంచెం భిన్నంగా వుండాలని



'ఇన్‌లాండ్' కవర్లలో ఉత్తరాలు రాసి, తర్వాత ఫోన్‌లో సంప్రదించాను. చాలా ప్రోత్సాహకరమైన స్పందనే వచ్చింది. దీన్నొక ప్రయోగంగా వాళ్లు భావించారు.

పది రోజులలోపే పొత్తూరి విజయలక్ష్మిగారు కథ పంపారు. అది నా ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. కాని మిగతా కథలు అంత త్వరగా కదిలి నా దగ్గరకు రావటం లేదు. ఈ ఆలోచనతోనే రాసిన కథ కనుక అంతకుముందు వంశీ రాసిన కథనే ఈ సంకలనంలోకి తీసుకొనేందుకు అతని అనుమతి కోరాను. ఇంతమంది కొత్త కథలు రాస్తుండగా, నాది పాతదెందుకు నేనూ కొత్తదే రాస్తానన్నాడు వంశీ. (అలా రాయలేదు, అది వేరే సంగతి). నెమ్మది నెమ్మదిగా ఒకటీ ఒకటీ కథలొస్తున్నాయి. ఈ లోపు వేరు వేరు సందర్భాల్లో కలిసిన కొంతమంది రచయితలకు వ్యక్తిగతంగా వివరించి కథలు అడిగాను.

ఈ ప్రయత్నంలో విశేషం ఏమిటంటే, నా చిరకాల మిత్రుడు తనికెళ్ళ భరణి నా కోరికకు స్పందించి దాదాపు ఇరవై అయిదేళ్ళ తర్వాత కథ రాయటం. అలాగే ఈ ఆలోచనకు ఉత్తేజితుడై, ఉత్సాహపడి డా. వాసిరెడ్డి రమేష్ బాబు తన జీవితంలో తొలి కథ రాయటం.

కొంతమంది సగం రాసి ముందుకు సాగటం లేదని వదిలేసిన వాళ్ళు వున్నారు. ఇద్దరు ముగ్గురు అసలీ ఆలోచనే అంగీకరించనివాళ్ళు వున్నారు. చివరివరకూ ప్రయత్నిస్తున్నాం అనీ రాయలేకపోయిన వాళ్ళూ ఉన్నారు. ఆలస్యం అయిన కారణంగా కొందరు రచయితలు నాకు పంపిన రచనలని, నాకు చెప్పే వేరే పత్రికలలో ప్రచురణకు పంపారు. అలా గొర్తి సాయిబ్రహ్మానందం గారి కథ ప్రచురితమైనప్పుడు

వేమూరి సత్యనారాయణ ❖ పలకరింపు

రిక్షా మీద వాక్యం కథకు మూలం అవటంతో, ఎప్పుడో రాసిన వంశీ కథను 'కాపీ' కొట్టిన విమర్శనూ ఎదుర్కొన్నారు. తరువాత ఈ విషయాన్ని వివరించవలసి వచ్చింది.

రెండేళ్ళ క్రితం కథ అడిగి, అప్పుడప్పుడూ గుర్తు చేసి, ముద్రణా ప్రయత్నాల పురోగతిని వివరించి ఎంతో ఇష్టంగా ఒక రచయిత కథ వేద్దామనుకొంటే 'ఇలా మెడ మీద కత్తిపెట్టి రాయమంటే రాయడం కుదరదండీ' అనిపించుకోవటం ఒక విచిత్రానుభవం.

ఈ సంకలనాన్ని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించవలసింది కన్నెగంటి రామారావుగారి 'ఇలా కూడా కథలు' పేరుతో వచ్చిన ముందుమాట. ఆయన ఏ విషయాన్నయినా కూలంకషంగా తెలుసుకొని, దానికి సంబంధించిన ఇతర విశేషాలు సేకరించి మంచి విశ్లేషణాత్మకంగా తన అభిప్రాయాలు పంచుకోవటం గమనించి ఆయనను ఈ ముందు మాట రాయమని కోరాను. అయితే ఇందులో కథలేవీ పంపననీ, కేవలం ఈ ప్రయోగాంశాన్ని తీసుకుని, దానికి సంబంధించి ఇతర సమాచారంతో ముందు మాట రాయమనీ కోరాను. ఈ పుస్తకానికి సంబంధించక పోయినా దానంతటదే గొప్ప వ్యాసంగా రూపొందింది.

మొత్తానికి రచయితలందరి సహకారంతో నా ఆలోచన పుస్తకరూపందాల్చింది. ఇక నేను రాసిన కథ విషయానికొస్తే నాలుగేళ్ళ క్రితమే ఇలా రాద్దామనుకొన్నా, అందరి తర్వాత చివర్లో రాయటం జరిగింది. మధ్యలో చాలామందికి ఇలా రాస్తున్నానని ఆ కథ వివరంగా చెప్పటం వల్లనేమో కేవలం రెండున్నర గంటల్లోనే రాయగలిగాను. ఒక కథ త్వరగా 'రాయటానికి' ఇదొక మంచి చిట్కా అనిపించింది.


ఇలాంటి ప్రయత్నాలు ఇంకా మనసులో ఉన్నాయా?

ఇంతకుముందు లేవు. ఇప్పుడు ఆలోచనల్లోకి వచ్చాయి. ఈ సంకలనం తయారీలో రచయితలు, స్నేహితుల సహకారం; సంకలనం వచ్చాక పాఠకుల నుంచీ, ఇతర రచయితల నుంచీ వస్తున్న ప్రశంసాపూర్వక అభినందనలు ఉత్సాహాన్నిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు నలుగుతున్న ఆలోచన: కేవలం హైస్కూల్, కాలేజి విద్యార్థులలో రచనాసక్తి వున్నవారిని గుర్తించి, వారిని ప్రోత్సహించి ఒక 'సంపాదక వర్గాన్ని' ఏర్పరిచి, వారి సహకారం ఈ యువ రచయితలకు అందజేసి అలా రాయించిన కథలతో ఒక సంకలనానికి ప్రయత్నం చేద్దామని. చూడాలి సాధ్యాసాధ్యాలు!

✆ 98483 21703

అసెంబ్లీ కవరేజిపై ఆంక్షలు

- సమావేశాలకు మీడియా ప్రతినిధులపై నియంత్రణ
- లాబీ పాస్ ఉంటే లాబీల్లోని లాంజ్ వరకే అనుమతి
- మీడియా పాయింట్‌లో మాత్రమే ఇంటర్వ్యూలు
- మాజీ సభ్యులు, ఇతరులతో ఇంటర్వ్యూలపై నిషేధం
- మార్గదర్శకాలు విడుదల చేసిన అసెంబ్లీ కార్యదర్శి



హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రెండో శాసనసభ మొదటి సమావేశాల కవరేజికి సంబంధించి మీడియాపై పలు ఆంక్షలు విధించారు. ఈ నెల 17న ప్రారంభం కానున్న ఈ సమావేశాలను పురస్కరించుకొని అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధుల కదలికలపై నియంత్రణ విధించారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు ఆదివారం విడుదల చేశారు. వీటి ప్రకారం.. లాబీ పాస్ ఉన్నవారిని మాత్రమే అసెంబ్లీ లాబీల్లోకి అనుమతిస్తారు. లాబీ, గ్యాలరీ పాస్ ఉన్న రిపోర్టర్లు తప్పనిసరిగా స్వైపింగ్ చేయాలి. అసెంబ్లీ జరిగినన్ని రోజులు లాబీ పాస్ ఉన్న మీడియా ప్రతినిధులు లాబీల్లోని మీడియా లాంజ్‌లోనే కూర్చోవాలి. అసెంబ్లీ ఇన్నర్ లాబీలోకి ప్రవేశించకూడదు. అసెంబ్లీలోని స్పీకర్, సీఎం, మంత్రుల పేషీలకు సమీపంలోకి మీడియా ప్రతినిధులు వెళ్లడంపై నిషేధం విధించారు. గ్యాలరీ నిండిన సమయంలో గ్యాలరీ పాస్ ఉన్న రిపోర్టర్లు అక్కడ నిలబడకూడదు. గ్యాలరీలోకి ప్రవేశించే ముందు రిపోర్టర్లు తమ వెంట ఉన్న సెల్‌ఫోన్లు, కెమెరాలను డిపాజిట్ చేసి వెళ్లాలి. మీడియా పాయింట్ పాస్‌లను కేవలం మీడియా పాయింట్ వరకు మాత్రమే అనుమతిస్తారు. మీడియా పాయింట్ ఆవరణలో మినహాయించి అసెంబ్లీలోని ఇతర ప్రాంతాల్లో నేతల ఇంటర్వ్యూలు తీసుకోకూడదు. మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు సభ్యులు కాని ఇతర నేతలతోనూ మీడియా పాయింట్‌లోగానీ, ఇతర పరిసరాల్లోగానీ ఇంటర్వ్యూలు చేయరాదు. మీడియా ప్రతినిధులు తమ టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలను పబ్లిక్ గార్డెన్స్‌లోనే పార్క్ చేయాలి. ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ఓబీ వ్యాన్, డీఎస్ఎన్‌జీ వాహనాలను అనుమతించే విషయంలో.. మొదటిగా వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యం ప్రాతిపదికన ప్రవేశం కల్పిస్తారు.

పొగమంచుతో ఉక్కిరిబిక్కిరి

ఉదయం పదైనా కనిపించని సూర్యుడు

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్, జనవరి 13: హైదరాబాద్ పరిసర ప్రాంతాలు ఊటిని తలపిస్తున్నాయి. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలో దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో ఉదయం పది గంటల తర్వాతే సూర్యుడు కనిపించాడు. పొగమంచు కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు 40-50కిలో మీటర్ల వేగంతో వెళ్లాయి. పొగమంచు వల్ల ఉదయం 10 గంటల వరకు వాహనదారులు లైట్ల వెలుతురులోనే ప్రయాణించారు. రైళ్లు కూడా తక్కువ వేగంతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సికింద్రాబాద్-వరంగల్ మార్గంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిదానంగా వెళ్లాయి. విపరీతమైన పొగమంచు కారణంగా చాలా మంది వాహనాదారులు తమ వాహనాలను రోడ్డు ప్రక్కన నిలిపివేశారు.



ఘట్‌కేసర్‌లో జాతీయ రహదారిపై పొగమంచులో ప్రయాణిస్తున్న వాహనాలు

చెన్నారెడ్డి.. గొప్ప పాలనాదక్షుడు

నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి ... జీవితచరిత్రను పుస్తకరూపంలో తేవాలి

- శతజయంత్యుత్సవాల్లో వక్తల పిలుపు

కవాడిగూడ/హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గొప్ప పరిపాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడు అయిన మర్రి చెన్నారెడ్డిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని రాజకీయ ప్రముఖులు, వక్తలు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ మర్రి చెన్నారెడ్డి జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకొచ్చి భవిష్యత్ తరాలకు తెలియజేయాలని సూచించారు. ఇందిరాపార్కులోని చెన్నారెడ్డి రాక్‌గార్డెన్‌లో చెన్నారెడ్డి పేరుమీద మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు. మర్రి చెన్నారెడ్డి శత జయంత్యుత్సవాలను ఆదివారం ఆయన సమాధి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య, మాజీ సీఎం నాదెండ్ల భాస్కర్‌రావు, ఎంపీలు బండారు దత్తాత్రేయ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నంది ఎల్లయ్య, టి.సుబ్బిరామిరెడ్డి, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి తనయుడు మర్రి శశిధర్‌రెడ్డి, ఇతరనేతలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని ఆయన సమాధి వద్ద నివాళులు అర్పించారు.



మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఉత్తమ్, రోశయ్య

ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. శాసనసభలో ప్రతిపక్షాల దాడిని సైతం హుందాగా స్వీకరించే సీఎంలలో స్వర్గీయ చెన్నారెడ్డి ఒకరని పేర్కొన్నారు. చెన్నారెడ్డి 1969లో తెలంగాణకుఅన్యాయం చేశారన్నది తప్పన్నారు. ఆయన గొప్ప పరిపాలనా దక్షుడు, రాజనీతిజ్ఞుడన్నారు. ఆయన ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలని సూచించారు. ఉత్తమ్ మాట్లాడుతూ.. మర్రి చెన్నారెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎనలేని పోరాటం చేశారన్నారు. చెన్నారెడ్డి శతజయంతి సందర్భంగా యావత్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నివాళులర్పిస్తోందని, ఆయన చూపిన బాటలో ముందుకు సాగుతామని తెలిపారు. నాయిని మాట్లాడుతూ.. తెలంగాణ కాంగ్రెస్‌లో మర్రి చెన్నారెడ్డి మొనగాడన్నారు. పుస్తకం ద్వారా ఆయన జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలన్నారు. మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. చెన్నారెడ్డి దార్శనికుడిగా, గొప్ప పరిపాలనా దక్షుడిగా నిలిచారన్నారు.

కందుల విక్రయాల్లో గోల్‌మాల్

- ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డిపై చర్యలు
- నిజామాబాద్ డీఎంగా హోదా కుదింపు
- మార్క్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డిపైనా వేటు

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కందుల విక్రయాల్లో పెద్దఎత్తున గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించిన ప్రభుత్వం.. బాధ్యులపై చర్యలు ప్రారంభించింది. డిసెంబరు 24న మార్క్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డిపై వేటు పడగా.. తాజాగా ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి హోదాను కుదించింది. మార్క్‌ఫెడ్, హాకా సంస్థలకు ఎండీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సురేందర్‌రెడ్డి స్థానాన్ని వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ భాస్కరాచారితో భర్తీ చేసింది. ఇటు ప్రవీణ్‌రెడ్డిని ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్ (రాష్ట్రస్థాయి) స్థానం నుంచి తొలగించి, నిజామాబాద్ జిల్లా మేనేజర్‌గా బదిలీ చేసింది. నిజామాబాద్ డీఎం చంద్రశేఖర్‌కు ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్ బాధ్యతలను అప్పగించింది. ఈ కీలక పరిణామాల వెనుక 2017-18 సీజన్‌లో జరిపిన కందుల విక్రయాల్లో గోల్‌మాలే కారణమని మార్క్‌ఫెడ్ వర్గాలు చెబుతున్నాయి.

ఇదీ తెరవెనక కథ!

ప్రభుత్వం మార్క్‌ఫెడ్, హాకా ద్వారా 2017- 18 సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1.86 లక్షల మెట్రిక్ టన్నుల కందులను రైతుల నుంచి సేకరించింది. క్వింటాకు రూ. 5,450 చొప్పున ధర చెల్లించింది. మార్క్‌ఫెడ్ ఆ ఏడాది నవంబరు మొదటివారం వరకు 46,330 మెట్రిక్ టన్నులను విక్రయించగా.. 1,39,336 టన్నుల కందులు మిగిలిపోయాయి. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం కందులకు రూ.5,675 మద్దతు ధర ప్రకటించింది. అయినా.. మార్కెట్‌లో డిమాండ్ లేదని, కొనుగోలుకు ట్రేడర్లు ముందుకు రావటం లేదని, కందుల నిల్వతో నెలకు సగటున రూ.8 కోట్లు నష్టం వస్తోందని మార్క్‌ఫెడ్ అధికారులు లెక్కలు చూపించారు. కందులను మిల్లింగ్ చేసి.. చౌకడిపోల ద్వారా సబ్సిడీపై కందిపప్పును విక్రయించడమే మార్గమంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అందుకు ప్రభుత్వం అంగీకరించలేదు. ముగ్గురు మంత్రుల బృందం చర్చలు జరిపి.. బల్క్ టెండర్ పిలవాలని నిర్ణయించింది. దీంతో మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు, మద్దతు ధరల కంటే.. కందిపప్పు ధరను అమాంతం తగ్గించి, క్వింటాకు రూ.3,234.80 చొప్పున 31 మంది ట్రేడర్లకు విక్రయించారు. ఈ క్రమంలో భారీగా గోల్‌మాల్ జరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. అదే సమయంలో కందుల విక్రయాల్లో భారీగా జరిగిన గోల్‌మాల్‌పై ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ట్రేడర్లతో సురేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి మిలాఖత్ అయినట్లు నిర్ధారించుకున్న సర్కారు.. వారిద్దరిపై చర్యలు తీసుకుంది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- హోం మంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆయనను ఆదివారం టీఎన్‌జీవో సెంట్రల్ యూనియన్ నేతలు కలిసి అభినందించారు. హోంమంత్రిని కలిసిన వారిలో టీఎన్‌జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, ముజీబ్ హుస్సేన్, జానీ మియా తదితరులు ఉన్నారు.

కేంద్రంపై సీఎం వ్యాఖ్యలు ఆక్షేపణీయం

- కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలకు హక్కులు, అధికారాల పంపిణీలో కేంద్రం వివక్ష చూపుతోందంటూ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ అన్నారు. సీఎం చేసిన వ్యాఖ్యలు తప్పు అని చెప్పారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాతే రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధుల సంక్రమణ 32 నుంచి 42శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం స్థానిక సంస్థలకు మాత్రం అదేరీతిన నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ మొదటి హయాంలో స్థానిక సంస్థలకు ఎన్ని నిధులు ఇచ్చారని, ఎన్ని అధికారాలు బదలాయించారని స్పష్టం చేయాలని సీఎం కేసీఆర్‌కు ఆయన ఆదివారం లేఖ రాశారు.

అంతర్జాతీయ రాక్ క్లైంబింగ్‌కు అఖిల్

- 25వేల ఆర్థిక సాయం ప్రకటించిన కలెక్టర్

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 13: వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ నయీంనగర్ ప్రాంతానికి చెందిన అఖిల్.. దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో గుట్టల్లో నిర్వహించే 'రాక్ క్లైంబింగ్ టూర్'కు ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ఈ టూర్‌కు ఇద్దరు ఎంపిక కాగా, వీరిలో అఖిల్ ఒకరు. నిరుపేద కుటుంబానికి చెందిన అఖిల్.. జిల్లా కలెక్టర్‌ను కలిసి తన ఆర్థిక పరిస్థితిని వివరించారు. దీనితో స్పందించిన కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ రూ. 25వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆదివారం అఖిల్.. మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని కూడా కలిశాడు. అఖిల్ పరిస్థితిని తెలుసుకున్న కడియం.. విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.



అఖిల్

కరీంనగర్ క్వారీలో ఒడిసా కార్మికుడి మృతి

- బాలాసోర్‌కు మృతదేహం తరలింపు
- క్వారీ అధికారిని నిర్బంధించిన గ్రామస్థులు

బాలాసోర్, జనవరి 13: క్వారీ యాజమాన్యం నిర్లక్ష్యంతో బండరాళ్ల మీద పడి ఒడిసాకు చెందిన ఓ కార్మికుడు మృతిచెందిన ఉదంతమిది. మృతుడిని ఒడిసాలోని బాలాసోర్ జిల్లా నరసింగాపూర్ గ్రామానికి చెందిన మనోరంజన్ మహాపాత్రగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటన శుక్రవారం కరీంనగర్ జిల్లాలోని ఓ స్టోన్‌క్రషర్ క్వారీలో చోటుచేసుకోగా.. ఆదివారం మృతదేహాన్ని నరసింగాపూర్‌కు తరలించారు. క్వారీ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే మనోరంజన్ చనిపోయాడంటూ.. ఆ గ్రామస్థులు ఆందోళన చేపడుతూ.. మృతదేహాన్ని తీసుకువచ్చిన క్వారీ అధికారి, అంబులెన్స్‌ను నిర్బంధించారు. క్వారీ యాజమాన్యం రూ. 15వేల నష్టపరిహారం ఇచ్చిందని సదరు అధికారి చెప్పగా.. మనోరంజన్ మృతిపై విచారణ జరపాల్సిందేనని గ్రామస్థులు భీష్మించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి బంధువుల నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. అదే సమయంలో.. తెలంగాణ పోలీసులు కూడా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బాలికపై రెండేళ్లుగా గ్యాంగ్‌రేప్

(మొదటి పేజీ తరువాయి)

సమీప బంధువే! ఈ కేసులో ఇప్పటివరకు ప్రధాన నిందితుడు సహా ముగ్గురినే పోలీసులు అరెస్టు చేశారు. బాలికపై అఘాయిత్యం చేసిన మరో వ్యక్తిని అరెస్టు చేయకుండా సాక్షిగా చేర్చారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ కామాటిపురలో ఈ ఘటన జరిగింది. నిందితుల్లో చాలా మంది బయటే తిరుగుతున్నారని పోలీసులపై ఆదివారం కుటుంబీకులు ఆగ్రహించడంతో ఈ ఘటన వెలుగు చూసింది. పోలీసులు, బాధితురాలి బంధువుల వివరాల ప్రకారం.. ఓ ఆయిల్ వ్యాపారి కుటుంబంతో కలిసి కామాటిపురా పీఎస్ పరిధిలో నివాసముంటున్నాడు. రెండేళ్లక్రితం ఓరోజు కుటుంబసభ్యులు పనికి వెళ్లిన తర్వాత బాలిక ఒంటరిగా ఉండడం చూసి సమీప బంధువైన రాజేశ్ మహేశ్వరి (25) ఇంట్లోకి వచ్చాడు. కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి తాగించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటననంతా వీడియోలో చిత్రీకరించాడు. దాన్ని చూపిస్తూ.. పలుమార్లు ఆమెపై అత్యాచారం చేశాడు. కొన్నాళ్లకు ఆ వీడియోను స్నేహితులు అబిజిత్ కౌశిక్, శుభమ్ వ్యాస్‌లకు షేర్ చేశాడు. తర్వాత ఆ వీడియో ఒకరి తర్వాత మరొకరికి షేరవుతూ 10మందికి చేరింది. వీడియోను బయటపెడతామని బెదిరిస్తూ రాజేశ్, అబిజిత్, శుభమ్‌తో పాటు మిగతా 8మంది బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారని కుటుంబసభ్యులు డిసెంబరు 24న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు డిసెంబరు 31న రాజేశ్, అభిజిత్, శుభమ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విజయ్‌కుమార్ అనే యువకుడిని పోలీసులు సాక్షిగా పేర్కొన్నారు. అయితే. తమ అమ్మాయిపై అఘాయిత్యానికి పాల్పడ్డవారిలో విజయ్ ఒకడని.. అతడిని సాక్షిగా నమోదు చేయడం ఏమిటని పోలీసులపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆదివారం బస్తీలో, కామాటిపురా పోలీస్ స్టేషన్ ఎదుట గుమిగూడి ఆందోళన నిర్వహించారు. కేసులో మిగతావారినీ తక్షణమే అరెస్ట్ చేసి ఉరి తీయాలంటూ డిమాండ్ చేశారు. నిందితుల చర్యలను పోలీసులు దాచిపెట్టే యత్నం చేస్తున్నారని ప్లకార్డులు ప్రదర్శించారు. దక్షిణ మండలం అడిషనల్ డీసీపీ మహ్మద్ రఫీక్, మీర్‌చౌక్ ఏసీపీ బి.ఆనంద్‌లు ఘటనా స్థలాన్ని సందర్శించారు. నిందితులను 24 గంటల్లో అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాలిక వాంగ్మూలం నమోదు చేశారు. నిందితుల పేర్లను సీఐ రుక్మిణి సమక్షంలో నమోదు చేశారు. కాగా, విజయ్ కుమార్ కూడా తనపై అత్యాచారం జరిపినట్లు బాలిక చెప్పడంతో ఈ కేసును సీసీఎస్‌కు బదిలీ చేసినట్లు సీపీ అంజనీకుమార్ పేర్కొన్నారు. ఏసీపీ శ్రీదేవి హయాంలో ఈ కేసు విచారణ సాగనుంది.

ఫిబ్రవరిలో కంటివెలుగు పూర్తి?

- దశలవారీగా శిబిరాల నిలిపివేత
- వచ్చేనెల చివరికి పరీక్షలు పూర్తి

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని వచ్చే నెలలో ముగించే అవకాశాలున్నాయి. ఫిబ్రవరిలో కంటి వెలుగు నిర్వహించే క్యాంపులను కొన్నింటిని నిలిపివేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. 2018 ఆగస్టు 15న మెదక్ జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాటి నుంచి కంటి వెలుగు శిబిరాలు నడుస్తూనే ఉన్నాయి. ఇప్పటివరకు 75 శాతం మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ ఐదు నెలల కాలంలో 7436 గ్రామాల్లో(దాదాపు మూడోవంతు) శిబిరాలు నిర్వహించారు. ప్రస్తుతం సంక్రాంతి సెలవులు కావడంతో శుక్రవారం నుంచి పరీక్షలు ఆపివేశారు. ఇప్పటివరకు 1.26 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించగా.. మరో 50 లక్షల మందికి అవసరమవుతాయని వైద్య,ఆరోగ్యశాఖ భావిస్తోంది. రీడింగ్ గ్లాసెస్ 19.84 లక్షలు పంపిణీ చేశారు. ప్రత్యేక అద్దాలు 15.29 లక్షల మందికి రిఫర్ చేయగా... ఇప్పటిదాకా 5.21 లక్షల మందికి పంపిణీ చేశారు. మిగిలిన 10 లక్షల ప్రత్యేక అద్దాలను దశలవారీగా పంపిణీ చేస్తున్నారు. 83.73 లక్షల మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని తేలింది. కాగా మిగిలిన 25 శాతం పరీక్షలు మరో 45 రోజుల్లో పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు. దానికి తోడు ఫిబ్రవరిలో ఈఎన్‌టీ, దంత పరీక్షలు నిర్వహించనుండటంతో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆలోపే పూర్తి చేయాల్సి ఉంటుందని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.



వైసీపీలోకి దగ్గుబాటి?

ఒంగోలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు వైసీపీలో చేరికకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ఆయన ఏకైక కుమారుడు హితేశ్ చెంచురామ్ ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కూడా సమాయత్తమవుతున్నట్లు సమాచారం. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కొంతకాలంగా దగ్గుబాటి, వైసీపీ అధినేత జగన్ మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. పార్టీలో దగ్గుబాటి చేరిక ఖాయమైందని వైసీపీలోని ఉన్నత స్థాయి నాయకులు చెబుతున్న సమయంలోనే పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఆయన అభిమానులు వైసీపీ ఫ్లెక్సీలపై దగ్గుబాటి, ఆయన కుమారుడు ఫొటోలు ఉంచి సోషల్ మీడియాలో ప్రచారానికి శ్రీకారం పలికారు. ప్రస్తుతం బీజేపీలో ఉన్న దగ్గుబాటి సతీమణి పురందేశ్వరి అదే పార్టీలో కొనసాగుతారని తెలుస్తోంది.



గతంలో సానుకూలం కాదు..

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పెద్దల్లుడైన దగ్గుబాటి వెంకటేశ్వరరావు.. తెలుగుదేశాన్ని వీడి.. 2004లో సతీమణితోపాటు కాంగ్రెస్‌లో చేరారు. 2004, 2009 ఎన్నికల్లో పర్చూరు ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి గెలుపొందగా.. పురందేశ్వరి బాపట్ల, విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గాల నుంచి విజయం సాధించి యూపీఏ హయాంలో కేంద్ర మంత్రిగా పని చేశారు. 2014 ఎన్నికల నుంచి దగ్గుబాటి క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యారు. అనంతరం పురందేశ్వరి బీజేపీలో చేరి ఆ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. గత ఏడాది నుంచి దగ్గుబాటిని పార్టీలో చేర్చుకునేందుకు వైసీపీ నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మరికొందరు నాయకులు కూడా గతంలో సంప్రదింపులు జరిపారు. అప్పట్లో దగ్గుబాటి నుంచి సానుకూలత వ్యక్తం కాలేదని తెలిసింది. నాలుగైదు నెలలుగా విజయసాయిరెడ్డి ఈ వ్యవహారంలో జోక్యం చేసుకున్నారు. కాగా ఈ విషయమై దగ్గుబాటిని 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి' ఫోన్లో సంప్రదించగా.. ప్రచారాన్ని ఖండించకపోవడం విశేషం. సమయం వచ్చినప్పుడు చెప్పాల్సింది చెబుతానని తెలిపారు.

రోడ్లపై ఉమ్మితే జరిమానా!

- హైదరాబాద్‌లో అమలు దిశగా జీహెచ్‌ఎంసీ
- ట్విటర్‌లో అదనపు కమిషనర్ ముషారఫ్ ఫారుఖీ

హైదరాబాద్ సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఇకపై హైదరాబాద్‌లో బహిరంగంగా ఉమ్మితే కఠిన చర్యలు తప్పవని జీహెచ్‌ఎంసీ అధికారులు హెచ్చరిస్తున్నారు. గుట్కాలు, పాన్‌లు నమిలి రహదారులపై ఉమ్మివేసే వారికి జరిమానా విధిస్తామంటున్నారు. టీఎస్ఎస్ ప్రసాద్ అనే వ్యక్తి.. పుణె తరహాలో బహిరంగంగా ఉమ్మివేసే వారిపై చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు శనివారం ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ ముషారఫ్ ఫారుఖీ.. హైదరాబాద్‌లో ఈ విధానం అందుబాటులోకి తెచ్చే అంశాన్ని పరిశీలిస్తామని బదులిచ్చారు. పుణె మున్సిపల్ కార్పొరేషన్ గత ఏడాది నవంబరు నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 25 మందికి జరిమానాలు విధించారు. బహిరంగంగా ఉమ్మివేసే వారి నుంచి రూ.150 జరిమానా వసూలు చేస్తున్నారు. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్‌లో బహిరంగ మూత్ర విసర్జన చేసేవారికి రూ.200 చొప్పున జరిమానాలు విధిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ వెల్లడించారు.

అంగన్‌వాడీల్లో అక్రమాలకు చెక్

సూపర్‌వైజర్లకు ట్యాబ్స్.. టీచర్లకు స్మార్ట్‌ఫోన్లు | **బయోమెట్రిక్ యాప్ ద్వారా పౌష్టికాహారం**

- వేలిముద్రలు తీసుకున్న తర్వాతే పంపిణీ
- పాలు, గుడ్లు పక్కదారికి కట్టడి
- 100 జిల్లాల్లో అమలుకు కేంద్రం నిర్ణయం
- తెలంగాణ నుంచి 4జిల్లాల ఎంపిక

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) అంగన్‌వాడీ కేంద్రాలు పరి'పుష్టి'కానున్నాయి! లబ్ధిదారులకు అందే పౌష్టికాహారం విషయంలో అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లు, మధ్యాహ్న భోజనం.. చిన్నారులకు బాలామృతం, మురుకులు (స్నాక్‌ఫుడ్) పక్కాగా అందనున్నాయి. రిజిస్టర్లలో లేనిపేర్లు నమోదు చేయడాలు.. కుళ్లిన గుడ్లు, నాసిరకం భోజనాన్ని వడ్డించడం.. సరుకులను పక్కదారి పట్టించడం వంటి అక్రమాలకు కాలం చెల్లనుంది. పౌష్టికాహార పంపిణీ పరంగా ఉన్న అవకతవకలకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చెక్ పెట్టాలని కేంద్ర సర్కారు నిర్ణయించింది. 'పోషణ్ అభియాన్' పథకంలో భాగంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్లకు ట్యాబ్స్, అంగన్‌వాడీ టీచర్లకు దశలవారీగా స్మార్ట్‌ఫోన్లు ఇవ్వనున్నారు. స్మార్ట్‌ఫోన్లలో ఉన్న బయోమెట్రిక్ యాప్‌లో లబ్ధిదారుల ఫొటోలు, వివరాలు నమోదు చేసి.. వేలిముద్రలను తీసుకొని పౌష్టికాహారాన్ని అందించాల్సి ఉంటుంది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 100 జిల్లాలను ఎంపిక చేయగా తెలంగాణ రాష్ట్రం నుంచి నాలుగు జిల్లాలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 22,28,150 మంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందుకుంటున్నారు. చాలాచోట్ల పౌష్టికాహార పంపిణీలో అక్రమాలు జరుగుతున్నట్లుగా ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలను తూతూమంత్రంగా నిర్వహిస్తుంటే.. ఇంకొన్ని చోట్ల అసలు తెరవడమే లేదు. రికార్డుల్లో మాత్రం పక్కాగా నడుస్తున్నట్లు చూపుతున్నారు. కాగా అంగన్‌వాడీల్లో పౌష్టికాహార పంపిణీ పరంగా నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు కేంద్ర మహిళాశిశు సంక్షేమ శాఖ పైలట్ ప్రాజెక్టుగా తొలుత ఉత్తర భారతంలోని ఒక రాష్ట్రాన్ని ఎంచుకుంది. అక్కడ సూపర్‌వైజర్లకు ట్యాబ్‌లు, టీచర్లకు స్మార్ట్‌ఫోన్లు ఇచ్చి పౌష్టికాహార పంపిణీలోని పలు ఇబ్బందులను బయోమెట్రిక్ విధానంతో అధిగమించారు. ఈ విధానం మంచి ఫలితం ఇవ్వడంతో దేశవ్యాప్తంగా తొలుత 100 జిల్లాల్లో అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో రాష్ట్రం నుంచి వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలను ఎంపిక చేశారు.



గాలిలో బస్సు!

(మొదటి పేజీ తరువాయి)

మహానందిలో దైవదర్శనం చేసుకుని, తర్వాత శ్రీశైలం భ్రమరాంబామల్లికార్జునుల దర్శనానికి బయల్దేరారు. ఆదివారం ఉదయం.. 8.30 గంటల ప్రాంతంలో.. ప్రకాశం జిల్లా దోర్నాల మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డు మీదుగా బస్సు రయ్‌మంటూ దూసుకువెళ్తోంది. ఆ సమయంలో చలి ఎక్కువగా ఉండడంతో యాత్రికులు దుప్పట్లు కప్పుకుని నిద్రలో ఉన్నారు. ఇంతలో ఘాట్ మధ్యలో.. దెయ్యాలమలుపు వద్ద బస్సు అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొట్టింది. బస్సు ఒక్కసారిగా గాలిలోకి లేచి.. గోడదాటి లోయకు దిగువ వైపున వేలాడుతూ అలాగే నిలిచిపోయింది. ఈ హఠాత్పరిణామంతో.. బస్సులోని యాత్రికులంతా హాహాకారాలు చేశారు. కిటికీల్లో నుంచి చూస్తే ఓవైపు 500 అడుగుల లోయ.. మరోవైపు రక్షణ గోడ అంచున వేలాడుతున్న బస్సు.. ఏమాత్రం కదిలినా బస్సు ఎక్కడ లోయలో పడిపోతుందో ఏమోనని ప్రాణాలరచేత పట్టుకున్నారు. చివరికి.. బస్సులోని పురుషులు కొందరు చాకచక్యంగా వ్యవహరించి యాత్రికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. శ్రీశైలం, దోర్నాల పోలీసులు స్వల్పంగా గాయపడిన కొందరికి 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. కొందరిని సున్నిపెంట వైద్యశాలకు తరలించారు. ఘాట్ రోడ్డుపై డ్రైవర్‌కు అవగాహన లేకపోవడం, బస్సును ఎక్కడా నిలపకుండా నడపడంతో బ్రేక్ ఫెయిలైనట్లు భావిస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం ఇదే ప్రాంతంలో టూరిస్టు బస్సు లోయలో పడి 30 మంది మృతి చెందారు.

లద్దాక్, కార్గిల్‌లో సోలార్ విద్యుత్ ప్లాంట్లు

- 7500 మెగావాట్లు, రూ.45వేల కోట్ల వ్యయం.. 2023 నాటికి పూర్తి

న్యూఢిల్లీ, జనవరి 13: జమ్మూకశ్మీర్‌లోని లద్దాక్, కార్గిల్ ప్రాంతాల్లో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) ఆధ్వర్యంలో భారీ పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నారు. లద్దాక్ సమీపంలో 5వేల మెగావాట్లు, కార్గిల్ సమీపంలో 2500 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్లు పెట్టి 2023 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. వీటికోసం దాదాపు రూ.45వేల కోట్లు వ్యయం చేయబోతున్నారు. లద్దాక్‌కు సంబంధించిన ప్రాజెక్టును లేహ్‌కు 254 కిమీ. దూరంలోని హన్లీ-ఖల్డోలోనూ, కార్గిల్ ప్రాజెక్టును జిల్లా కేంద్రానికి 254 కిమీ. దూరంలోని సురులో ఏర్పాటు చేస్తారు.

ఐఐటీ-హెచ్‌లో 79% మంది డిజైన్ ఇంజనీర్లకు ఉద్యోగాలు

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ-హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న డిజైనింగ్ ఇంజనీరింగ్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థుల్లో సుమారు 79 శాతం మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యారు. వెబ్‌సైట్ల డిజైనింగ్, మొబైల్ అప్లికేషన్ల రూపకల్పనలో డిజైన్ ఇంజనీర్ల ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ ఏడాది ఐఐటీ-హెచ్‌లో మొత్తంగా ప్రాంగణ నియామకాలు 12శాతం పెరగాయి. డిజైనింగ్‌లో పీజీ కోర్సు మాత్రమే అందిస్తున్నందున వచ్చే విద్యాసంవత్సరం నుంచి బ్యాచ్‌లర్ కోర్సును కూడా ప్రారంభించనున్నట్టు అధికారులు ప్రకటించారు.

18న బయోలజీ సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో భర్తీ చేయనున్న బయోలజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్లో ఉంచినట్లు ఆ బోర్డు తెలిపింది. బయోలజీ సబ్జెక్టుకు ఎంపికైన అభ్యర్థులు జనవరి 18న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని అధికారులు సూచించారు.

అధికారికంగా 'వయోపరిమితి'

- యూటీఎఫ్ డిమాండ్

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితి పెంచుతూ అధికారిక ఉత్తర్వులివ్వాలని సీఎం కేసీఆర్‌ను యూటీఎఫ్ డిమాండ్ చేసింది. వయోపరిమితి పెంపునకు, సర్వీస్‌కు ఎలాంటి నిబంధనలూ పెట్టొద్దని సంఘ అధ్యక్ష కార్యదర్శులు రాములు, చావ రవి విజ్ఞప్తి చేశారు.

● వెచ్చదనపు భోగి మంటలు..



జగిత్యాలలో భోగి మంటల్లో పాల్గొన్న మహిళలు

● పిండి వంటల ఘుమఘుమలు..



మహబూబాబాద్ జిల్లాలో సంక్రాంతి పిండివంటలు చేస్తున్న ఓ కుటుంబం

● పతంగుల రెపరెపలు..



సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో స్వీట్స్, కైట్స్ ఫెస్టివల్‌లో పతంగులు ఎగురవేస్తున్న ఔత్సాహికులు



రాజకీయ గంగిరెద్దులు

నేటి కాలమంతా వాటిదే జోరు.. అసలు గంగిరెద్దులు తగ్గిపోయాయి.. వారసత్వ రాజకీయాలు వద్దు

- భారతజాతి సంస్కృతిని కాపాడుకుందాం
- సంస్కృతికి, భాషకు కేసీఆర్ పెద్దపీట
- యోగా బాడీ కోసం.. మోదీ కోసం కాదు
- సంక్రాంతి సంబురాల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్య
- ఘనంగా స్వీట్స్, కైట్స్ ఫెస్టివల్ ప్రారంభం

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో గంగిరెద్దులు ఎక్కువయ్యాయని, నిజమైన గంగిరెద్దులు తక్కువయ్యాయని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. శంషాబాద్ ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్ రెండో వార్షికోత్సవంతోపాటు ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబురాల్లో వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా "పాతను వదలి నూతన మార్గంలో పయనించాలనేది సంక్రాంతి తత్త్వం. పూర్వీకులను స్మరించుకోవడం, వ్యవసాయంలో చేదోడుగా నిలిచే పశువులకు కృతజ్ఞతాపూర్వకంగా పూజలు చేయడం వంటివి ఉన్నతమైన ఆలోచనలు. రైతుల పండుగ సంక్రాంతిని జరుపుకోవడం ఓ రైతు బిడ్డగా తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోంది" అని వెంకయ్యనాయుడు అన్నారు. "పిల్లలను వారసత్వంగా రాజకీయాల్లోకి తీసుకురావడానికి నేను అనుకూలం కాదు. వారసులు తమ శక్తి, సామర్థ్యాన్ని బట్టి రాజకీయాల్లోకి రావాలి. స్వయంగా ఎదగాలి" అని వెంకయ్య అన్నారు. తన కుమార్తె దీపాను రాజకీయాల్లోకి రావాలని అనేక ఒత్తిడులు వస్తున్నా.. స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా సమాజసేవ చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి కేంద్ర న్యాయ, ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.రాధాకృష్ణన్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. మరోవైపు తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న నాలుగో అంతర్జాతీయ కైట్స్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్‌ను వెంకయ్యనాయుడు, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. పోటీలకు ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన కైట్ ఫ్లయర్స్‌తో పాటు మన దేశానికి చెందిన పలువురు క్రీడాకారులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆర్యోగంగా ఉంటారని అన్నారు. 'యోగా ఈజ్ ఫర్ అవర్ బాడీ.. నాట్ ఫర్ మోడీ' అని చెప్పారు.



ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గంగిరెద్దు విన్యాసాలను తిలకిస్తున్న వెంకయ్యనాయుడు తదితరులు

సాహిత్యానికి 'ఆంధ్రజ్యోతి' ప్రాధాన్యం

"ప్రజలను సరైన మార్గంలో నడిపించేందుకు అందరూ ప్రయత్నించాలి. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాల్లో కొన్ని పత్రికలు అసమాన సేవలు చేస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి' తెలుగు సాహిత్యానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఇతర పత్రికలు వేర్వేరుగా ప్రజలకు మార్గనిర్దేశం చేస్తున్నాయి. రాజకీయ నాయకులు ఐదేళ్లకోసారి ఇళ్లకు వెళ్తారు. ప్రతికలు మాత్రం ప్రతిరోజు ప్రజల ఇళ్లకు వెళ్తున్నాయి" అని వెంకయ్య అన్నారు. భాషకు ప్రోత్సాహం, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడంలో తనకు సీఎం కేసీఆర్ నచ్చుతారని అన్నారు. సంస్కృతి, భాషకు కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. దేశానికి పూర్వవైభవం తేవడమే లక్ష్యంగా స్వర్ణభారత్ ట్రస్ట్ పనిచేస్తుందన్నారు.

కేసీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు



హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పంటలు సమృద్ధిగా పండాలని, పండుగను ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని టీడీపీ-టీఎస్ అధ్యక్షులు ఎల్.రమణ, పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆకాంక్షించారు.

కుంభమేళా రేపటి నుంచి

ప్రత్యేక రోజుల్లో రాజయోగ స్నానాలు

భారీగా తరలిరానున్న నాగ సాధువులు.. ప్రయాగ్‌రాజ్‌కు ప్రత్యేక విమానాలు

న్యూఢిల్లీ, జనవరి 13: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అర్ధకుంభమేళా ఈనెల 15నుంచి ప్రారంభం కానుంది. సంక్రాంతి నుంచి మహా శివరాత్రి(మార్చి 4) వరకూ ఈ వేడుక కొనసాగుతుంది. ఈ సమయంలో గంగ, యమున, సరస్వతీ (అంతర్వాహిని) నదుల త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేసిన భక్తుల పాపాలు నశించి, మోక్షం ప్రాప్తిస్తుందని పురాణ కథనం. ఆరేళ్లకోసారి ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించే కుంభ్‌మేళాకు యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు కూడా లభించింది. కాగా, జనవరి 15న (ఉదయం 5.15 నుంచి సాయంత్రం 4.20 గంటల వరకూ) మొదటి రాజయోగ స్నానానికి (షాహీ స్నానం) యూపీ ప్రభుత్వం ప్రత్యేక ఘాట్‌లు సిద్ధం చేసింది. ఈ స్నానాలు చేయడానికి బంగారు, వెండి పల్లకీలపై, గుర్రాలు, ఒంటెలు, ఏనుగులపై అనుచరగణంతో ఊరేగింపుగా తరలివచ్చే నాగ సాధువులు, సన్యాసులు, యోగులతో ప్రయాగ్‌రాజ్ సందడిగా మారనుంది. రంగురంగుల ముగ్గులు, పూల తోరణాలతో వీరు వచ్చే మార్గాలను సుందరంగా ముస్తాబు చేస్తారు. 'హర హర మహాదేవ్' నినాదాలతో పురవీధులు మార్మోగుతాయి. వీరంతా నదిలో స్నానాలు చేసిన తర్వాతే సాధారణ ప్రజలు మునుగుతారు. ఈ సమయంలో సాధువుల ఆశీర్వాదాల కోసం భక్తులు పోటీలు పడతారు. ఈ వేడుకలను ప్రత్యక్షంగా చూసేందుకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఇక్కడకు తరలివస్తారు. ఇదిలాఉండగా, కుంభమేళాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రయాగ్‌రాజ్-ఢిల్లీ, అహ్మదాబాద్- కోల్‌కతా మధ్య ఎయిర్ ఇండియా ప్రత్యేక విమాన సర్వీసులు నడపనుంది. అలాగే ఢిల్లీ, ప్రయాగ్‌రాజ్ మధ్య రోజూ విమానాలు నడపనున్నట్లు స్పైస్‌జెట్ ప్రకటించింది.

ప్రత్యేక రోజులు

జనవరి 15	మకర సంక్రాంతి
జనవరి 21	పుష్య పౌర్ణమి
జనవరి 31	పుష్య ఏకాదశి
ఫిబ్రవరి 4	మౌని అమావాస్య
ఫిబ్రవరి 10	వసంత పంచమి
ఫిబ్రవరి 16	మాఘ ఏకాదశి
ఫిబ్రవరి 19	మాఘ పౌర్ణమి
మార్చి 4	మహా శివరాత్రి



ప్రయాగ్‌రాజ్‌లో అర్ధకుంభమేళా సందర్భంగా ఏర్పాటు చేసిన గుడారాలు



పంతంగి టోల్‌ప్లాజా వద్ద ప్రయాణికులతో సిబ్బంది వాగ్వాదం

'టోల్' తీశారు!

- టోల్‌గేట్ల వద్ద చార్జీ వసూలు.. 'ఫ్రీ' ఉత్తర్వులు అందలేదని సాకులు

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం కావడంతో నగరాల నుంచి పెద్దఎత్తున ప్రజలు పల్లెబాట పట్టారు. అయితే వీరి ఆనందానికి, తొందరగా ఊరు చేరుకోవాలన్న ఆత్రుతకు టోల్‌గేట్ల వద్ద బ్రేకులు పడ్డాయి. 'ఈ నెల 13, 16 తేదీల్లో టోల్ కట్టాల్సిన అవసరం లేదు' అని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజలు ఉపశమనం పొందారు. అయితే కేంద్ర సర్కార్ పరిధిలోని రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో టోల్‌గేట్ల సిబ్బంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో టోల్ సిబ్బంది వాహనదారుల ముక్కు పిండి మరీ ఆదివారం టోల్ రుసుం వసూలు చేశారు. మధ్యాహ్నం వరకూ టోల్ వసూలు చేశారు. ఫలితంగా కొన్నిచోట్ల భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. హైదరాబాద్-విజయవాడ మార్గంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద ఉదయం చార్జీలు వసూలు చేశారు. మధ్యాహ్నం మాత్రం నిలిపివేశారు. ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద ఆదివారం టోల్ తీశారు. టోల్ చెల్లించబోమని వాహనదారులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. మహబూబ్‌నగర్‌లోని అడ్డాకుల టోల్ ప్లాజాలో మధ్యాహ్నం వరకూ రుసుము వసూలు చేశారు. టోల్‌ప్లాజాల వద్ద రద్దీపై సీఎం కేసీఆర్ సమీక్షించారు. ట్రాఫిక్ రద్దీ నియంత్రించేందుకు టోల్ రుసుం రద్దు చేయాలని సీఎస్ ఎస్.కె.జోషీని ఆదేశించారు. ఆయన ఆదేశించినా.. తూప్రాన్ వద్ద యథేచ్ఛగా రుసుం వసూలు చేశారు. కాగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హైవేపై టోల్‌గేట్ నిర్వాహకులు తొలుత ఫీజు వసూలు చేసినా ప్రభుత్వ ఆదేశాల మేరకు రద్దు చేశారు.

శబరిమలలో మకరజ్యోతి దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

తిరువనంతపురం, జనవరి 13: మకర సంక్రాంతిని పురస్కరించుకుని.. శబరిమలలో మకరజ్యోతి (మకరవిళక్కు) దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ట్రావన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) వెల్లడించింది. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో.. జ్యోతి దర్శనం సందర్భంగా పంపానది వద్ద, సన్నిధానం, హిల్‌టాప్, టోల్ ప్లాజా సమీపంలో చేసిన ఏర్పాట్లను టీడీబీ అధ్యక్షుడు పద్మకుమార్ వివరించారు. రెండురోజుల క్రితం పందళం నుంచి బయలుదేరిన అయ్యప్ప స్వామి తిరువాభరణాలను.. సోమవారం సాయంత్రం 6 గంటలకు శబరిమలలోని పవిత్ర పద్దెనిమిది మెట్ల మీదుగా సన్నిధానానికి చేరుస్తామన్నారు. సరిగ్గా 6.30 గంటలకు దీపారాధన కార్యక్రమంతో పాటు, స్వామికి దివ్యాభరణాలు ధరింపజేసే 'తిరువాభరణ' ఘట్టం నిర్వహిస్తామన్నారు. అదేసమయంలో.. పొన్నంబల మేడు నుంచి ఆ హరిహరపుత్రుడు అయ్యప్పస్వామి జ్యోతిరూపంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. మకరజ్యోతి దర్శనానికి తరలివచ్చే లక్షలాది మంది అయ్యప్ప భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. భక్తులు ఈ నెల 19వతేదీ వరకు శబరిగిరీశున్ని దర్శించుకోవచ్చన్నారు. 20న పందళ రాజవంశీకులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయాన్ని మూసివేస్తామని తెలిపారు.



యాగం పనులు వేగం

- స్వయంగా పర్యవేక్షిస్తున్న కేసీఆర్

జగదేవ్‌పూర్, జనవరి 13: ముఖ్యమంత్రి కేసీఆర్ మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగం కోసం పనులు వేగంగా సాగుతున్నాయి. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు ఆయనీ యాగాన్ని నిర్వహిస్తున్నారు. పది రోజుల క్రితం ప్రధాన యాగశాల నిర్మాణం ప్రారంభించగా ప్రస్తుతం ఆ పనులు చివరి దశకు చేరాయి. 2, 3 రోజుల్లో ప్రధాన యాగశాల పూర్తికానుంది. దీంతో పాటు మరో నాలుగు యాగశాలలనూ నిర్మిస్తున్నారు. శృంగేరీ పీఠం పండితులు ఫణిశశాంకశర్మ, గోపీకృష్ణశర్మ, తెలంగాణ పత్రిక సంపాదకుడు అష్టకాల రామ్మోహనశర్మ పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతుండగా సీఎం కేసీఆర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అధికారిక కార్యక్రమాలతో బీజీగా ఉన్న సీఎం ఈ నెల 8, 10 తేదీల్లో ఫాంహౌస్‌కు వచ్చి యాగం పనులను పరిశీలించారు. శృంగేరీ పీఠం పండితుల పర్యవేక్షణలో జరగనున్న ఈ యాగానికి 200 మంది రుత్విక్కులు హాజరవుతున్నట్లు తెలిసింది. కర్ణాటక నుంచి రుత్విక్కులు హాజరు కానున్నారు. సీఎం ఆదేశాల మేరకు వారికి ఫాంహౌస్‌లోనే ఏర్పాట్లు చేస్తున్నారు.

కేరళ తమిళనాడు సరిహద్దులో ప్రపంచంలోనే ఎత్తయిన లింగం

తమిళనాడు కేరళ సరిహద్దులోని చెంగల్ మహేశ్వర శివపార్వతి ఆలయ ప్రాంగణంలో ప్రపంచంలోనే ఎత్తైన శివలింగం రూపుదిద్దుకుంది. 2012లో ఈ శివలింగం నిర్మాణం ప్రారంభించారు. ఇది 111.2 అడుగుల ఎత్తులో ఎనిమిది అంతస్థులుగా దీన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణ వ్యయం రూ. 10 కోట్లు. ప్రతి అంతస్థులో ధ్యానమందిరాలు ఏర్పాటు చేస్తున్నారు.





బుద్ధుడి ధాతువులను స్థూపం వద్దకు తీసుకెళ్తున్న దృశ్యం

బుద్ధవిహార్ స్థూపంలో బుద్ధుని ధాతువుల నిక్షిప్తం

మారేడుపల్లి/హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మహేంద్రాహిల్స్‌లోని మహాబోధి బుద్ధ విహార్ కేంద్రం ఆవరణలో నిర్మించిన భారీ స్థూపంలో బౌద్ధ భిక్షువులు, ఉపాసకులు, ధ్యాన గురువులు భక్తి శ్రద్ధల నడుమ బుద్ధ భగవానుడి శరీరంలోని ధాతువులను ఆదివారం నిక్షిప్తం చేశారు. థాయిలాండ్ నుంచి తీసుకొచ్చిన బుద్ధుని ధాతువులను నిక్షిప్తం చేసిన స్థూపం వద్దకు వందలాది మంది చేరుకుని, భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. బుద్ధ విహార్ సొసైటీ భిక్షువులు, అమెరికా నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువు బిక్కు బోధి మహాతేరో ధాతువుల నిక్షిప్తం, ధ్యాన తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



వహ్వా.. భాజి..

ఈ రోజు భోగి... ఇవ్వాళ ప్రత్యేకంగా చేసే వంటకమే భాజి రెసిపీ. చలికాలంలో పండే కాయగూరలతో ఈ వంటకాన్ని తయారు చేస్తారు. అదెలాగంటే...

కావలసినవి: తెల్లనువ్వులు, పల్లీలు, పచ్చికొబ్బరి ముక్కలు - ఒక్కొక్కటీ రెండేసి టేబుల్‌స్పూన్లు (వేగించి పొడి చేయాలి), చింతపండు - ఒక టీస్పూను, వేడినీళ్లు - మూడు టేబుల్‌స్పూన్లు, నూనె - రెండు టేబుల్ స్పూన్లు, ఆవాలు, జీలకర్ర - ఒక్కొక్కటీ ఒక్కో అర టీస్పూను, సన్నగా తరిగిన ఉల్లిపాయముక్కలు - ముప్పావు కప్పు, ఇంగువ - చిటికెడు, పసుపు - అర టీస్పూను, కరివేపాకు - కొద్దిగా, అల్లం - కొద్దిగా (సన్ననిముక్కలుగా తరిగి), వెల్లుల్లిపాయలు - ఐదు (చిన్నముక్కలుగా చేసి), పచ్చిమిర్చి - ఒకటి (చిన్నముక్కలుగా చేసి), క్యారెట్ - ఒకటి (చిన్నముక్కలుగా చేసి), పెద్దచిక్కుడు - అర కప్పు, చిక్కుడు బఠాణీలు- అర కప్పు, మునక్కాయ - ఒకటి (పైతొక్కు తీసి చిన్నముక్కలుగా తరిగి), పచ్చి బఠాణీలు, బీన్స్ - ఒక్కొక్కటీ ఒక్కో పావు కప్పు, చిన్న వంకాయలు - ఎనిమిది (చిన్న ముక్కలుగా తరిగి), బంగాళాదుంపలు - రెండు (ముక్కలుగా తరిగి), రేగుపళ్లు - ఏడు, నీళ్లు - రెండుకప్పులు (లేదా సరిపడా), గరం మసాలా - ఒక టీస్పూను, కొత్తిమీర తరుగు - పావు కప్పు, ఉప్పు - సరిపడా, బెల్లంతరుగు - ఒక టీస్పూను (లేదా సరిపడా), కొత్తిమీర తరుగు - మూడు టేబుల్‌స్పూన్లు.

తయారీ:

- కాయగూరలను నీళ్లల్లో శుభ్రంగా కడగాలి.
- పెద్ద చిక్కుళ్లను చీరి ముక్కలుగా చేయాలి.
- అలాగే మిగతా కాయగూరలను కూడా ముక్కలుగా కట్ చేయాలి.. ఒక గిన్నెలో నీళ్లు పోసి అందులో వంకాయ ముక్కలు ఉంచితే వాటి రంగు మారదు.
- మూడు టేబుల్‌స్పూన్ల వేడి నీళ్లల్లో టీస్పూను చింతపండు వేసి ఇరవై నిమిషాలు నానబెట్టి, చిన్న పాత్రలో దాన్ని గుజ్జులా తీసి పెట్టుకోవాలి.




- చిన్న పాన్‌ని స్టవ్ మీద వేడి చేసి అందులో రెండు టేబుల్‌స్పూన్ల తెల్ల నువ్వులు, విడిగా రెండు టేబుల్‌స్పూన్ల పల్లీలు, రెండు టేబుల్‌స్పూన్ల కొబ్బరి ముక్కలను వేగించాలి.
- ఇవి చల్లారిన తర్వాత చిన్న గ్రైండర్‌లో మెత్తటి పొడిలా చేయాలి.
- కచ్చాపచ్చాగా కొట్టిన అల్లంముక్క, ఐదు వెల్లుల్లిపాయలు, ఒక పచ్చి మిర్చి ముక్కలను రెడీ పెట్టుకోవాలి.
- పెద్ద పాన్‌లో రెండు టేబుల్‌స్పూన్ల నూనెను వేడిచేసి అందులో ఆవాలు, అర టీస్పూను జీలకర్ర వేసి వేగించాలి.
- తర్వాత అందులో ఉల్లిపాయముక్కలు వేసి లేత బ్రౌన్ రంగులోకి వచ్చేదాకా వేగించాలి.
- చిటికెడు ఇంగువ, అర టీస్పూను పసుపు, కరివేపాకు అందులో వేసి కలపాలి.
- నూరిన అల్లం-వెల్లుల్లి పేస్టు వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేగించాలి.
- అందులో క్యారెట్, బీన్స్ వేసి పావు కప్పు నీళ్లు పోయాలి.
- పాన్ మీద మూతపెట్టి సన్ననిమంటపై కూరగాయలను ఐదు నిమిషాలు ఉడకనిచ్చి మూత తీసి ఒకసారి కూరను కలపాలి.
- మిగిలిన కాయగూరల ముక్కల్ని కూడా అంటే వంకాయ, రేగిపళ్లు, మునక్కాడలు, బంగాళాదుంపలు, పచ్చిబఠాణీలు, లీమా బీన్స్‌ను కూడా అందులో వేయాలి.
- ఈ మిశ్రమాన్ని మరోసారి కలిపి దానిపై ఉప్పు చల్లాలి.
- అందులో రెండు కప్పుల నీళ్లు పోసి కలియబెట్టాలి.
- పాన్‌పై మూతపెట్టి సన్నని మంటపై కూరగాయ ముక్కలను మెత్తగా ఉడికించాలి.
- అందులో రెడీగా పెట్టుకున్న టొమాటో గుజ్జుతో పాటు నువ్వుల పొడి, పల్లీపొడి, కొబ్బరిపొడి కూడా వేయాలి. వీటితోపాటు రెండు టీస్పూన్ల గరం మసాలా పొడి, ఒక టీస్పూను బెల్లం తరుగు వేసి బాగా కలపాలి. దాంట్లో పావు కప్పు కొత్తిమీర తరుగు వేసి కలిపి మరో ఐదు నిమిషాలు ఉడికించాలి.
- చివరిగా అందులో మూడు టేబుల్ స్పూన్ల కొత్తిమీర తరుగును కలిపి స్టవ్ నుంచి కిందికి దించాలి.
- ఈ భాజి రెసిపీని వేడిగా చపాతీ, కిచిడి లేదా వేడి అన్నంతో తింటే ఎంతో రుచిగా ఉంటుంది.

తిరుప్పావై

భాగవతుల ఆరాధనే మార్గం!

ముప్పయ్యో పాశురం

వఙ్గ క్కడల్ కడైన్ద మాదవనై కేశవనై
తిఙ్గళ్ తిరుముగత్తు చ్చేయిళై యార్ శెన్నిరైఞ్జి
అఙ్గప్పరై కొణ్డవాత్తై, అణిపుదువై
పైఙ్గమల త్తణ్డెరియల్ పట్టర్ పిరాన్ కోదై శొన్న
శఙ్గత్తమిళ్ మాలై ముప్పదుమ్ తప్పామే
ఇఙ్గప్పరిశురై ప్పారీరరణ్డు మాల్వరైత్తోళ్
శె ఙ్గణ్ తిరుముగత్తు చ్చెల్వత్తిరుమాలాల్
ఎఙ్గమ్ తిరువరుళ్ పెత్తిన్బురువ రెమ్బావాయ్!



ఉత్తరాయణ పుణ్యకాలం, మకరసంక్రాంతి శుభ దినం. ఈనాడు, విష్ణుచిత్త కులనందన కల్పవల్లి ఆండాళ్ తల్లి కూర్చిన మహాప్రబంధమైన పాశుర మాల...

'సంగత్తమిళ మాలై ముప్పదు' అని ఆమె నామకరణం చేసుకున్న 'తిరుప్పావై' అంతిమ సోపానానికి చేరుకున్నది. భూమి సుభిక్షమై, సంసార విషకూపంలో కొట్టుమిట్టాడే జీవులను ఉద్ధరించడానికి ఆ తల్లి ఉపదేశించిన ఈ శ్రీసూక్తులు నేల నాలుగు చెరుగులా అనుగ్రహవర్షాన్ని కురిపించి ముముక్షువులకు దారిదీపమై మార్గదర్శనం చెయ్యాలని మంగళాకాంక్ష.

ఈ విశిష్టమైన రోజున ముప్పయ్యో పాశురం ద్వారా ఎన్నో ఆశీర్వాదాలు అనుగ్రహించింది ఆండాళ్. భగవంతుడిని చేరుకోవడానికి భాగవతుల ఆరాధన ఉత్తమైన మార్గమని తెలియజేస్తోంది. ఈ అంతిమ పాశురాన్ని పవిత్రమైన 'ఫలశ్రుతి పాశురమ'ని (తిరునామ పాట్ట్) పేర్కొంటారు.

ముప్పయ్యవదీ, ఆఖరుదీ అయిన ఈ పాశురంలో ఆండాళ్ గోపికాభావంతో కాకుండా, తానుగా ఫలశ్రుతి అనుగ్రహిస్తోంది. ఈ దివ్య పాశురాలను భక్తిపూర్వకంగా పఠించినవారు భగవానునికి ప్రీతిపాత్రులై బ్రహ్మానందాన్ని పొందగలరని ఆమె ప్రకటించింది. ఆండాళ్ సాక్షాత్ 'క్షమా'... అంటే భూదేవి అవతారం! ఆమె స్వయంగా అనుగ్రహించిన ఈ దివ్య శ్రీసూక్తులను పఠించి, అనుభవంలోకి తెచ్చుకున్న భాగ్యశాలులు... భగవానుని సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులవుతారు.

కృష్ణుని సమీపానికి చేరుకొని, ఆ కేశవుని (అందమైన కురులు గలవాణ్ణి), లక్ష్మీపతి అయిన ఆ మాధవుణ్ణి, క్షీరసాగరమథనం చేసిన ఆ సర్వాంతర్యామిని... శుభలక్షణాలు గల చంద్రవదనలైన గోపికలు స్తోత్రం చేసి, అద్వితీయం, అపూర్వం అయిన 'పర'ను ఆయన నుంచి స్వీకరించారు. వారిలో వ్యక్తమయ్యే శాంతమే వారికి పెట్టని ఆభరణం.

ఈ పాశురంలో 'అమృతమథనా'న్ని ప్రస్తావించడం భగవానుడి సర్వాంతర్యామిత్వాన్నీ, ప్రపన్నజన వాత్సల్యాన్నీ సూచిస్తుంది. మార్గశిర మాసానికి అధిష్ఠాన దైవం 'కేశవుడు'. 'క' శబ్దం బ్రహ్మదేవుణ్ణీ, 'ఈశ' శబ్దం పరమశివుణ్ణీ సూచిస్తాయి. వారిద్దరూ భగవానుని నుంచి ఉద్భవించిన సృజనాత్మక, లయాత్మక మహాశక్తులు. ఆ రెండు శక్తులకు జన్మస్థానమైనవాడు 'కేశవుడు'. ఈ నామం భగవానుడి పరత్వాన్ని తెలియజేస్తే, 'మాధవ' నామం 'శ్రీమత్' శబ్దార్థానికి రూపం.

ద్వయమంత్ర విశిష్టత

అపార దయాగుణం, మహదైశ్వర్యం కలవాడే 'శ్రీనివాసుడు' (తిరుమాళ్). ఆండాళ్ అలంకరించుకున్న తులసీమాలలు తాను ధరించిన భగవానుడే మూర్తీభవించిన 'శ్రీమత్వం'. 'మాధవన్' సంబోధనతో ఆండాళ్ ద్వయమంత్రంలోని 'శ్రీమత్' శబ్దానికి (శ్రీమన్నారాయణ చరణౌ..) నమస్కారాలాచరించింది. ద్వయమంత్రంలోని శ్రీమత్ శబ్దానికి (శ్రీమతే నారాయణాయ...) రెండోమారు వందనాలర్పిస్తూ, పాశురం చివర 'తిరుమాళ్' శబ్దప్రయోగం చేసింది.

గోదాదేవి తాను 'భట్టర్ పిరాన్' అంటే పెరియాళ్వారులైన విష్ణుచిత్తుల కుమార్తెనని చెప్పుకుంటోంది. ఆయన ఆ దివ్యబాలను పెంచిన తండ్రి మాత్రమే కాదు, ఆచార్యుడు కూడా! ఆయన వాక్కులే (ఉపదేశాలు) ఇక్కడ ఆమె నోట పలుకుతున్నాయి. భగవానుడి కృపతో దేవతలు సాగర మథనం చేసి అమృతాన్ని సాధించినట్టు, ఆండాళ్ వేద సారాన్నంతటినీ మథించి అనుగ్రహించిన ప్రబంధం 'గోదోపనిషద్'గా మన్ననలు అందుకుంటోంది. ముముక్షువుల ఆత్మోద్ధరణకు మార్గదర్శకమైన 'తిరుప్పావై' ప్రబంధాన్ని పండిత భాష అయిన సంస్కృతంలో కాకంగైఅ, శుద్ధ వ్యావహారిక తమిళంలో ఆండాళ్ కూర్చింది. ఇక్కడ ఆమె తన తండ్రి, ఆచార్యుడు అయిన భట్టర్ పిరాన్ (విష్ణుచిత్తులు) తాలూకు ఉత్తమ వైష్ణవ లక్షణాన్ని సూచించింది. ఆయన తులసి మాల, తామరపూసల దండలు ధరించేవాడు. శ్రీవైష్ణవులకు తులసీమాలాధారణ సంప్రదాయ నిర్దేశితం. తులసిమాల శ్రీమహావిష్ణువు పరత్వానికి చిహ్నమైతే, తామర పూసల దండ అమ్మవారి పరత్వానికి చిహ్నం! అవి మెడలో ధరించి శ్రీవైష్ణవోత్తములు తమను తాము ఆ దివ్యదంపతులకు దాసులుగా ప్రకటించుకుంటారు. ఎండిన తులసి, తామర కాండాలతో ఈ పూసల హారాలు రూపుదిద్దుకుంటాయి. ఆండాళ్ తన పేరుకు ముందుగా తన గురుదేవుని పవిత్ర నామాన్ని ఈ పాశురంలో సంభావిస్తోంది (భట్టర్ పిరాన్ గోదై సొన్న). అందుకే 'తిరుప్పావై ఆచార్యపరమైన ప్రబంధ రచనగా విశేష సమ్మానం, ప్రపన్న జనాదరణ పొందింది.

ఆండాళ్ తిరువడిగళే శరణం!

● **శ్రీదేవీ మురళీధర్**

చిత్రం: కేశవ్ https://www.facebook.com/keshav61/

స్ఫూర్తి





కేరళలోని తిరువనంతపురం కలెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.వాసుకి ఇటీవల ఆన్‌లైన్‌లో పెట్టిన ఒక వీడియో తెగ వైరల్ అవుతోంది. అందులో ఆమె ధరించిన ఎరుపు రంగు చీర గురించి అంతా చర్చించుకోవడం మొదలెట్టారు. అంతేనా... అభినందనలూ తెలుపుతున్నారు. ఇంతకీ ఈ కలెక్టరమ్మ కట్టుకున్న ఆ చీర స్పెషాలిటీ ఏంటీ?

పాత చీరతో కొత్త సందేశం!

రెండు నెలల క్రితం... కేరళలోని వర్కాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 'రెస్క్యూ రికవరీ ఫెసిలిటీ' (ఆర్ఆర్ఎఫ్)ని సందర్శించిన కలెక్టర్ వాసుకీ అక్కడ ఉన్న ఒక పసుపు రంగు చీరను చేతిలోకి తీసుకున్నారు. అక్కడే ఉన్న ఒక మహిళా ఉద్యోగి వద్ద ఉన్న ఎర్ర రంగు చీరను చూసి 'నిజానికి ఆ చీర తనకు బాగా నచ్చింద'న్నారు. ఆమె మాటలు విని అక్కడున్న మహిళలు చిరునవ్వులు చిందించారు. "మీరు ఈ చీర కట్టుకుంటానంటే ఇచ్చేస్తాం" అన్నారు.

కలెక్టరమ్మ సీరియస్‌గానే ఆ మాట అన్నదనే విషయం వారికి తొందరగానే తెలిసింది. ఒక కార్యక్రమానికి ఆమె ఆ ఎరుపు రంగు చీరను కట్టుకురావటమే గాక 'తిరిగి వినియోగించే (రీ యూజ్) చీరలను తాను ప్రమోట్ చేస్తున్నట్టు, ఎవరో కట్టి వదిలేసిన చీరను తిరిగి కట్టుకోవడంలో తనకు ఎలాంటి పట్టింపులు లేవని, పర్యావరణానికే తన తొలి ప్రాధాన్యమ'ని చెప్పి, వీడియోను ఫేస్‌బుక్‌లో కూడా అప్‌లోడ్ చేయడంతో కలెక్టర్‌గారి పెద్దమనసుకు అంతా ఫిదా అయ్యారు. ఆమెను అభినందనల వెల్లువతో ముంచెత్తారు. కేరళలో పర్యావరణ పరిరక్షణకు అనేక ప్రయత్నాలు చేస్తున్న ఆమె సంకల్పానికి జేజేలు పలికారు. సోషల్ మీడియాలో ఈ ఐఏఎస్ అధికారిణి పోస్ట్ చేసిన వీడియోను 13 వేల మందికి పైగా షేర్ చేశారు. సుమారు 6 లక్షల మంది వీక్షించారు. "ఇది కాటన్ చీర కాదు... ఇందులో ప్లాస్టిక్ మిళితమై ఉంది. ఈ చీరను నేను 'ఆర్ఆర్ఎఫ్' నుంచి సేకరించా. ఇది పర్యావరణానికి హాని చేస్తుంది. అందుకే దీన్ని పారేయకుండా కనీసం పది, పదిహేనేళ్లు కట్టుకోవాలనుకుంటున్నా. 'ఓల్డ్ ఈజ్ ఫ్యాషనబుల్' అని ప్రమోట్ చేసేందుకు ఇలా చేస్తున్నా. కొత్త దుస్తులే అందంగా ఉంటాయని ఎవరు



ఫ్యామిలీతో...

చెప్పారు? ఆ స్టేట్‌మెంట్‌ను మార్చేద్దాం. ఇంతకుముందు ఎవరో కట్టుకున్న చీరను ఇప్పుడు నేను కట్టుకున్నా. ఈ చీర పాతది అయ్యేదాకా కట్టుకుంటూనే ఉంటా" అంటున్నారు కలెక్టర్ వాసుకి. 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' ఛాలెంజ్‌ను అందరూ స్వీకరించాలని కూడా చెబుతున్నారు. పాత దుస్తులు, పాత మెటీరియల్‌ను రీసైకిల్ చేయాలని, రీ యూజ్ చేయాలని కోరుతున్నారు.

డాక్టర్ కలెక్టర్...


చెన్నైకి చెందిన వాసుకి తొలుత మెడికల్ కెరీర్‌లో కొనసాగుతూనే అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లోకి రావాలనుకున్నారు. అందుకు ఓ కారణముంది. 2004లో సునామీ వచ్చినప్పుడు ఐఏఎస్ అధికారులు ఏ విధంగా రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నారో చూసిన వాసుకి తను కూడా వారిలాగే ప్రజలకు సేవ చేయాలనుకున్నారు. సివిల్స్‌లో ర్యాంకు సాధించి కేరళలోని తిరువనంతపురానికి 42వ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. వెంటనే నగరాన్ని గ్రీన్ ప్రోటోకాల్‌గా మార్చేందుకు ప్రయత్నించారు. 'కేరళ సుచిత్వ మిషన్'లో భాగంగా పలు ప్రయోగాలు చేసి స్వచ్ఛతకు పెద్ద పీట వేశారు. 'సీ పవర్ 5'ను ప్రారంభించారు. 'సీ 5' అంటే... 'ఛేంజ్ ఎన్ ఛేంజ్ క్లైమెట్ ఛేంజ్'. ఈ కార్యక్రమంలో భాగంగా అనేక సంస్కరణలు తీసుకొచ్చి పరిశుభ్రమైన పల్లెలకు శ్రీకారం చుట్టారు. తిరువనంతపురం కార్పోరేషన్ పరిధిలో ప్లాస్టిక్‌ను నిషేధించారు. అదే విధంగా ఆమె రూపొందించిన '3 ఆర్'లు (రెడ్యూస్, రీసైకిల్, రీ యూజ్) ప్రజల్లోకి చొచ్చుకుపోయాయి. ఆ తర్వాత వీటికి మరో 'ఆర్' (రీప్లేస్)ను కూడా జత కలిపారు. "ప్లాస్టిక్ నిషేధాన్ని తొలుత నా ఇంటి నుంచే ప్రారంభించా. మా అమ్మగారు షాపింగ్‌కు వెళితే చాలు, ప్లాస్టిక్ బ్యాగులతో ఇంటికి వచ్చేది. నేను వాటికి ప్రత్యామ్నాయంగా సంచులను ఇచ్చేదాన్ని. కుటుంబసభ్యులకు అవగాహన కల్పించి మొత్తానికి వాటికి దూరంగా ఉండేలా చేయగలిగా. నా పిల్లలిద్దరూ (సయూరి, సమరాన్) ఎవరి చేతుల్లోనైనా ప్లాస్టిక్ బ్యాగులు కనిపిస్తే చాలు నాకు వెంటనే చెప్పేస్తారు. నాన్‌స్టిక్ మెటీరియలతో చేసే టెఫ్లాన్ కోటెడ్ దోశ పాన్‌లకు కూడా దూరంగా ఉండాలని చెబుతున్నా. ఎందుకంటే వాటివల్ల కూడా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి" అని చెబుతున్నారు వాసుకి.

గత ఏడాది కేరళను కుదిపేసిన వరదల్లో నిరాశ్రయులైన ఎంతోమందికి వాసుకి అండగా నిలిచి వార్తల్లోకి ఎక్కారు. బాధితులకు కావాల్సిన దుస్తులు, ఆహారం సమకూర్చడంలో ఆమె చూపిన చొరవ అభినందనీయం. రెండురోజుల్లో 54 ట్రక్కుల మెటీరియల్‌ను సేకరించి బాధితులకు అందజేశారామె. ప్రజలు ఆమెను అభిమానంగా 'కలెక్టర్ సిస్' అని పిలుస్తుంటారు.

వాసుకి భర్త కార్తికేయన్ కూడా ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన కేరళలోని కొల్లామ్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. "నా భర్త నా విజయాన్ని నాకన్నా ఎక్కువగా ఎంజాయ్ చేస్తారు. నా సక్సెస్ వెనుక ఉన్నది ఆయనే" అంటున్న వాసుకి పర్యావరణ పరిరక్షణ కోసం మరిన్ని మార్గాలను అన్వేషించే పనిలో ఉన్నారు. "ప్రతీ రోజూ జీవితంలోకి కొత్తదనాన్ని ఆహ్వానించండి. ప్రతీ ఉదయమూ మనకు బహుమతిలాంటిదే. ఇతరుల సంతోషం కోసం ఏమీ ఆశించకుండా మనం ఏం చేయగలమో ఆలోచించండి"... ఇదీ ఈ కలెక్టర్‌గారి సక్సెస్ మంత్ర.

ముత్యాలముగ్గు

బి.హైమవతి
న్యూబోయిన్‌పల్లి,
సికింద్రాబాద్



25 చుక్కలు
1 వరుస
1 వచ్చేవరకు

17 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకు




కె.శ్రీలక్ష్మి
కూకట్‌పల్లి, హైదరాబాద్

17 చుక్కలు
సరిచుక్క
1 వచ్చే వరకు



పి.ఝాన్సీ
ఆదోని,
కర్నూలు జిల్లా

ఎస్.వరలక్ష్మి
పలమనేరు,
చిత్తూరు జిల్లా



19 నుంచి
1 వరకు
నేరు చుక్కలు

డేటా తిరిగి పొందకుండా చేయవచ్చా?

నా ఫోన్‌లో ముఖ్యమైన డేటా ఉంది. దాన్ని గూగుల్ డ్రైవ్‌లోకి బ్యాకప్ తీసుకున్నాను. ఇప్పుడు ఒక వేళ డేటా రికవరీ సాఫ్ట్‌వేర్లు వాడినప్పటికీ, నా ఫోన్లో డేటా వెనక్కి రాకుండా పూర్తిగా చెరిపివేయడానికి ఏదైనా మార్గం ఉంటే తెలపండి?

- క్రాంతి, తెనాలి



ఇది చాలా సింపుల్. ముందుగా మీ ఫోన్లో సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఫోన్ మొత్తాన్ని ఎన్‌క్రిప్ట్ చేయండి. ఆ తర్వాత ఫోన్ ఫ్యాక్టరీ రీసెట్ చేసి, దాన్ని మళ్లీ డీక్రిప్ట్ చేయండి. దీంతో అందులో గతంలో ఉండే డేటా మొత్తం ఒకవేళ డేటా రికవరీ సాఫ్ట్‌వేర్ వాడినప్పటికీ రికవర్ అవకుండా జంక్ డేటాగా మార్చివేయబడుతుంది. ఇంకా అనుమానం ఉంటే, ఇలా రెండుసార్లు చేస్తే, ఎట్టి పరిస్థితుల్లోనూ మీ డేటా వెనక్కి రాదు. మీరు ఇతరులకి ఫోన్ అమ్మేటప్పుడు కూడా అవతలివారు డేటా రికవరీ సాఫ్ట్‌వేర్ ద్వారా గతంలో మీరు స్టోర్ చేసిన డేటా వెనక్కి పొందకుండా ఇదే పద్ధతిలో అడ్డుకోవచ్చు.

రిమోట్‌గా ఆపరేట్ చేయడం సాధ్యమా?

వేరే ఊర్లో ఉన్న మా అమ్మగారి ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఏదైనా సమస్య వచ్చినప్పుడు, దాన్ని రిమోట్‌గా ట్రబుల్‌షూట్ చేసే మార్గమేదైనా ఉంటే తెలుపగలరు?

- ప్రదీప్, హైదరాబాద్



వేరే ప్రదేశంలో ఉన్న ఆండ్రాయిడ్ ఫోన్‌ని కంట్రోల్ చెయ్యడానికీ, ట్రబుల్‌షూట్ చెయ్యడానికీ విఎన్‌సి వ్యూయర్స్ యాప్స్ పెద్ద మొత్తంలో గూగుల్ ప్లే స్టోర్‌లో లభిస్తున్నాయి. అయితే వీటిలో అధిక శాతం వాడడానికి తప్పనిసరిగా మన దగ్గర రూట్ చెయ్యబడిన ఫోన్ ఉండాలి. ఒకవేళ ఫోన్ రూట్ చేయబడి లేకపోతే విఎంలైట్ విఎన్‌సి సర్వర్ అనేది ఒకటి ఉంది. అయితే దీన్ని వాడాలంటే కనెక్షన్ ఎస్టాబ్లిష్ చేసే ప్రతీసారీ పిసికి కనెక్ట్ చేసి సర్వర్ యాక్టివేట్ చేయాలి. ఈ గొడవంతా లేకుండా సులభంగా పని పూర్తవ్వాలంటే, టీమ్ వ్యూయర్ క్విక్ సపోర్ట్ వాడితే సరిపోతుంది. దీని సాయంతో కూడా అవతలి ఫోన్‌ను రిమోట్‌గా నియంత్రించవచ్చు.

ఆటోమేటిక్‌గా ఇన్‌స్టాల్...ఎందుకు?

నా ఫోన్లో నా ప్రమేయం లేకుండా కొన్ని యాప్స్ ఆటోమేటిక్‌గా ఇన్‌స్టాల్ అవుతున్నాయి. దీనికి కారణం ఏమిటి? అడ్డుకోవడం ఎలా?

- వినయ్‌సాగర్, వైజాగ్



ప్రధానంగా రెండు రకాల సందర్భాల్లో ఇలా జరుగుతుంది. ఇంటర్నెట్ బ్రౌజ్ చేసేటప్పుడు, 'మీ ఫోన్లో వైరస్ ఉంది' అని ఏదైనా మెసేజ్ కనిపిస్తే భయపడి పోయి దాన్ని ట్యాప్ చేసి, అవాంఛిత ప్రోగ్రామ్ ఏదైనా మీ ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకున్నట్లయితే ఇకపై ఆటోమేటిక్‌గా అది డ్రాపర్‌గా పనిచేస్తూ కమాండ్ కంట్రోల్ సర్వర్‌కి కనెక్ట్ అయి మీ ప్రమేయం లేకుండానే యాప్స్‌ని మీ ఫోన్‌లోకి డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేస్తూ ఉంటుంది. మరికొన్ని సందర్భాల్లో, కొన్ని కంపెనీలకు చెందిన కొన్ని ఫోన్ మోడళ్లలో ఇలా యూజర్ల ప్రమేయం లేకుండా ప్రమోషనల్ యాప్స్‌ని ఇన్‌స్టాల్ చేసే ఏర్పాటుని ఫోన్ తయారీ కంపెనీలు స్వయంగా చేస్తూ ఉంటాయి. దీనికి పూర్తిగా ఆ ఫోన్ తయారీ కంపెనీ బాధ్యత వహించవలసి ఉంటుంది.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం
navya@andhrajyothy.com

డైలీ సుడోకు - 425

3			8		1	9	7	
1		9			5			
			6		2		5	3
	4	5			7	3		
			5	6	8			
		1	4			5	6	
5	7		2		9			
			7			6		2
	2	3	1		6			5

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు - 424 సమాధానం

1	7	2	6	5	9	8	3	4
5	8	4	3	7	2	9	1	6
9	3	6	8	1	4	2	7	5
2	1	8	4	6	7	5	9	3
7	5	3	9	8	1	6	4	2
6	4	9	5	2	3	1	8	7
3	6	7	1	9	5	4	2	8
4	9	5	2	3	8	7	6	1
8	2	1	7	4	6	3	5	9

ఆంధ్రజ్యోతి నవ్య స్మార్ట్
8
సోమవారం
14 జనవరి 2019



సంక్రాంతి వచ్చేసింది.. పండుగ రోజుల్లో స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ఊపందుకుంటాయి. అయితే కొత్తగా ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారు తమ బడ్జెట్‌కి తగ్గట్లు ఎలాంటి మోడల్ ఎంపిక చేసుకోవాలో అర్థంకాక ఇబ్బంది పడుతూ ఉంటారు. వివిధ బడ్జెట్ స్థాయిల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మంచి స్మార్ట్‌ఫోన్ల వివరాలు మీకోసం..

టెక్ గురు

సంక్రాంతికి కొత్త స్మార్ట్‌ఫోన్ కొనాలా?

10 వేల రూపాయల లోపు!

యాసస్ జెన్‌ఫోన్ మాక్స్ ఎం2: 3జిబి ర్యామ్, 32 జిబి ఇంటర్నల్ స్టోరేజ్ కలిగిన ఈ ఫోన్లో 1720 X 1520 పిక్సెల్ రిజల్యూషన్ కలిగిన 6.26 అంగుళాల స్ర్కీన్ ఉంటుంది. క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 632 ప్రాసెసర్ ఆధారంగా పని చేస్తూ, ఆండ్రాయిడ్ 8.1 ఆపరేటింగ్ సిస్టమ్ ఇది కలిగి ఉంటుంది. ఫోన్ వెనుక భాగంలో 13 మరియు 2 అలాగే ముందు భాగంలో 8 మెగా పిక్సెల్ కెమెరాతో ఈ ఫోన్ ఉంటుంది. దర రూ. 9,999/-

రెడ్‌మి నోట్ 5: 5.99 అంగుళాల స్ర్కీన్ పరిమాణంతో 3జిబి ర్యామ్, 32జిబి ఇంటర్నల్ స్టోరేజ్ ఈ ఫోన్ కలిగి ఉంటుంది. క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 625 ప్రాసెసర్ ఆధారంగా పనిచేసే ఈ ఫోన్లో వెనుక భాగంలో 12 ముందు భాగంలో 5 మెగా పిక్సెల్ కెమెరా లభిస్తాయి. 4000 ఎంఎహెచ్ బ్యాటరీ ఉంటుంది. దీని ధర రూ.9,999/-

రియల్‌మీ 2: 6.2 అంగుళాల హెచ్‌డి ప్లస్ స్ర్కీన్ తో క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 450 ప్రాసెసర్ ఆధారంగా పనిచేసే ఈ ఫోన్లో వెనుక భాగంలో 13 మరియు 2 ముందు భాగంలో 8 మెగా పిక్సెల్ కెమెరాలు లభిస్తాయి. దీని ధర 9,499/- 3 జిబి ర్యామ్, 32 జిబి స్టోరేజ్ దీంట్లో ఉంటాయి.

రెడ్‌మి వై 2: 5.99 అంగుళాల స్ర్కీన్, వెనుక భాగంలో 12 మరియు 5, ముందు 16 మెగా పిక్సల్ కెమెరా, 3జిబి ర్యామ్, 32జిబి స్టోరేజ్ ఈ ఫోన్లో ఉంటాయి. ధర రూ. 8,999/- వీటితోపాటు 8,999 రూపాయలకి లభించే లెనోవో కె9, 7,999 రూపాయలకి రెడ్‌మి6, 4,999 రూపాయలకి 10.ఆర్.డి2 ఫోన్ మోడళ్లని 10 వేల రూపాయల లోపు బడ్జెట్ ఉన్నవారు ఎంపిక చేసుకోవచ్చు.



20 వేల రూపాయల లోపు

షామీ పోకో ఎఫ్ 1: గతంలో ఎప్పుడూ వినని పేరే అయినా, షామీ సంస్థ కొత్తగా తీసుకొచ్చిన సబ్ బ్రాండ్ ఇది. సుమారు 35, 40 వేల రూపాయల ధర కలిగిన ఫోన్లలో ఉండే లేటెస్ట్ క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 845 ప్రాసెసర్, 6జిబి ర్యామ్, 64 జిబి స్టోరేజ్ దీంట్లో లభిస్తాయి. వెనక భాగంలో 12 మరియు 5 ముందు 20 మెగాపిక్సెల్ కెమెరాలు ఉంటాయి. దీని ధర రూ. 19,999/- మిగతా వాటితో పోలిస్తే ఇది చాలా మంచి ఛాయిస్.

రియల్ మి 2 ప్రో: 6.3 అంగుళాల స్ర్కీన్, 4జిబి ర్యామ్, 64 జిబి స్టోరేజ్, వెనుక భాగంలో 16 మరియు 2, ముందు 16 మెగాపిక్సెల్ కెమెరాలు దీంట్లో ఉంటాయి. క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 660 ప్రాసెసర్ పొందుపరచబడింది. ధర రూ. 13,990/-

రెడ్‌మి నోట్ 6 ప్రో: 4జిబి ర్యామ్, 64జిబి స్టోరేజ్, 6.26 అంగుళాల స్ర్కీన్, వెనుక భాగంలో 12 మరియు 5, ముందు భాగంలో 20 మరియు 2 మెగాపిక్సెల్ కెమెరాలు ఉంటూ, క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 636 ప్రాసెసర్ ఆధారంగా ఈ ఫోన్ పని చేస్తుంది. దీని ధర రూ. 13,999/-



ఎంఐ ఎ2: 5.99 అంగుళాల స్ర్కీన్ పరిమాణంతో, 4జిబి ర్యామ్, 64జిబి స్టోరేజ్, వెనుక భాగంలో 12 మరియు 20, ముందు 20 మెగాపిక్సెల్ కెమెరాలు దీంట్లో లభిస్తాయి. క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 620 ప్రాసెసర్‌తో వచ్చే ఈ ఫోన్ ధర రూ. 13,990/-

వీటితోపాటు 19,999 రూపాయలకి హానర్ ప్లే, అదే ధరకి హువాయ్ పి20 లైట్, 14,999 రూపాయలకి మోటరోలా ఒన్ పవర్, 15,190 రూపాయలకి నోకియా 6.1, 11,899 రూపాయలకి యాసస్ జెన్‌ఫోన్ మాక్స్ ప్రో ఎం1, 15,340 రూపాయలకి నోకియా6.1, 11,999 రూపాయలకి హానర్ 8సి, 12,990 రూపాయలకి రియల్ మి 1 వంటి పలు మోడళ్లు అందుబాటులో ఉన్నాయి.

30 వేల రూపాయల లోపు!

శాంసంగ్ గెలాక్సీ ఎ8 ప్లస్: 6.0 అంగుళాల అమొల్డ్ డిస్‌ప్లేతో, 6జిబి ర్యామ్, 64జిబి స్టోరేజ్, వెనుక భాగంలో 16, ముందు 16 మరియు 8 మెగా పిక్సెల్ కెమెరాలతో ఎగ్జినోస్ 7885 ప్రాసెసర్ కలిగి ఉండే ఈ ఫోన్ ధర: రూ. 29,990

యాసస్ జెన్‌ఫోన్ 5జెడ్: 6జిబి ర్యామ్, 64 జిబి స్టోరేజ్‌తో, స్నాప్‌డ్రాగాన్ 845 ప్రాసెసర్, వెనుక భాగంలో 12 మరియు 8, ముందు 8 మెగా పిక్సెల్ కెమెరా, 6.2అంగుళాల స్ర్కీన్‌ని ఈ ఫోన్ కలిగి ఉంటుంది. దీని ధర రూ. 29,999/-

నోకియా 8.1: 4జిబి ర్యామ్, 64 జిబి స్టోరేజ్‌తో 6.18 అంగుళాల స్ర్కీన్ పరిమాణం ఈ ఫోన్ కలిగి ఉంటుంది. వెనక భాగంలో 12మరియు 13, ముందు 20 మెగాపిక్సెల్ కెమెరా ఉంటుంది. స్నాప్‌డ్రాగన్ 710 ప్రాసెసర్ పొందుపరచబడి ఉంటుంది. దీని ధర రూ. 26,999/-

వివో వి11 ప్రో: 25,990 రూపాయల ధర కలిగిన ఈ ఫోన్ 6.1 అంగుళాల స్ర్కీన్ పరిమాణం కలిగి ఉంటుంది. 6జిబి ర్యామ్,64జిబి స్టోరేజ్, వెనక భాగంలో 12 మరియు 5, ముందు భాగంలో 25 మెగా పిక్సెల్ కెమెరా లభించే ఈ ఫోన్లో స్నాప్‌డ్రాగన్ 660 ప్రాసెసర్ పొందుపరచబడింది.

ఒప్పో ఎఫ్9 ప్రో: 6జిబి ర్యామ్, 64 జిబి స్టోరేజ్‌తో 6.3 అంగుళాల స్ర్కీన్, మీడియా టెక్ హీలియో పి60 ప్రాసెసర్ ఈ ఫోన్లో పొందుపరచబడ్డాయి. 16 మరియు 2 మెగాపిక్సల్ కెమెరాలు వెనక భాగంలో, 25 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా లభిస్తున్నాయి. దీని ధర రూ.21,990/-

ఒప్పో ఆర్ 15 ప్రో: 6 జిబి ర్యామ్, 128 జిబి స్టోరేజ్‌తో స్నాప్‌డ్రాగన్ 660 ప్రాసెసర్ ఆధారంగా పనిచేసే ఈ ఫోన్లో 6.28 అంగుళాల స్ర్కీన్ ఉంటుంది. ఫోన్ వెనుక భాగంలో 20 మరియు 16, ముందు భాగంలో20 మెగా పిక్సెల్ కెమెరా లభిస్తాయి. దీని ధర రూ. 25,990/-



40 వేల రూపాయల లోపు!

ఒన్‌ప్లస్ 6టి: 6.41 అంగుళాల స్ర్కీన్ పరిమాణంతో స్నాప్‌డ్రాగాన్ 845 ప్రాసెసర్, 6 జిబి ర్యామ్, 128 జిబి స్టోరేజ్ కలిగిన ఈ ఫోన్లో వెనక భాగంలో 16 మరియు 20, ముందు భాగంలో16 మెగాపిక్సల్ కెమెరాలు ఉంటాయి. దీని ధర రూ. 37,999/- ఇన్ డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సార్ దీంట్లో ఉంటుంది.

ఒన్‌ప్లస్ 6: 8 జిబి ర్యామ్, 128 జిబి స్టోరేజ్‌తో, స్నాప్‌డ్రాగాన్ 845 ప్రాసెసర్, 6.28 అంగుళాల స్ర్కీన్ కలిగి ఉండే ఈ ఫోన్లో వెనక భాగంలో 16 మరియు20, ముందు భాగంలో 16 మెగాపిక్సెల్ కెమెరా ఉంటాయి. ఈ ఫోన్ ధర రూ. 39,999/-



ఎల్‌జి జి7ప్లస్ థింక్: 6.1 అంగుళాల స్ర్కీన్‌తో 6 జిబి ర్యామ్, 128 జిబి ఇంటర్నల్ స్టోరేజ్, వెనక భాగంలో 16 మరియు 16, ముందు భాగంలో 8 మెగా పిక్సల్ కెమెరా దీంట్లో ఉంటాయి. ఈ ఫోన్ ధర రూ. 39,999/-

గూగుల్ పిక్సెల్ 2ఎక్స్‌ఎల్: క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగాన్ 835 ప్రాసెసర్‌తో 6అంగుళాల స్ర్కీన్ పరిమాణం కలిగి ఉండి, 12.2 మెగా పిక్సల్ ప్రైమరీ కెమెరా, 8 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా కలిగిన ఈ ఫోన్లో 4జిబి ర్యామ్, 64 జిబి ఇంటర్నల్ స్టోరేజ్ లభిస్తాయి. దీని ధర రూ. 37,007/-

వీటితోపాటు యాపిల్ ఐఫోన్ 7రూ. 37,129కి, శాంసంగ్ గెలాక్సీ ఎ9 రూ. 35,140కి లభిస్తాయి.

ఇక చివరిగా, 40 వేల రూపాయలకి పైగా పెట్టగలిగితే శాంసంగ్ గెలాక్సీ నోట్ 9, ఎస్ 9, ఐఫోన్ ఎక్స్ హువాయ్ మేట్ 20 ప్రో, ఐఫోన్ 8, గూగుల్ పిక్సెల్ 3, పిక్సెల్ 3 ఎక్స్‌ఎల్ యాపిల్ ఐఫోన్ ఎక్స్‌ఎస్, ఐఫోన్ ఎక్స్ ఆర్, హువాయ్ పి20 ప్రో వంటి ఇతర మోడళ్లు లభిస్తాయి. ఇవి 40 వేల నుండి లక్షకు పైగా ధర కలిగి ఉంటాయి.



నల్లమోతు శ్రీధర్
fb.com/
nallamothusridhar

అదే పదివేలు!

నయా మొబైల్

గ్జియోమీ కంపెనీ 'రెడ్‌మి'ని ఓ ఇండిపెండెంట్ బ్రాండ్‌గా ప్రకటించి, కొత్త ఫోన్‌ను విడుదల చేసింది. అదే 'రెడ్‌మి నోట్ 7'. సాధారణంగా చాలా మంది స్మార్ట్‌ఫోన్ అభిమానులు కెమెరా క్లారిటీలో క్వాలిటీ కోసం ఫోన్ మోడళ్లను మారుస్తూ ఉంటారు. అయితే ఇప్పుడు వారికి 'రెడ్‌మి నోట్ 7' కూడా ఓ ఆప్షన్ అయ్యే అవకాశం ఉంది. ఇంకా మన దేశంలో విడుదల కాలేదు గానీ చైనాలో ఆల్‌రెడీ ఈ ఫోన్‌ను ఉపయోగిస్తున్నారు కూడా. ఈ ఫోన్ వెనుక డ్యుయెల్ కెమెరా ఆప్షన్ ఉంది. వాటిలో 48 మెగాపిక్సెల్‌తో పాటు 5 మెగాపిక్సెల్ కెమెరా సెన్సార్లను పొందుపరచడం విశేషం. ఈ 48 మెగాపిక్సెల్ కెమెరా 'రెడ్‌మి నోట్ 7'కి ప్రధాన ఆకర్షణగా మారింది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఈ ఫోన్ మీద క్రేజ్ మొదలైంది. ఇంతకీ ఈ ఫోన్ ధర 999 యుయాన్లు. అంటే మన కరెన్సీలో 10 వేల రూపాయలు. ఇక్కడ విడుదలైతే దాదాపు అదే ధర ఉండవచ్చని పరిశ్రమవర్గాలు భావిస్తున్నాయి.



చాట్ డేటా మాయమవుతోందా?

టెక్ న్యూస్!

వాట్సాప్ చాట్ డేటాను బ్యాకప్ తీసుకోవడం తప్పనిసరి. కానీ ఇప్పుడు హఠాత్తుగా వాట్సాప్ చాటింగ్ డేటా మాయమైపోతోందని ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై చాలా మంది వాట్సాప్ సంస్థకు మెయిల్స్ మీద మెయిల్స్ పంపిస్తున్నారు కూడా. వాట్సాప్ నుంచి ఎటువంటి స్పందనా లేదు. ఒకవేళ అన్-ఇన్‌స్టాల్ చేసుకొని, మళ్లీ డౌన్‌లోడ్ చేసినా ఉపయోగం ఏమీ ఉండటం లేదని చాలా మంది వాపోతున్నారు. కొన్ని నెలల క్రితం వాట్సాప్ నుంచి చాట్ బ్యాకప్ తీసుకోకపోతే గూగుల్ స్టోరేజీ నుంచి తొలగిస్తామని ప్రకటించింది. ఏడాదిపైగా ఉంటే చాట్ సంభాషణలకు గూగుల్ డ్రైవ్‌లోకి అప్‌డేట్ చేయకపోతే ఇదే పరిస్థితి. బహుశా ఇదే కారణమని అంటున్నారు టెక్ ఎక్స్‌పెర్ట్స్. వాట్సాప్ చాట్‌ను బ్యాకప్ తీసుకోవాలంటే మెనూ ఐకాన్‌ను క్లిక్ చేసి సెట్టింగ్స్‌లోని బ్యాకప్ టు గూగుల్ డ్రైవ్‌లోకి వెళ్లండి.



ఇక ఫింగర్ 'ప్రింట్' ఇవ్వాల్సిందే!

ఫింగర్ ప్రింట్ సెన్సార్ టెక్నాలజీతో చాలా ఫోన్లు ఇప్పుడు మార్కెట్లో సందడి చేస్తున్నాయి. అయితే కొన్నింటికి ఈ సాంకేతిక ఉండదు. అందుకే థర్డ్ పార్టీ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటూ ఉంటారు. ఒక యాప్‌కు ప్రత్యేకంగా సెక్యూరిటీ ఉండాలంటే ఇలాంటి యాప్స్ అవసరం తప్పనిసరి. అయితే ఈ యాప్స్ వల్ల ఫోన్‌లోని సమాచారం తస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. భవిష్యత్తులో వాట్సాప్‌కి రక్షణగా వేరే యాప్ అవసరం లేదు. త్వరలోనే అందులోనే ఫింగర్ ప్రింట్ సెక్యూరిటీ ఫీచర్‌ను పొందుపరచనుందని వార్తలు వస్తున్నాయి. వాట్సాప్ ఇప్పటికీ అధికారికంగా ప్రకటించలేదు గానీ దీని ఈ యాప్ బీటా వెర్షన్లలో ఈ ఫీచర్ దర్శనమివ్వడం ఈ వార్తలకు ఆస్కారమిచ్చింది. అంతేకాదు వాట్సాప్ తన 'ఆడియో మెసేజ్' ఆప్షన్‌లో కూడా మార్పులు తీసుకురానుందట. ఎవరికైనా మెసేజ్ పంపడానికి చాట్‌లోకి వెళ్లి మైక్ బటన్‌ను క్లిక్ చేసి మాట్లాడాలి. అయితే ఏదైనా తప్పు మాట్లాడమంటే సరిచేసుకోవడానికి ఉండదు. నిర్ణీత సమయంలో డిలీట్ చేసుకోవడమే పరిష్కారం. త్వరలో ఈ ఆడియో సందేశానికి ప్రివ్యూ చూసుకునే అవకాశం వాట్సాప్ కల్పించనుంది.





అఖిల్

ముస్తాబుల్లో... మజ్ను

అఖిల్ అక్కినేని హీరోగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై రూపొందుతోన్న చిత్రం 'మిస్టర్ మజ్ను'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వెంకీ అట్లూరి దర్శకుడు. నిర్మాత బి.వి.యస్.యన్.ప్రసాద్ మాట్లాడుతూ "యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇది. షూటింగ్ పూర్తయింది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ఈనెల 25న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. పాటలకు, టీజర్‌కు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. 'ఏమైనదో.. ఏమైనదో', 'మిస్టర్ మజ్ను' టైటిల్ సాంగ్, 'హార్ట్ బ్రేక్' పాటలను యువత పదేపదే వింటున్నారు. సంక్రాంతి కానుకగా సోమవారం ఉదయం 10 గంటలకు ఆడియో జ్యూక్ బాక్స్‌ను విడుదల చేస్తాం" అని అన్నారు. ఇందులో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించారు. నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర కీలక పాత్రధారులు.

పేపర్ మీద పెన్ను పెట్టలేదు

- అనిల్ రావిపూడి



"సాధారణంగా రచయితలు పెన్నూ పేపరు పట్టుకుని ఓ గదిలో ఒక్కరే కూర్చుని రాస్తారని విన్నా! నేను రచయితగా ఉన్నప్పుడూ... ఇప్పుడూ... ఎప్పుడూ ఏ చిత్రానికీ పేపర్ మీద పెన్ను పెట్టి రాయలేదు. సన్నివేశాల గురించి నా టీమ్‌తో చర్చిస్తా. వాళ్ళ రియాక్షన్స్ గమనిస్తా. నేనో పంచ్ డైలాగ్ చెబుతా. వాళ్ళు నవ్వితే బావున్నట్టు. లేకపోతే బాలేనట్టు. టీమ్‌తో చర్చించేటప్పుడే 80 శాతం సక్సెస్సా? కాదా? అని తెలుస్తుంది. అందుకే, నా చిత్రాలకు థియేటర్‌లో ఎక్కువ రెస్పాన్స్ ఉంటుంది" అన్నారు అనిల్ రావిపూడి. వెంకటేశ్, వరుణ్‌తేజ్ హీరోలుగా ఆయన దర్శకత్వంలో 'దిల్' రాజు సమర్పణలో శిరీష్, లక్ష్మణ్ నిర్మించిన చిత్రం 'ఎఫ్2'. 'ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' అనేది ఉపశీర్షిక. సంక్రాంతి సందర్భంగా శనివారం విడుదలైన ఈ సినిమా, ప్రేక్షకుల స్పందన గురించి అనిల్ రావిపూడి చెప్పిన సంగతులు...

- నాకు జంధ్యాల, ఈవీవీ, ఎస్వీ కృష్ణారెడ్డిగారి చిత్రాలంటే ఇష్టం. వాళ్ల చిత్రాల్లో ప్రతి పంచ్‌కి థియేటర్‌లో ప్రేక్షకులంతా నవ్వేవారు. ఎప్పట్నుంచో అటువంటి చిత్రం తీయాలనే నా కోరిక 'ఎఫ్2'తో నెరవేరింది. చిత్రం చూశాక... పలువురు ప్రేక్షకులు ట్విట్టర్‌లో జంధ్యాల, ఈవీవీతో నన్ను పోల్చి ప్రశంసించడం సంతోషమే అయినా... నేను వాళ్ల స్థాయికి వెళ్లాననుకోవడం లేదు. కానీ, వాళ్లను చూసి నేను స్ఫూర్తి పొందా.



రాశీ ఖన్నా

- మా చిత్రబృందమంతా కథను నమ్మి చేసిన చిత్రమిది. వెంకీగారి పక్కన వరుణ్‌తేజ్ కామెడీ టైమింగ్ ఎలా ఉంటుందో అనుకున్నా. అయితే అతను చాలా బాగా చేశాడు. సెట్‌లో వరుణ్‌తేజ్ డైలాగ్ పేపర్ చూశాక... 'నా పాత్ర నిడివి ఎంత? నావి ఎన్ని డైలాగులు? నాకు తక్కువ డైలాగులు ఉన్నాయి' అని ఏ రోజూ అడగలేదు. హీరోలు, హీరోయిన్లు, నటీనటులు... అందరూ తమ పాత్రలను అర్థం చేసుకుని నటించారు. వెంకటేశ్‌గారు అయితే నేను వద్దంటున్నా ఆయన వయసు గురించి పంచ్ డైలాగులు వేయమని అడిగి మరీ రాయించుకున్నారు.
- నేను పెళ్లి చేసుకున్నాను కాబట్టే స్వీయానుభవాలను మేళవించి కథ రాశా. సినిమా చూశాక నా శ్రీమతి ఏమనుకుంటుందో అని భయపడ్డా. కానీ, ఇబ్బందులు ఏం రాలేదు. తను చాలా హ్యాపీ. (నవ్వుతూ) చివర్లో భార్యలను పొగిడాను కదా! సినిమాపై కొన్ని విమర్శలూ వచ్చాయి. పది మందికీ నచ్చేలా సినిమా తీయడం కష్టమే. ఫస్టాఫ్‌లో బాగా నవ్వించాను కాబట్టి సెకండాఫ్‌లో కథ చెప్పాలి. చెప్పాను. అందువల్ల, కామెడీ తగ్గిందన్నారు. ఆ కథ చెప్పకపోతే ఆలుమగల ఎమోషన్ ప్రేక్షకులకు కనెక్ట్ కాదు. ఈ చిత్రానికి ముందు కొందరు ఫోన్ చేసి 'మీ సినిమాలో గ్లామర్ ఉండదేంటి? హీరోయిన్లను సరిగా చూపించరేంటి?' అని తిట్టారు. వాళ్లను అర్థం చేసుకుని ఫ్యామిలీలు చూసేలా, బోర్డర్ దాటకుండా 'గిర్రా గిర్రా' పాట తీశా. రాఘవేంద్రరావుగారు చూపించిన దారిలో!
- హిందీలో 'గోల్‌మాల్', 'హౌస్‌ఫుల్' సిరీస్ తరహాలో 'ఎఫ్2' సీక్వెల్స్ తీయాలనుంది. తప్పకుండా 'ఎఫ్ 3' చేస్తా. ఆల్రెడీ వెంకటేశ్, వరుణ్‌తేజ్‌కి సీక్వెల్ గురించి చెబితే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే... సీక్వెల్ ఎప్పుడు ఉంటుందో ఇప్పుడే చెప్పలేను. హిందీకి వెళ్లాలని లేదు. ఒకవేళ అవకాశం వస్తే నా చిత్రాలు రీమేక్ చేస్తా. 'పటాస్'లో హీరో క్యారెక్టర్‌ను హీరోయిన్‌కి మార్చి... లేడీ ఓరియెంటెడ్ 'కర్తవ్యం'లా చేద్దామనే ఆలోచన వచ్చింది.

అందరూ ఆనందంగా!

"నా చుట్టూ ఉన్నవారందరూ సంతోషంగా నవ్వుతూ ఉన్న ప్రతి పూటా నాకు పండగే" అని అంటున్నారు రాశీఖన్నా. ఆమె ప్రస్తుతం తమిళంలో విశాల్ సరసన ఓ చిత్రం, సిద్ధార్థ్ సరసన మరో చిత్రంలో నటిస్తున్నారు. నటనను కెరీర్‌గా ఎంపిక చేసుకున్న తర్వాత హైదరాబాద్‌లో సెటిలైన రాశీ ఖన్నా మాట్లాడుతూ "పండగ అంటే మా ఇంట్లో వాతావరణం ప్రత్యేకంగా ఉంటుంది. చుట్టూ ఉన్న ఇళ్లల్లో సందడి మా ఇంట్లోనూ ఉంటుంది. ఇరుగుపొరుగు వాళ్లు పొంగళ్లు తెచ్చిపెడతారు. నేను కూడా ఉదయాన్నే భగవంతుడికి దణ్ణం పెట్టుకుంటాను. రోజంతా భక్తిగా ఉంటాను. ఎదుటివారి కళ్లల్లో ఆనందం చూసిన ప్రతి క్షణం నాకు పండగలాగే ఉంటుంది" అని చెప్పారు.

రివార్డుల కోసం...




"గొప్ప దర్శకులు కె. విశ్వనాథ్, సింగీతం శ్రీనివాస్ వద్ద పలు సినిమాలకు కో డైరెక్టర్‌గా చేశా. ఇక, నేను దర్శకత్వం వహించిన 'బంటీ... ద బ్యాడ్ బాయ్' చిత్రానికి అవార్డులొచ్చాయి. రివార్డులు వచ్చే సినిమా చేయాలని 'అదృశ్యం' చేశా. ఇదొక హారర్ కామెడీ థ్రిల్లర్" అని రవిప్రకాశ్ కృష్ణంశెట్టి అన్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'అదృశ్యం'లో జాన్ హీరో. ప్రియాంక హీరోయిన్. గాయని కల్పన పోలీసాఫీసర్‌గా, అంగనారాయ్ ప్రతినాయిక ఛాయలున్న హీరోయిన్‌గా నటించారు. ఆల్‌డ్రిన్ సంగీత దర్శకుడు. ఈ సినిమా ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. ఫిబ్రవరిలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు రవిప్రకాశ్ కృష్ణంశెట్టి తెలిపారు.


హిరాణీ నన్ను వేధించారు

- ఓ సహాయ దర్శకురాలు



"రాజ్‌కుమార్ హిరాణీ నన్ను ఆరు నెలలు లైంగికంగా వేధించారు. శారీరకంగా, మానసికంగా కుంగిపోయాను. నా ఉద్యోగాన్ని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అప్పట్లో ఈ విషయం చెప్పలేదు. ఇప్పుడు ధైర్యం చేసి చెబుతున్నా" అని ఓ సహాయ దర్శకురాలు వెల్లడించారు. ఈ విషయం గురించి ఆమె 'సంజు' నిర్మాత విధు వినోద్ చోప్రా దంపతులకు మెయిల్ చేశారు. "హిరాణీ నా కన్నా 30 ఏళ్లు పెద్ద. అతన్ని తండ్రిలా భావించాను. కానీ అతని మనసులో వేరే తరహా ఆలోచన ఉండటం తెలిసి కుంగిపోయాను. అతని ప్రవర్తనకు విసిగిపోయి ఉద్యోగం మానేస్తే, పరిశ్రమలో నా గురించి తప్పుగా ప్రచారం జరుగుతుంది. ఎవరైనా ఆయన చెప్పిన మాటలే వింటారు. అదీ కాక ఆ సమయంలో నాకు ఉద్యోగం చాలా కీలకమనిపించింది. అందుకే మౌనం వహించాను" అని ఆమె తెలిపారు. తన క్లయింట్ హిరాణీపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదనీ, అతని పేరును చెడగొట్టడానికే... ఓర్వలేనివారు ఇలా చేయిస్తున్నారనీ హిరాణీ తరపు న్యాయవాది ఆనంద్ దేశాయ్ తెలిపారు.


DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
'DIL' RAJU PRODUCTION
FUN
F2
FRUSTRATION
సంక్రాంతి అల్లుళ్ళు
HAPPY BHOGI
BOMMA BLOCKBUSTER
అంతేగా అంతేగా
SHIRISH - LAXMAN ANIL RAVIPUDI DEVI SRI PRASAD
HARSHITH REDDY SAMEER REDDY
AS PRAKASH TAMMIRAJU VENKAT BANDI RATNA KUMAR
S KRISHNA


NBK FILMS LLP
అఖండ విజయం అందరి విజయం
వారాహి చలన చిత్రం
VIBRI
భోగి శుభాకాంక్షలు
NTR
కథానాయకుడు
క్రిష్ జాగర్లమూడి నందమూరి బాలకృష్ణ
సాయి కొర్రపాటి విష్ణు వర్ధన్ ఇందూరి యం.ఆర్.వి.ప్రసాద్ ఎం.ఎం.కీరవాణి


SMT. D.PARVATHI PRESENTS
DVV ENTERTAINMENT
MEGA POWERSTAR
MASS HIT
భోగి శుభాకాంక్షలు
వినయ విధేయ రామ
DANAYYA DVV BOYAPATI SREENU
DEVI SRI PRASAD
M. RATHNAM RISHI PUNJABI - ARTHUR A. WILSON KOTAGIRI VENKATESWARA RAO
A.S. PRAKASH KANAL KANNAN V.Y. PRAVEEN KUMAR



ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవి రేసులో ఇవాంకా

వాషింగ్టన్: ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవి రేసులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్, ఐక్యరాజ్య సమితి మాజీ అంబాసిడర్ నిక్కీ హేలీ పోటీపడుతున్నారు. ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవికి యూఎస్ నామినీ కోసం అంతర్గత సమీక్షలను ప్రారంభించామని, గవర్నర్లతో చర్చించిన అనంతరం కొత్త ప్రెసిడెంట్‌ను ప్రకటించనున్నట్లు ప్రపంచ బ్యాంక్‌కు చెందిన ఉన్నతాధికారవర్గాలు వెల్లడించినట్లు ది ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది. ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు జిమ్ యోంగ్ కిమ్ గత వారం ప్రకటించారు.

యాక్సిస్ బ్యాంక్, ఐటీసీల్లో ప్రభుత్వ వాటా అమ్మకం!

డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా ఖజానా నింపుకునే ప్రయత్నం

న్యూఢిల్లీ: మార్చి నెల దగ్గర పడుతోంది. ఈ లోపే 2018-19 ఆర్థిక సంవత్సర పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) లక్ష్యం పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ, ఎల్ అండ్ టీ కంపెనీల ఈక్విటీలో ఉన్న కొద్ది పాటి వాటాలను విక్రయించాలని యోచిస్తున్నట్టు అధికారవర్గాలు చెప్పాయి. ప్రస్తుతం ప్రభుత్వానికి యాక్సిస్ బ్యాంక్ ఈక్విటీలో 9.63 శాతం, ఐటీసీ ఈక్విటీలో 7.97 శాతం, ఎల్ అండ్ టీ ఈక్విటీలో 1.87 శాతం వాటా ఉంది. స్పెసిఫైడ్ అండర్‌టేకింగ్ ఆఫ్ యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూయూటీఐ) ద్వారా ప్రభుత్వం ఈ సంస్థల్లో తన ఈక్విటీ వాటాను కొనసాగిస్తోంది. బైబ్యాక్ ఆఫర్ కింద ఎల్ అండ్ టీ ఈక్విటీలో ఉన్న 1.87 శాతం వాటాను విక్రయించడం ద్వారా రూ.700 కోట్ల వరకు సమకూరతాయని అంచనా. యాక్సిస్ బ్యాంక్, ఐటీసీల్లో ఉన్న వాటాలో కొంత భాగాన్ని బ్లాక్ డీల్ లేదా బల్క్ డీల్స్ ద్వారా విక్రయించాలని యోచిస్తోంది. మార్చి2019తో ముగిసే ఆర్థిక సంవత్సరంలో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.80,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటి వరకు రూ.34,000 కోట్లు మాత్రమే సమీకరించింది. దీంతో మార్చిలోపు వీలైనన్ని ఎక్కువ కంపెనీల్లో ప్రభుత్వ వాటాను విక్రయించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఐడీబీఐ బ్యాంక్ భవిష్యత్‌పై వాటాదారుల విశ్వాసం

ఐడీబీఐ బ్యాంక్ ఈక్విటీలో ఎల్ఐసీ మెజారిటీ వాటా తీసుకున్నాక బ్యాంక్ భవిష్యత్‌పై మైనారిటీ వాటాదారులకు నమ్మకం కుదురుతోంది. దీంతో ఎల్ఐసీ ప్రకటించిన ఓపెన్ ఆఫర్‌ను కేవలం 22 శాతం మైనారిటీ వాటాదారులు మాత్రమే ఉపయోగించుకున్నారు. ఓపెన్ ఆఫర్ ప్రకటించే నాటికే ఎల్ఐసికి, ఐడీబీఐ బ్యాంక్ ఈక్విటీలో 44 శాతం వాటా ఉంది. వాటాదారుల నుంచి మరో 204.15 కోట్ల షేర్లను ఒక్కో షేరు రూ.61.73 చొప్పున కొనుగోలు చేసేందుకు గత నెల ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఈ ఆఫర్‌కు 22 శాతం మంది మైనారిటీ వాటాదారులు మాత్రమే స్పందించారు.

బీమా మార్కెట్లో తగ్గిన ఎల్ఐసీ హవా

70 శాతం దిగువకు మార్కెట్ వాటా

న్యూఢిల్లీ : జీవిత బీమా విభాగంలో ప్రైవేటు కంపెనీల జోరు పెరగడంతో ప్రభుత్వ రంగంలోని ఎల్ఐసీ మార్కెట్ వాటా ప్రభావితం అయింది. 2018 మార్చి 31వ తేదీతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ మార్కెట్ వాటా 70 శాతంకన్నా దిగువకు పడిపోయినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. అదే సమయంలో ప్రైవేటు రంగంలోని బీమా కంపెనీల ఉమ్మడి మార్కెట్ వాటా 30.64 శాతానికి పెరిగింది. ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన ప్రీమియం పరంగా 2016-17 సంవత్సరంలో ఎల్ఐసీ మార్కెట్ వాటా 71.81 శాతం ఉండగా 2017-18 సంవత్సరం నాటికి అది 69.36 శాతానికి దిగజారిందని బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏ) నివేదిక వెల్లడించింది. ఇదే సమయంలో ప్రైవేటు కంపెనీలు కొత్త వ్యాపార ప్రీమియంగా ఆర్జించిన ఆదాయం పెరగడంతో ఆ విభాగంలో వాటి మార్కెట్ వాటా పెరిగినట్టు తెలిపింది. రెన్యువల్ ప్రీమి యంపరంగా కూడా ఎల్ఐసీ మార్కెట్ వాటా 72.31 శాతం నుంచి 69.35 శాతానికి దిగజారింది. ప్రైవేటు కంపెనీల ఉమ్మడి వాటా 27.69 శాతం నుంచి 30.65 శాతానికి పెరిగింది.

2017-18 ఆర్థిక సంవత్సరంలో జీవితబీమా రంగంలోని సంస్థలు 2.82 కోట్ల కొత్త వ్యక్తిగత బీమా పాలసీలు జారీ చేయగా ఎల్ఐసీ 2.13 కోట్ల పాలసీలతో 75.7 శాతం వాటా సాధించింది. 68.59 లక్షల పాలసీలతో ప్రైవేటు బీమా కంపెనీలు 24.3 శాతం వాటా కలిగి ఉన్నాయి. కొత్త పాలసీల పరంగాఅ ప్రైవేటు కంపెనీలు 8.47 శాతం వృద్ధిని నమోదు చేయగా ఎల్ఐసీ వృద్ధి 5.99 శాతం ఉంది. 2018 మార్చి చివరి నాటికి దేశంలో 68 బీమా కంపెనీలు పని చేస్తుండగా 24 జీవితబీమా రంగంలోను, 27 సార్వత్రిక బీమా రంగంలోను ఉన్నాయి. ఆరు కంపెనీలు కేవలం ఆరోగ్యబీమాకే పరిమితం కాగా 11 రీఇన్సూరెన్స్ కంపెనీలున్నాయి. వీటిలో ఎనిమిది ప్రభుత్వ రంగంలోనూ, మిగతా కంపెనీలు ప్రైవేటు రంగంలోనూ ఉన్నాయి. స్విస్ ఆర్ఇ ప్రచురించిన నివేదిక ప్రకారం జీవితబీమా వ్యాపారపరంగా 88 దేశాల్లో భారత్ పదో స్థానంలో ఉంది. 2017 సంవత్సరం నాటికి మొత్తం ప్రపంచ జీవితబీమా మార్కెట్‌లో భారత్ వాటా 2.76 శాతం ఉంది. అదే ఏడాది జీవితబీమా ప్రీమియం ప్రపంచవ్యాప్తంగా 0.5 శాతం పెరుగుదల నమోదు చేయ గా భారతదేశంలో 8 శాతం వృద్ధి నమోదైంది.



సిద్ధంగా ఉన్న ఇళ్లకే గిరాకీ

2018లో పెరిగిన అమ్మకాలు.. హైదరాబాద్‌లో ధమాల్



న్యూఢిల్లీ: నిర్మాణం పూర్తయిన (రెడీ టు మూవ్) లేదా నిర్మాణం పూర్తిగావచ్చిన ఫ్లాట్లు లేదా ఇళ్లను కొనేందుకే చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడని వారు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల జోలికిపోవడం లేదు. దీంతో 2017తో పోలిస్తే 2018లో హైదరాబాద్, ముంబై, ఢిల్లీతో సహా దేశంలోని 9 ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు 7.2 శాతం పెరిగి 2.15 లక్షల యూనిట్లకు చేరాయి. ఇదే సమయంలో 2017తో పోలిస్తే కొత్త ఇళ్లు, ఫ్లాట్ల నిర్మాణం 22 శాతం తగ్గిపోయింది. దీంతో 2018లో అమ్ముడుపోకుండా మిగిలిన (ఇన్వెంటరీ) ఇళ్లు, ఫ్లాట్ల సంఖ్య పది శాతం తగ్గింది. దేశంలోని 9 ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ మార్కెట్ తీరుతెన్నులను పరిశీలించే 'ప్రాప్‌ఈక్విటీ' సంస్థ తన తాజా నివేదికలో ఈ విషయం పేర్కొంది. 'డెవలపర్లలో చాలా మంది గత ఏడాది ఉన్న పూర్తయిన ఇళ్లు లేదా ఫ్లాట్లు అమ్ముకోవడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. దీంతో కొత్త ప్రాజెక్టుల ప్రారంభం 20 శాతం వరకు తగ్గింది. ఇదే సమయంలో అమ్మకాలు 7.2 శాతం పెరిగి, అమ్ముడుపోని ఇళ్లు, ఫ్లాట్ల సంఖ్య 10 శాతం తగ్గింది' అని ప్రాప్‌ఈక్విటీ ఎండీ సమీర్ జసూజా చెప్పారు.

డీలాపడిన హైదరాబాద్ మార్కెట్

దేశవ్యాప్తంగా ఇళ్లు, ఫ్లాట్ల అమ్మకాలు పుంజుకున్నా హైదరాబాద్ మార్కెట్‌లో మాత్రం ఆ జోరు కనిపించలేదు. నిజానికి ఈ మార్కెట్‌లో 2017తో పోలిస్తే అమ్మకాలు 17 శాతం తగ్గాయి. 2018 మొత్తం మీద 15,4856 గృహాలు మాత్రమే అమ్ముడుపోయాయి. గురుగ్రామ్ (16 శాతం), నోయిడా (5 శాతం), థానే (2 శాతం) నగరాల్లోనూ 2018లో అమ్మకాలు పడకేశాయి.

చెన్నైలో అమ్మకాల జోరు

చెన్నై రియల్టీ మార్కెట్ 2018లో మంచి అమ్మకాల వృద్ధి రేటు నమోదు చేసింది. గత ఏడాది చెన్నైలో 14,920 యూనిట్లు అమ్ముడుపోయాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 40 శాతం ఎక్కువ. చెన్నై తర్వాత బెంగుళూరు మార్కెట్‌లో అత్యధికంగా 19 శాతం వృద్ధి రేటు నమోదైంది. తర్వాత పూణె 16 శాతం, కోల్‌కతా 14 శాతం వృద్ధి రేటు నమోదైంది.

పన్నుల భారం తగ్గించాలి


» ఫిక్కీ బడ్జెట్ విన్నపం

న్యూఢిల్లీ: కంపెనీలు చెల్లించే ఆదాయ పన్ను భారాన్ని వచ్చే బడ్జెట్‌లో ప్రస్తుత 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలని భారత పారిశ్రామిక, వాణిజ్య మండలుల సమాఖ్య (ఫిక్కీ) ప్రభుత్వాన్ని కోరింది. టర్నోవర్‌తో సంబంధం లేకుండా అన్ని కంపెనీలకు ఈ తగ్గింపు వర్తింపజేయాలని సిఫారసు చేసింది. ఆర్థిక వృద్ధి రేటును పురికొల్పడంతో పాటు పన్నుల రాబడులు పెంచేందుకూ ఈ చర్య ఉపకరిస్తుందని తెలిపింది. ప్రస్తుతం కంపెనీలపై 30 శాతం ఆదాయ పన్నుతోపాటు 20 శాతం డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్ అమలు చేయడంతో పన్నుల భారం పెరిగి పెట్టుబడులు, ఉత్పత్తి సామర్థ్యం విస్తరణకు పెద్దగా నిధులు ఉండడం లేదని పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు పన్నుల రేట్లు తగ్గిస్తున్న నేపథ్యంలో, మన దేశంలో అధిక పన్నుల భారం ఉంటే, విదేశీ కంపెనీలతో పోటీపడడం కష్టమని స్పష్టం చేసింది. ప్రస్తుతం 18.5 శాతంగా ఉన్న కనీస ప్రత్యామ్నాయ పన్ను భారాన్నీ తగ్గించాలని ఫిక్కీ కోరింది. వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారుల పన్నుల శ్లాబులను కూడా మార్చాలని స్పష్టం చేసింది.

ఫిక్కీ సిఫారసులు

- వార్షిక ఆదాయం రూ.20 లక్షల మించిన వారిని మాత్రమే 30 శాతం శ్లాబులో ఉంచాలి.
- శాస్త్ర పరిశోధనల ఖర్చులపై ఉన్న వెయిటెట్ డిడక్షన్లు కొనసాగించాలి.
- కంపెనీల సామాజిక బాధ్యత ఖర్చులు తగ్గించాలి.
- సెక్షన్ 80సీ మినహాయింపు వార్షిక పరిమితిని రూ.3 లక్షలకు పెంచాలి.
- ఉద్యోగుల భోజన ఖర్చుల పన్ను మినహాయింపు పరిమితిని రూ.50 నుంచి రూ.200కు పెంచాలి.

ద్రవ్యలోటు కట్టడి కష్టమే!



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీలో 3.3 శాతంగా నిర్దేశించుకున్న ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోవడం సవాలుగానే కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లలో తగ్గుదల, వ్యయాల్లో వృద్ధి, పారిశ్రామిక ఉత్పాదకతలో మందగమనం వంటి పరిణామాలు ప్రభుత్వానికి సవాలుగా మారినట్టు చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజాకర్షక ప్రకటనలను ప్రభుత్వం చేయడం వల్ల లక్ష్యసాధన మరింత ఇబ్బందికరంగా మారనుందని కూడా అంటున్నారు. తాజా పరిణామాలను పరిశీలిస్తున్న కొంత మంది విశ్లేషకులు ప్రసుతత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు జీడీపీలో 3.5 శాతానికి కూడా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నవంబరు చివరినాటికి ప్రభుత్వ అంచనాలో ద్రవ్యలోటు 114.8 శాతానికి చేరుకున్న విషయం తెలిసిందే.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు జీడీపీలో రూ.6.24 లక్షల కోట్లు (3.3 శాతం) ఉంటుందని ప్రభుత్వం బడ్జెట్లో పేర్కొంది. జీఎస్‌టీ వసూళ్లలో తగ్గుదల, ఎక్సైజ్ సుంకం వసూళ్లు తక్కువగా ఉండటం, పెట్టుబడుల ఉపసంహరణతో వచ్చే మొత్తం లక్ష్యానికన్నా తక్కువగా ఉన్నందువల్ల ద్రవ్య లోటు 3.4 శాతానికి పెరగవచ్చని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ (సావరిన్ రిస్క్ గ్రూప్) విలియం ఫోస్టర్ అంటున్నారు. వ్యవసాయ రుణ మాఫీలు లేదా ఇతర సబ్సిడీలవల్ల ప్రభుత్వ వ్యయాలు పెరుగుతున్నాయని చెప్పారు.

కాంపోజిషన్ డీలర్ల జీఎస్‌టీ వసూళ్లకు చెక్!



న్యూఢిల్లీ: కొనుగోలుదారుల నుంచి కొంత మంది కాంపోజిషన్ డీలర్లు జీఎస్‌టీని వసూలు చేస్తున్నారు కానీ ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయడం లేదు. దీని వల్ల కొనుగోలుదారులపై భారం పడుతోంది. ప్రభుత్వానికి రాబడి తగ్గుతోంది. డీలర్లు మాత్రం లబ్ధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సరికొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని రెవెన్యూ విభాగం భావిస్తోంది. దీని ప్రకారం కాంపోజిషన్ డీలర్లు, సర్వీస్ ప్రొవైడర్లు ఇన్వాయిస్‌లలో తమ జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌ను వెల్లడించాల్సి ఉంటుంది. కొనుగోలుదారుల నుంచి తాము ఎలాంటి పన్నును వసూలు చేయడం లేదనేందుకు ఇది ఉపయోగపడుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. కాంపోజిషన్ స్కీమ్ కింద ప్రయోజనం పొందే డీలర్లు కొనుగోలుదారుల నుంచి ఎలాంటి జీఎస్‌టీని వసూలు చేయరాదు. దీని గురించి వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రెవెన్యూ విభాగం ప్రచారం కూడా చేపట్టాలనుకుంటోంది. జీఎస్‌టీ కాంపోజిషన్ స్కీమ్ కింద ట్రేడర్లు, మాన్యుఫ్యాక్చరర్లు వస్తువులపై కేవలం ఒక శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి డీలర్లు కొనుగోలుదారుల నుంచి జీఎస్‌టీని వసూలు చేయడానికి అనుమతి లేదు. జీఎస్‌టీ కింద 1.17 కోట్ల వ్యాపార సంస్థలు నమోదయ్యాయి. ఇందులో 20 లక్షల సంస్థలు కాంపోజిషన్ స్కీమ్‌ను వినియోగించుకుంటున్నాయి.

మేజర్ పోర్టుల్లో పెరిగిన వస్తు రవాణా

9 నెలల్లో 3.77 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: దేశంలోని 12 మేజర్ పోర్టుల నుంచి వస్తురవాణా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల కాలంలో 3.77 శాతం పెరిగి 5.19 కోట్ల టన్నులకు చేరింది. ప్రధానంగా బొగ్గు, కంటైనర్లు, ఎరువుల రవాణా పెరగడం ఇందుకు దోహదపడిందని భారత పోర్టుల అసోసియేషన్ తెలిపింది. ఆ 12 పోర్టుల్లోను విశాఖపట్టణం పోర్టు సహా 9 పోర్టులు వస్తు రవాణాలో సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. మర్మగోవా, ముంబై, విఓ చిదంబరనార్ పోర్టులు మాత్రం ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి. ఎన్నూర్ పోర్టుగా ప్రసిద్ధి చెందిన కామరాజార్ పోర్టు గరిష్ఠంగా 18.38 శాతం వృద్ధి నమోదు చేసింది. వస్తు రవాణాలో 61 శాతం వాటా ఈ మేజర్ పోర్టులదే. షిప్పింగ్ మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం రూ.10 వేల కోట్ల పైబడిన పెట్టుబడులతో 50 ప్రాజెక్టులను 2018-19 సంవత్సరం లో బిడ్డర్లకు అప్పగించే ఆస్కారం ఉం ది. ఈ ప్రాజెక్టుల్లో ఏడాదికి 9 కోట్ల టన్నుల అదనపు వస్తు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.4146.73 కోట్ల పెట్టుబడితో 2.19 కోట్ల టన్నుల అదనపు సామర్థ్యం అందించగల 27 ప్రాజెక్టులను మాత్రమే బిడ్డర్లకు కేటాయించారు. మేజర్ పోర్టుల్లో అదనపు సామర్థ్యాలు జోడించడంతో పాటు వాని నిర్వహణా సామర్థ్యాలు పెంచేందుకు కూడా అ వసరమైన విధానాలు, నిబంధనలపరమైన మార్పు లు చేయనున్నట్టు ప్రభుత్వం గత నెలలో ప్రకటించింది.

10730 దిగువన బేరిష్

(జనవరి 14-18 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 10795 (+68)

నిఫ్టీ గత వారం 10870-10733 మధ్యన కదలాడి 68 పాయింట్ల లాభంతో 10795 వద్ద పాజిటివ్‌గా ముగిసింది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10816, 10701, 10856, 10798 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ ఒక్క 50 డిఎంఏ కన్నా మాత్రమే పైన ఉంది. మిగతా డిఎంఏలన్నింటి కన్నా దిగువనే ఉంది. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా దిగువకు (డెత్ క్రాస్) రావడం దీర్ఘకాలిక ట్రెండ్ బేరిష్ అయిందనేందుకు సంకేతం.
- స్వల్పకాలిక ట్రెండ్ మరోసారి బలహీనంగా మారింది. మధ్యకాలిక ట్రెండ్ బుల్లిష్‌గాను, దీర్ఘకాలిక ట్రెండ్ బేరిష్‌గాను ఉన్నాయి. ఈ వారాంతంలో 10900 దిగువన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బేరిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి : 10950

బ్రేక్‌డౌన్ స్థాయి : 10600

నిరోధ స్థాయిలు : 10950, 11025 (10875 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 10650, 10575 (10720 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన...

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

ప్రథమార్ధం మెరుగు (సోమవారానికి)

ఆస్ట్రో గైడ్

తిథి : పుష్య శుక్ల అష్టమి

నక్షత్రం : రేవతి/అశ్విని

కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ/రోహిణి, హస్త, శ్రవణం నక్షత్ర జాతకులు, మేష, సింహ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 12.51

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 10 గంటల నుంచి 1.15 వరకు మెరుగ్గాను, ఆ తర్వాత చివరి వరకు నిస్తేజంగాను ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లా‌స్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1 గంట సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.15 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.

నిరోధం : 10835, 10870

మద్దతు స్థాయిలు : 10755, 10720

గ్రహగతులివే...

- మీనంలోని రేవతి పాదం 4 - వృషభంలోని మృగశిర పాదం 1 మధ్యలో చంద్ర సంచారం
- ధనుస్సులోని ఉత్తరాషాఢ పాదం 1 నుంచి మకరంలోని ఉత్తరాషాఢ పాదం 3 మధ్యలో రవి సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1-4 మధ్యలో బుధ సంచారం
- వృశ్చికంలోని అనూరాధ పాదం 3 నుంచి జ్యేష్ఠ పాదం 1 మధ్యలో శుక్ర సంచారం
- మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 4 నుంచి రేవతి పాదం 1 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 2లో కన్య నవాంశలో శని సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 2లో మకర నవాంశలో బృహస్పతి సంచారం
- కర్కాటకంలోని పునర్వసు పాదం 4లో రాహువు, మకరంలోని ఉత్తరాషాఢ పాదం 2లో కేతువు సంచారం

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

ద్వైపాక్షిక ఒప్పందాలతో ఎగుమతులకు ఊతం



ముంబై: దేశ ఎగుమతులు మరింత పెరిగే విధంగా మరిన్ని దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకోవాలన్న ఉద్దేశంతో ఉన్నట్టు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు తెలిపారు. "రక్షణాత్మక ధోరణి ప్రపంచం ముందున్న పెను సవాలు. అన్ని దేశాలతో స్వేచ్ఛా వాణిజ్యానికి భారత్ మద్దతు ఇస్తోంది. కానీ చాలా దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరుకుంటున్నాం. లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆగ్నేయాసియా వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కావాలనుకుంటున్నాం" అని ప్రభు తెలిపారు. ఇప్పటికే ఆసియన్‌తోపాటు కొన్ని ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలున్నాయని ఆయన గుర్తు చేశారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు.



రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.00		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	433	చిత్తూరు	443
వరంగల్	435	చెన్నై	450
విజయవాడ	443	నమక్కల్	435
గోదావరి	443	బెంగళూరు	445
విశాఖపట్నం	445	ముంబై	495



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	82	విజయవాడ	85
కరీంనగర్	84	గుంటూరు	86
వరంగల్	82	ఒంగోలు	87
మహబూబ్‌నగర్	82	చిత్తూరు	92
కర్నూలు	82	నెల్లూరు	92
విశాఖపట్నం	82	అనంతపురం	86
గోదావరి	82		

బ్రేకౌట్‌కు ఎదురుచూపులు





వి సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 10900 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై చివరికి శుక్రవారంనాడు మైనర్ కరెక్షన్‌లో పడింది. కాని ఇప్పటికీ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉండడం వల్ల ఎలాంటి ప్రమాదం లేదు. వీక్లీ చార్టుల్లో వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమన అనిశ్చితంగా ముగియడం మరింత కన్సాలిడేషన్ అవసరం అనేందుకు సంకేతం. 50, 100 డిఎంఏల వద్ద నిఫ్టీ పరీక్ష ఎదుర్కొంటూ ఉండడం కూడా కీలక ధోరణికి మార్కెట్ సమాయత్తం అవుతోందనేందుకు సంకేతం. కొనుగోళ్లు, అమ్మకాలు కూడా నీరసంగానే సాగుతున్నందు వల్ల పరిధి పరిమితంగానే ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం బ్రేకౌట్ తప్పనిసరి. శుక్రవారం నాటి ఇన్ఫోసిస్ ఫలితాలు, ఐఐపీ గణాంకాలకు మార్కెట్ ఎలా స్పందిస్తుందన్నది సోమవారం తెలుస్తుంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో పడితే గతంలో ఏర్పడిన మైనర్ టాప్, ప్రధాన నిరోధం 10850కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన ప్రధాన నిరోధం 11000. ఇదే గతంలో ఏర్పడిన మేజర్ టాప్. అప్‌ట్రెండ్ కొనసాగాలంటే ఈ అవరోధం కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి.

బేరిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్ కోసం ప్రధాన మద్దతు స్థాయి 10700 వద్ద రికవరీ సాధించి తీరాలి. ఇదే గతవారం ఏర్పడిన మైనర్ బాటమ్. అంతకన్నా దిగజారితే మరింత బలహీనతలో పడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 10500.

స్వల్పకాలిక వ్యూహం: 10700కన్నా దిగువన స్టాప్ లాస్‌తో స్వల్పకాలిక ఇన్వెస్టర్లు స్వల్పకాలిక బై పొజిషన్లు హోల్డ్ చేయవచ్చు.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా వారం మధ్య స్థాయిలో 27500 వద్ద ముగియడం మరింత కన్సాలిడేషన్ అవసరం అనేందుకు సంకేతం. మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 27600కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 28000. మద్దతు స్థాయి 27300 కన్నా దిగజారితే మరింత కరెక్షన్‌లో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 26800.

పాటర్న్: "ఏటవాలుగా దిగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా మార్కెట్ దిగువకు వచ్చింది. మరింత అప్‌ట్రెండ్ సాధించాలంటే ఈ రేఖ వద్ద బ్రేకౌట్ అవసరం. 11000 వద్ద ట్రిపుల్ టాప్ పాటర్న్ ఏర్పడింది. ఆ పైన మాత్రమే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. అదే స్థాయిలో "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద బ్రేకౌట్ అవసరం. అయితే ఇప్పటికీ "ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా పైనే ఉండడం సానుకూల సంకేతం.

టైమ్: ఈ సూచి ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉంది. అలాగే ఈ వారంలో స్వల్పకాలిక రివర్సల్‌కు కూడా ఆస్కారం ఉంది.

టెక్ వ్యూ

సోమవారం స్థాయిలివే...

నిరోధం : 10850, 10920

మద్దతు : 10750, 10700

సీఈఎస్‌సీ (రూ.683)- కొనుగోలు స్థాయిలకు చేరువలో..		
రూ.685 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.710	రెండో నిరోధం రూ.740
రూ.665 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.640	రెండో మద్దతు రూ.620

వాసిరాజు సుందర్ రాజా

www.sundartrends.in

ఆచితూచి అడుగులేస్తేనే లాభాలు

'కొత్త ఇన్వెస్టర్ల' కోసం ఐదు సూత్రాలు

స్టాక్ మార్కెట్.. ఆచితూచి పెట్టుబడులు పెట్టేవారికి ఓ కల్పవృక్షం. నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దాదాపు రెండేళ్లు స్టాక్ మార్కెట్లు దూకుడుగా ముందుకు సాగాయి. ఈక్విటీ మార్కెట్లతో పాటు మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో పెట్టుబడులు పెట్టిన వారు పెద్దఎత్తున లాభాలను మూటగట్టుకున్నారు. అయితే పెద్ద నోట్లను రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న తర్వాత 'కొత్త ఇన్వెస్టర్లు' తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఈక్విటీ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకున్నారు. కొత్త ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టడం ప్రారంభించిన నాటి నుంచి ఆశించిన స్థాయిలో రిటర్నులను అందించలేకపోయాయి. అయితే కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించాలనుకునే వారికి వేచిచూసే ధోరణితో పాటు మంచి పోర్టుఫోలియోలను ఎంచుకోవటం ద్వారా లాభాలను కళ్లజూడవచ్చని మార్కెట్ విశ్లేషకులంటున్నారు. మార్కెట్లు అనిశ్చిత ధోరణిలో సాగుతున్నప్పుడు, ఆటుపోట్లు ఎదుర్కొంటున్న సమయంలో కొత్త ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెడితే బాగుంటుందని మార్కెట్ అడ్వైజర్లు, ఫైనాన్షియల్ ప్లానర్స్ సూచిస్తున్నారు. కొత్త ఏడాదిలో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే కొత్త ఇన్వెస్టర్లు 5 సూత్రాలను పాటిస్తే మంచిదని వివరిస్తున్నారు. లేకపోతే చేతులు కాల్చుకోవటం ఖాయమని అంటున్నారు.



రిటర్నుల కోసం వెంపర్లాడకండి

గడచిన కొన్నేళ్లుగా మంచి తీరును కనబరుస్తున్న పథకాల్లో కొత్త ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెడితే ఆశించిన స్థాయిలో రిటర్నులు వచ్చే అవకాశం ఉంది. అలాగే భవిష్యత్తులో ఈ పథకాలు మంచి రిటర్నులను అందించే అవకాశం ఉంటుంది. కొన్ని మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఉన్న రిస్కులు కొంతమంది ఇన్వెస్టర్లకు తెలియవు. సొంత ఆలోచనతో ఇలాంటి పథకాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా నష్టపోవటమే తప్ప లాభాలు ఏ మాత్రం రాకపోవచ్చు. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడమనేది ఒక గోల్ అని మర్చిపోరాదు. ఈ పథకాలు అప్పటికప్పుడు రిటర్నులను అందించలేవు. అయితే దీర్ఘకాలంలో మాత్రం మెరుగైన రాబడులను అందించటం ఖాయం.

సరైన దృక్పథం ఉండాలి

కొత్త ఇన్వెస్టర్లు.. తాము పెడుతున్న పెట్టుబడుల పట్ల సరైన దృక్పథాన్ని కలిగి ఉండాలి. దీర్ఘకాలిక లక్ష్యాలతోనే వీటిల్లో పెట్టుబడులు పెట్టాలి. స్వల్పకాలిక లక్ష్యాలను కోరుకునే వారు డెట్ ఫండ్స్‌ను ఎంచుకోవచ్చు. మంచి రిటర్నులు కావాలనుకునే వారు దీర్ఘకాలిక దృక్పథంతో మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు పెడితే మంచిది. కొంత మంది ఇన్వెస్టర్లు యాభై శాతం రిటర్నులు రాగానే తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. మీ లక్ష్యాల పట్ల మీకు విశ్వాసం ఉంటే దీర్ఘకాలంలో మీ పెట్టుబడులు అద్భుతమైన లాభాలను కచ్చితంగా అందిస్తాయి. స్టాక్ మార్కెట్లు పడినా, ఆటుపోట్లు ఎదుర్కొంటున్నా భయపడకుండా పెట్టుబడులు పెడితే మీకు ఢోకా ఉండదు.

కంగారుపడొద్దు

మార్కెట్లు ఆటుపోట్లకు గురయినప్పుడు, అనిశ్చిత ధోరణిలో సాగుతున్నప్పుడు ఇన్వెస్టర్లు కంగారుపడకుండా ఉండటం మంచిది. మార్కెట్లు పడిపోతున్నాయని భయపడాల్సిన పనిలేదు. ఆటుపోట్లను మన మిత్రులుగా భావించి నిదానంగా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లవచ్చు. ఇటీవలి మార్కెట్ పతనాల్లో చాలా మంది ఇన్వెస్టర్లు భయపడిపోయి తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవటమో లేదా యధాతథంగా ఉంచటమో చేశారు. దీనివల్ల వారు ఏ మాత్రం రిటర్నులను అందుకోలేకపోయారు. దీర్ఘకాలం లో సంపదను సృష్టించాలనుకునే వారికి మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు బెటర్. ఇదే సమయలో క్రమానుగత పెట్టుబడుల (సిప్)పై కొత్త ఇన్వెస్టర్లు దృష్టి సారించవచ్చు.

బ్యాలెన్స్‌డ్ పోర్టుఫోలియో

స్టాక్ మార్కెట్లు దూకుడుగా ముందుకు సాగిన తరుణంలో కొంతమంది ఇన్వెస్టర్లు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు పెట్టారు. అయితే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే మ్యూచువల్ ఫండ్ పోర్టుఫోలియో కొంత రక్షణనిస్తుంది. మార్కెట్లు పడిపోయినా, అసెట్స్ ఆశించిన పనితీరు కనబరచలేకపోయినా మీ పెట్టుబడులకు పోర్టుఫోలియో ఇన్వెస్ట్‌మెంట్‌పై పెద్దగా ప్రభావం పడదు. కొంత మంది ఇన్వెస్టర్లు స్మాల్, మిడ్ క్యాప్ పథకాల్లో పెట్టుబడులు పెట్టి చేతులు కాల్చుకోవటమే ఇందుకు నిదర్శనం. పెట్టుబడులు పెట్టేముందు భిన్న రకాల పెట్టుబడుల సాధనాలను ఎంచుకోవటం ద్వారా పోర్టుఫోలియోను సమతూకంగా ఉంచుకోవచ్చు.

వివిధీకరణ ఎక్కువగా వద్దు

పెట్టుబడుల వివిధీకరణ కూడా పెట్టిన పెట్టుబడులకు మేలు చేకూరుస్తుంది. ఎంపిక చేసిన పోర్టుఫోలియోలో ఎక్కువ పథకాలు లేకుండా చూసుకోవాలి. కొంతమంది పోర్టుఫోలియోల్లో పెద్దఎత్తున ఎంఎఫ్ పథకాలుంటాయి. వీటివల్ల పెట్టిన పెట్టుబడులకు రక్షణ ఉంటుందని చెప్ప టం కష్టం. కొత్త ఇన్వెస్టర్లు మంచి పథకాల్లో పెట్టుబడులు పెట్టడం మంచిది. పెట్టుబడుల్లో వివిధీకరణ మంచిదే... అయితే ఇది మరీ ఎక్కువగా ఉంటే మాత్రం ఇబ్బంది పడాల్సి వస్తుంది. పోర్టుఫోలియోలు ఓవర్ ల్యాపింగ్ అయి రిటర్నులు తగ్గిపోయే అవకాశాలుంటాయి. రెండు నుంచి ఐదు పథకాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ లేకుండా సాగిపోవచ్చు.

ఆధారపడే వారు లేకున్నా బీమా అవసరమా?

బీమా ప్రతి ఒక్కరి కనీసావసరం అన్నది అందరికీ తెలిసిందే. అయితే కొందరు తమపై ఆధారపడిన వారు లేరని, అలాంటప్పుడు తనకెందుకు పాలసీ అని భావిస్తుంటారు. అలాంటి వారికి కూడా బీమా రక్షణ అవసరమే. అదెలాగో చూద్దాం.

ఒకవేళ మీపై ఆధారపడిన వారు లేకపోయినా కూడా బీమా రక్షణ పొందడం అవసరం. కుటుంబ యజమానికి లేదా ప్రధాన సంపాదనాపరునికి ఏదైనా అనుకోని విపత్తు కలిగితే వారసులకు ఆర్థిక రక్షణ కల్పించడం, కుటుంబ పోషణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడడం కోసం బీమా అవసరం అన్నది సాధారణ సూత్రం. కానీ సంతానం లేనివారు లేదా వివాహం చేసుకోకుండా ఉండిపోయిన వారు ఉంటారు. కానీ వారి ఆస్తిపాస్తులకు వారసులెవరో ఒకరుంటారు. ఏకాకిగా జీవితం సాగించే వారికైనా తల దాచుకోవడానికి ఒక ఇల్లు, అనారోగ్యం ఏర్పడితే రక్షణకు కొంత నిధి అవసరం. అలాగే సంసారం లేకున్నా కొందరు సొంతంగా ఇల్లు కొనుక్కుంటారు. ఆ ఇంటి కోసం రుణం చేసి ఉండవచ్చు. అనూహ్యమైన విపత్తు ఏదైనా ఏర్పడితే ఆ రుణానికి హామీదారులుగా ఉన్నవారు లేదా నామినీలుగా వారు నమోదు చేసిన వారిపై ఆ అప్పు చెల్లించాల్సిన బాధ్యత పడుతుంది. ఇలాంటి బాధ్యత నుంచి నామినీలు/ హామీదారులు/ వారసులకు రక్షణ కల్పించాలంటే ఏకాకి జీవితం గడిపే వారికి కూడా బీమా రక్షణ అవసరమే. అదే సమయంలో వారు తమకు రుణం ఇచ్చిన బ్యాంకును కూడా బకాయిల భారం నుంచి తప్పించిన వారవుతారు.

బీమా పాలసీ ఆప్షన్లు

సాధారణ వ్యక్తులు, గృహస్థులకు వర్తించే బీమా పాలసీలే ఇలాంటి వారికి కూడా వర్తిస్తాయి.

హోల్ లైఫ్ ఇన్సూరెన్స్ : ఇలాంటి పాలసీలు వృద్ధాప్యంలో రక్షణ ఇస్తాయి. కొన్ని కంపెనీలు పాలసీదారుని యావత్ జీవితానికి...కొన్ని నూరేళ్ల వయసు దాటిన వారికి కూడా బీమా రక్షణ కల్పిస్తున్నాయి.

యూనిట్ లింక్డ్ బీమా పాలసీ: ఈ పాలసీలు మార్కెట్ అనుసంధానిత పెట్టుబడి ప్రయోజనాలు కల్పిస్తాయి.

మనీబ్యాక్ పాలసీ : నిర్దిష్ట కాలపరిమితిలో కొంత శాతం వంతున బీమా సొమ్మును చేతికి అందించడంతో పాటు పాలసీ గడువు ముగిసిన తర్వాత ఏకమొత్తంలో సొమ్మును అప్పటికి చేరిన వడ్డీని కూడా జత చేసి అందిస్తాయి.

ఇవన్నీ సాధారణ బీమా పాలసీలు. ఇవికాకుండా ఇంటికి, ఇంటిలోని వస్తువులకు రక్షణ కల్పించేందుకు జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఇంటి రుణం పరిమాణాన్ని బట్టి ఇంటికి రక్షణ కల్పిస్తూ ఉంటాయి. కాని ఈ రక్షణ కేవలం ఇంటికి భూకంపాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల నుంచి మాత్రమే రక్షణ కల్పిస్తాయి. ఇవి కూడా ఒక టర్మ్ పాలసీ వంటివే. టర్మ్ పాలసీలో పాలసీదారుడు మరణిస్తే అతని కుటుంబానికి హామీ ఇచ్చిన మొత్తాన్ని చెల్లించిన తీరులోనే ఇంటికి నష్టం జరిగిన సందర్భంలోనూ వర్తిస్తుంది.



మీ బీమా పాలసీలో క్లెయిమ్ చేయని సొమ్ములేమైనా ఉన్నాయా, భయపడాల్సిన అవసరం లేదు. మీ సొమ్ము సంబంధిత బీమా కంపెనీ వద్ద సురక్షితంగా ఉంటుంది. అవసరమైన పత్రాలు సమర్పించి ఆ మొత్తం మీరు తీసుకోవడం సాధ్యమేనంటున్నారు కోటక్ మహీంద్రా బ్యాంక్ చీఫ్ రిస్క్ ఆఫీసర్ సునీల్ శర్మ.

క్లెయిమ్ చేయని సొమ్ము రాబట్టుకోవడం ఎలా?

బీమా పాలసీదారుల ఖాతాలో జమ అయిన నిధులు పాలసీ గడువు ముగిసిన ఆరు మాసాలు, ఆ పైబడి క్లెయిమ్ చేయకుండా ఉండిపోతే వాటిని అన్‌క్లెయిమ్డ్ మనీగా పరిగణిస్తారు. పాలసీలో ప్రీమియం రూపంలో జమ అయిన నిధులు, వాటిపై వడ్డీ అంతా అన్‌క్లెయిమ్డ్ మనీ నిర్వచనంలోకి వస్తుంది. సాధారణంగా ఆరోగ్య బీమా పాలసీల్లో అయితే అడ్వాన్స్‌గా పాలసీదారులు చెల్లించిన ప్రీమియం పాలసీ కాలపరిమితి నుంచి ఆరు మాసాల లోగా సద్దుబాటు చేయకపోయినా అది కూడా అన్‌క్లెయిమ్డ్‌గానే పరిగణిస్తారు. సాధారణంగా పాలసీదారులు కాలపరిమితి ముగియగానే తమ పాలసీలో జమ అయిన మొత్తాన్ని తీసేసుకుంటారు. కాని బీమాపై అవగాహన అంతగా లేని వారు, నిరక్షరాస్యులు, నిరంతరం ఆఫీసు ఒత్తిడిలో పని చేసే వారు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తిరుగుతూ ఉండే ఉద్యోగుల విషయంలో ఈ జాప్యం జరుగుతూ ఉంటుంది. డెత్ క్లెయిమ్‌లు, ఆరోగ్య ప్రయోజన క్లెయిమ్‌లు, మెచ్యూరిటీ క్లెయిమ్‌లు, సర్వైవల్ బెనిఫిట్, సరెండర్ లేదా కాలపరిమితి ముగియకుండానే నిలిచిపోయిన పాలసీలు, రిఫండ్ ప్రీమియంలు, సద్దుబాటు చేయని ప్రీమియం డిపాజిట్లు, ఇండెమ్నిటీ బాండ్లు అన్‌క్లెయిమ్డ్ నిధులు పేరుకుపోవడానికి కారణం అవుతాయి.



అన్‌క్లెయిమ్డ్ నిధులు పేరుకుపోవడానికి కారణాలు...

- క్లెయిమ్ సెటిల్మెంట్ చేసే సమయానికి లబ్ధిదారుని ఆచూకీ లేదా చిరునామా తెలియకపోవడం
- పాలసీదారులు/బీమా ప్రయోజనం కోసం దరఖాస్తు చేసిన వారు బ్యాంకు ఖాతా వివరాలు అందించకపోవడం
- లబ్ధిదారుని కెవైసి (నో యువర్ కస్టమర్ వివరాలు) తెలియ చేయకపోవడం
- లబ్ధిదారులు పాలసీలో ఇచ్చిన చిరునామాలో ఉండకపోవడం

ఎలా క్లెయిమ్ చేయాలి?

పాలసీదారులు తమ పాలసీ వివరాలతో పాటు కెవైసి వివరాలు కూడా తీసుకుని దగ్గరలోని సంస్థ కార్యాలయాన్ని లేదా కస్టమర్ కేర్ నంబరును సంప్రదిస్తే క్లెయిమ్ చేయకుండా ఉండిపోయిన సొమ్ము ఎలా తీసుకోవచ్చునో తెలియచేస్తారు. ఆ దరఖాస్తు ఆధారంగా బీమా కంపెనీ పాలసీదారుని గుర్తింపు వివరాలను ఖరారు చేసుకుంటే అతని ఖాతాలో ఉన్న క్లెయిమ్ చేయని నిధులను అప్పటివరకు వడ్డీ కూడా జత చేసి చెల్లిస్తుంది.

ఇలాంటి నిధులు సురక్షితమేనా?

బీమా కంపెనీల వద్ద క్లెయిమ్ చేయకుండా పేరుకుపోయిన నిధులు సురక్షితంగానే ఉంటాయా అనే అనుమానం చాలా మందికి కలగవచ్చు. కాని పాలసీదారులు/లబ్ధిదారుల ఖాతాల్లో క్లెయిమ్ కాకుండా ఉండిపోయిన నిధులను ఏ బీమా సంస్థ అయినా సాధారణ అవసరాలకు వినియోగించడం లేదా మాఫీ చేయడం చెల్లదు. ప్రతీ బీమా కంపెనీ బోర్డులోనూ ఉండే పాలసీ హోల్డర్ల రక్షణ కమిటీ పాలసీదారుల నిధులు సరైన సమయంలో చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకుంటుంది. అలాగే లబ్ధిదారులు లేదా పాలసీదారులను గుర్తించినట్టయితే క్లెయిమ్ కాకుండా ఉండిపోయిన నిధులు ఆ మేరకు తగ్గాయో, లేదో కూడా కాలానుగుణంగా సమీక్షిస్తూ ఉంటుంది. అలాంటి నిధుల విషయంలో అనుసరించాల్సిన విధివిధానాలు, కస్టమర్ సర్వీస్ నిబంధనల విషయంలో ఆయా సంస్థలను చైతన్యపరుస్తూ ఉంటుంది. అన్‌క్లెయిమ్డ్ నిధుల వివరాలను కమిటీ అడిగినప్పుడల్లా అందించాల్సిన బాధ్యత బీమా కంపెనీకి ఉంటుంది. అలాగే బీమా కంపెనీలన్నీ తమ వెబ్‌సైట్‌లో అన్‌క్లెయిమ్డ్ నిధుల వివరాలను ప్రతీ ఆరు నెలలకు ఒకసారి అప్‌డేట్ చేస్తూ ఉండాలి.

ఇలాంటి నిధులను కంపెనీలు ఏం చేస్తాయి?

క్లెయిమ్ కాకుండా తమ వద్ద ఉండిపోయిన నిధులను బీమా కంపెనీలు మెరుగైన రాబడులు అందించే ఉపకరణాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఆ పెట్టుబడిపై వచ్చిన రాబడిలో 0.5 శాతం మొత్తాన్ని నిర్వహణ, ఫండ్ మేనేజ్‌మెంట్ వ్యయాల కింద మినహాయించుకుని మిగతా మొత్తాన్ని అన్‌క్లెయిమ్డ్ ఖాతాకు జమ చేస్తూ పోవాలి. 10 సంవత్సరాలకు పైబడి క్లెయిమ్ కాకుండా ఉండిపోయిన నిధులను మాత్రం సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ చేయాల్సి ఉంటుంది.

సత్వర సెటిల్మెంట్‌కు చర్యలు

పాలసీ తీసుకున్నప్పుడు పాలసీదారులు అందించిన లబ్ధిదారుల వివరాలతో క్లెయిమ్ చేసుకున్న లబ్ధిదారుల వివరాలు సరిపోలకపోతే సరైన లబ్ధిదారుని గుర్తించేందుకు బీమా కంపెనీలు సర్వీస్ ప్రొవైడర్ల సేవలు తీసుకుంటున్నాయి. పాలసీదారులతో సరైన సమన్వయం కలిగి ఉండేందుకు కంపెనీలు వారి ప్రత్యామ్నాయ కాంటాక్ట్ నంబర్లు, మెయిలింగ్ వివరాలు, శాశ్వత అడ్రస్ వివరాలు తీసుకుంటాయి. పాలసీదారుల ప్రీమియం, మెచ్యూరిటీ వివరాలను ఎప్పటికప్పుడు ఆయా నంబర్లకు ఎస్ఎంఎస్‌ల రూపంలో పంపుతూ ఉంటాయి. తమ అడ్రస్‌లోగాని, ఫోన్ నంబర్లలో గాని, ఈ- మెయిల్‌లో గాని మార్పులేవైనా ఉంటే సరిదిద్దించుకోవలసిన బాధ్యత పాలసీదారుల పైనే ఉంటుంది. అలా చేయలేనప్పుడు ఇలాంటి ఇబ్బంది ఎదుర్కొనక తప్పదు. తస్మాత్ జాగ్రత.

కొత్త పాలసీలు...

ఫ్యూచర్ జెనరాలి బిగ్ డ్రీమ్స్ బీమా ప్లాన్

ఫ్యూచర్ జెనరాలి సంస్థ బిగ్ డ్రీమ్స్ ఇన్సూరెన్స్ ప్లాన్ పేరిట కొత్త తరం యూలిప్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఇది పాలసీదారులు ప్రీమియం చెల్లించినప్పుడల్లా అదనపు కేటాయింపులు చేస్తూ ఉంటుంది. దీనివల్ల కస్టమర్లు దీర్ఘకాలం పెట్టుబడిని కొనసాగిస్తూనే ఉంటారు. ఈ ప్లాన్‌కు ఫండ్ నిర్వహణ, మోర్టాలిటీ చార్జీలు మాత్రం కస్టమర్ నుంచి వసూలు చేస్తారు. మూడు ప్రధాన జీవిత దశల్లో కస్టమర్ల భారీ కలలకు ఇది మద్దతు ఇస్తుంది. ఆప్షన్ 1 కింద సంపద కల్పన అవకాశం, ఆప్షన్ 2 కింద భారీ మొత్తంలో రిటైర్మెంట్ ఫండ్, మూడో ఆప్షన్ కింద బీమాదారుడు మరణించినట్టయితే పిల్లల విద్య లేదా కుటుంబ జీవన శైలి దెబ్బ తినకుండా ఉండేందుకు నిధులు అందిస్తుంది. పాలసీ చెల్లుబాటులో ఉన్న కాలంలో క్రమానుగత పాక్షిక నిధుల ఉపసంహరణకు, క్రమానుగత నిధుల బదిలీకి ఇది అనుమతిస్తుంది.ప్రీమియంను, ప్రీమియం చెల్లించే కాలపరిమితిని కూడా పెంచుకునే స్వేచ్ఛ ఉంటుంది.

ఏడాది ప్రీమియంకే రెండేళ్ల కవరేజీ

ఎడెల్వీస్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అందిస్తున్న ఆరోగ్య బీమా పథకానికి ఒక ప్రత్యేక స్వభావం గల యాడ్ ఆన్‌ను జత చేసింది. హెల్త్ 241 పేరిట వ్యవహరించే ఈ పాలసీ "టూ ఫర్ వన్" (ఒక దానికి రెండు) అనే విలక్షణమైన ఆఫర్ అందిస్తోంది. అంటే ఈ పాలసీ కింద మొదటి ఏడాది ఎలాంటి క్లెయిమ్ రాకపోతే రెండో ఏడాది కవరేజీ పూర్తి ఉచితంగా కల్పిస్తారు. ఎడెల్వీస్ కంపెనీ నుంచి ఆరోగ్య బీమా తొలిసారిగా చేయించుకున్న వారు మాత్రమే దీనికి అర్హులు. అలాగే మొదటి రెన్యువల్ సంవత్సరానికి మాత్రమే దీన్ని వర్తింపచేస్తోంది.

- బీమా రంగంలోనే తొలి సారిగా 19 రకాల విధివిధానాలకు జీరో డిశ్చార్జ్ టైమ్, గ్యారంటీడ్ బెడ్ హామీలను కూడా ఇస్తోంది. గ్యారంటీడ్ బెడ్ ప్రయోజనం కింద ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో పాలసీదారునికి బెడ్ హామీ కల్పిస్తోంది.
- చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిన సమయంలో పాలసీదారులు ఒక్క పైసా కూడా డిపాజిట్ చేయాల్సిన అవసరం ఉండదు.
- దీని కింద కోటి రూపాయల మొత్తానికి సిల్వర్, గోల్డ్, ప్లాటినం పేరిట మూడు ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. ఇండివిడ్యువల్ వేరియెంట్‌లో తల్లిదండ్రులు, అత్తమామలు, తాతనానమ్మలు సహా ఎనిమిది మందికి గరిష్ఠంగా రక్షణ పొందవచ్చు. ఫ్లోటర్ వేరియెంట్ కింద పాలసీదారుడు, భార్య, ముగ్గురు పిల్లలు మొత్తం ఐదుగురికి రక్షణ పొందవచ్చు.



ఎన్‌సీడీపై రాబడి సిప్‌లోకి...

కొంతమంది ఇన్వెస్టర్లు మార్కెట్ తీవ్ర ఆటుపోట్లలో ఉన్న సమయంలో పూర్తిగా సురక్షితంగా ఇన్వెస్ట్ చేయాలని భావిస్తారు. అలాంటి వారి కోసం ఫైనాన్షియల్ ప్లానర్లు ఒక చక్కని వ్యూహాన్ని సూచిస్తున్నారు. మార్కెట్లో అప్పటికి అందుబాటులో ఉండే ఎన్‌సీడీల్లో (నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు) తమ వద్ద ఉన్న సొమ్మును ఇన్వెస్ట్ చేసి వడ్డీ రూపంలో దానిపై వచ్చే రాబడిని మ్యూచువల్ ఫండ్ సంస్థల నిర్వహణలోని క్రమానుగత పెట్టుబడి ఉపకరణాల్లో (ఎస్ఐపీ-సిప్) ఇన్వెస్ట్ చేయడం వల్ల మంచి రాబడి పొందవచ్చునన్నది వారి సూచన. సాధారణంగా వివిధ కంపెనీలు సగటు ఇన్వెస్టర్ల కోసం జారీ చేసే ఎన్‌సీడీలపై ఆకర్షణీయమైన వడ్డీని అందిస్తాయి. బ్యాంకుల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వచ్చే రాబడి కన్నా ఇది ఎక్కువగానే ఉంటుంది. అలాగే ఈక్విటీ మార్కెట్ బేరిష్ దశలో ఉన్న సమయంలో వచ్చే రాబడులతో పోల్చినా కూడా ఇవి అందించే రాబడి ఎక్కువే. అయితే మార్కెట్ బుల్లిష్ దశలోనే ఉండి తీవ్రమైన ఆటుపోట్లు ఎదుర్కొంటున్న సమయంలో మాత్రం ఈక్విటీ పెట్టుబడులు అనిశ్చితంగా ఉంటాయి. దీర్ఘకాలంలో ఈక్విటీలు మెరుగైన రాబడులే అందిస్తాయనే సిద్ధాంతాన్ని ఇలాంటి సమయంలో ఆచరణీయం చేయడం సాధ్యం కాదు. అలాంటి సందర్భాల్లో ఇలాంటి పెట్టుబడి వ్యూహంతో అటు మెరుగైన రాబడితో పాటు ఇటు ఈక్విటీ మార్కెట్ ప్రయోజనాలు కూడా పొందడం సాధ్యం అవుతుందని ఇన్వెస్ట్‌మెంట్ ప్లానర్లు చెబుతున్నారు. ఈ వ్యూహంలో ఇన్వెస్టర్ చేసిన అసలుకు పూర్తిరక్షణ ఉంటుంది. తమ పెట్టుబడికి పూర్తిగా రక్షణ పొందుతూ వడ్డీని మాత్రం ఎక్కడైనా ఇన్వెస్ట్ చేయాలనుకునే వారికి ఇది చక్కని వ్యూహమని మనీహనీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎండీ అనూప్ భయ్యా అంటున్నారు. ప్రధానంగా పెట్టుబడుల రంగంలోకి తొలిసారిగా ప్రవేశించిన వారికి ఈ వ్యూహం ఆదర్శనీయమైనదని క్రెడో క్యాపిటల్ వ్యవస్థాపకుడు ఎస్ శంకర్ అన్నారు. అయితే మంచి క్రెడిట్ రేటింగ్ ఉన్న కంపెనీలు జారీ చేసే ఎన్‌సీడీలనే ఎంచుకోవడం అవసరమని ఆయన సలహా.

ఎన్‌సీడీ ప్లస్ ఎస్ఐపీ

ఎన్‌సీడీలో పెట్టుబడి (రూ)	12,50,000
నెలవారీ వడ్డీ (శాతం)	10.5
నెలవారీ వడ్డీ ఆదాయం (రూ)	10,573
నెలవారీ ఎస్ఐపీ చెల్లింపు (రూ.)	10,000
పదేళ్లలో ఎస్ఐపీ రాబడి/12 శాతంవడ్డీపై(రూ.)	23,00,387
చివరిగా చేతికందే మొత్తం (ఎన్‌సీడీ+ఎస్ఐపీ)	35,50,387
మొత్తంగా రాబడి (శాతంలో)	18.4

వ్యూహం ఎలా పని చేస్తుందంటే...

మొదట మంచి రేటింగ్ ఉన్న ఎన్‌సీడీలు లేదా మంచి విశ్వసనీయత ఉన్న కంపెనీలు జారీ చేసే ఎన్‌సీడీలను ఎంచుకోవాలి. అలాంటి ఎన్‌సీడీల్లో నెలవారీ ఆదాయం ఆప్షన్‌లో సొమ్ము ఇన్వెస్ట్ చేయాలి. ఉదాహరణకి అలాంటి బాండ్లలో 10 సంవత్సరాల కాలపరిమితికి రూ.12.5 లక్షలు ఇన్వెస్ట్ చేస్తే సగటున నెలవారీగా వచ్చే వడ్డీ 10.15 శాతం ఉంటుంది. ఆ వడ్డీ సొమ్ములో రూ.10 వేలు 12 శాతం రాబడి అందించే ఎస్ఐపీలో ఇన్వెస్ట్ చేయగలిగితే చివరికి రూ.23 లక్షలు చేతికి అందుతుంది. దానికి కంపెనీ ఎన్‌సీడీలో పెట్టిన అసలు రూ.12.5 లక్షలు కూడా కలిపితే అందే మొత్తం రూ.35.5 లక్షలు. అంటే ఈ వ్యూహం అనుసరించడం ద్వారా అందే రాబడి సగటున 18.4 శాతం ఉంటుందన్న మాట.

కొసమెరుపు : మంచి రేటింగ్ ఉన్న ఎన్‌సీడీలు అందుబాటులో ఉన్నప్పుడు మాత్రమే ఈ వ్యూహం ఫలిస్తుంది.

అయోమయ కూటమి

మేం పని చేయకుంటే మీరు కూటమి కట్టడం ఎందుకు!?

- స్వతంత్రంగా పోటీ చేయలేరా?
- మీపై మీకు విశ్వాసం లేదా!?
- ప్రతిపక్షాలపై ప్రధాని విసుర్లు

చెన్నై, జనవరి 13: "మోదీ మంచోడు కాదు. ప్రభుత్వం పని చేయడం లేదు. బీజేపీని ప్రజలు ఇష్టపడటం లేదు అని ప్రతిపక్షాల్లోని మా మిత్రులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అవకాశవాద పొత్తులు కుదుర్చుకుంటున్నారు. అది కూడా తమకు ఏమాత్రం పడని.. పరస్పరం ద్వేషించే పార్టీలతో. మోదీ మంచోడు కాకపోతే.. ప్రభుత్వం పని చేయకపోతే.. బీజేపీని ప్రజలు ఇష్టపడకపోతే.. అసలు మీరు కూటమి కట్టడం ఎందుకు!? మీమీద మీకు విశ్వాసం లేదా!?" అని ప్రతిపక్షాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశ్నించారు. ప్రతిపక్షాలు తమ సొంత రాజ్యాలను నిర్మించుకోవాలని భావిస్తుంటే.. తాము మాత్రం ప్రజలకు సాధికారత కల్పించాలని కృషి చేస్తున్నామని చెప్పారు. తమిళనాడులోని బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. "ఇది పనిచేసే ప్రభుత్వమని, పేదలు, యువత, రైతులు, మహిళలు బీజేపీతో గట్టి బంధం ఏర్పరచుకున్నారని వారికి తెలుసు. అందుకే తమ ఉనికిని కాపాడుకోవడానికి తాత్కాలిక పొత్తులు కుదుర్చుకుంటున్నారు" అని మండిపడ్డారు. బీజేపీ సాధించిన విజయాలు చాలామందికి అసూయ కలిగించాయని, అందుకే, ప్రతికూల రాజకీయాలు చేస్తున్నారని, అవకాశవాద పొత్తులు పెట్టుకుంటున్నారని, తనను తిడుతున్నారని చెప్పారు. బీజేపీపై భయంతో పొత్తుల కోసం పాకులాడుతున్నాయని విమర్శించారు. అయితే, భారత ప్రజలను తక్కువ అంచనా వేయొద్దని ఆ పార్టీలకు హితవు చెప్పారు. యూపీలో నిన్నటి వరకు కత్తులు దూసుకున్న ఎస్పీ-బీఎస్పీ పొత్తు పెట్టుకోవడాన్ని పరోక్షంగా విమర్శించారు. దేశంలోని ప్రతిపక్షాలు పూర్తి అయోమయ అవస్థలో ఉన్నాయని ఎద్దేవా చేశారు. "బీజేపీది అభివృద్ధి ఎజెండా. అటువైపు అవకాశవాద పొత్తులు, వంశవాద పార్టీలు ఉన్నాయి. ఆ పార్టీలు సొంత సామ్రాజ్యాలు స్థాపించుకోవాలని తహతహలాడుతున్నాయి. కానీ బీజేపీ ప్రజల సాధికారతను కోరుకుంటోంది. స్వార్థ ప్రయోజనాల కోసం పెట్టుకునే పొత్తులు తాత్కాలికమే" అన్నారు. కార్యకర్తలు తొలిసారి ఓటుహక్కు పొందిన వారిపై దృష్టి సారించాలని సూచించారు. వారికి అనువంశిక పార్టీలన్నా, శుష్క వాగ్దానాలన్నా, నాటకాలన్నా ఇష్టం లేదని, అభివృద్ధి, ప్రభుత్వ పనితీరు, పథకాల అమలుపైనే వారికి ఆసక్తి అని ప్రధాని స్పష్టం చేశారు.

నేనొక్కడినే గెలిపించలేను!

నిశ్చింతగా ఉండొద్దు.. కష్టపడండి: మోదీ

న్యూఢిల్లీ, జనవరి 13: ఎన్నికల్లో గెలవాలంటే పార్టీ కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాల్సిందేనని ప్రధాని మోదీ బీజేపీ శ్రేణులకు స్పష్టం చేశారు. పోలింగ్ బూత్‌లకు ఓటర్లను తరలించాలని, ఎన్నికల్లో గట్టిగా పోరాడాలని చెప్పారు. గెలుపు కోసం ఏ ఒక్క వ్యక్తి మీదో ఆధారపడరాదని తెలిపారు. "నేను చెప్పేదొక్కటే.. బీజేపీ అనే మహా సంస్థలో మోదీ ఒక చిన్న బిడ్డ మాత్రమే. పరీక్షా సమయంలో ఎవరికి వారు సొంతంగా నెగ్గాలి" అని మోదీ పేర్కొన్నారు. "వర్షాలు బాగా కురిశాయి. విత్తనాలు కూడా బాగున్నాయి. రైతు పొలాన్ని సరైన సమయంలో చక్కగా దున్నకపోతే.. ఉపయోగం ఏంటి? అచ్చం ఇలాగే ఎన్నికల క్షేత్రాన్ని కూడా సిద్ధం చేయాలి" అని కార్యకర్తలకు హితబోధ చేశారు. మహాకూటమి ఫలితం తెలంగాణలో చూశామని, ఘోర ఓటమి పాలైందని గుర్తుచేశారు.



దుబాయ్‌లో మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

శబరిమలలో సంప్రదాయమూ ముఖ్యమే!

- నా వైఖరి మార్చుకున్నా.. మహిళలకు హక్కులూ ఉండాలి
- ఇరు వాదనలూ న్యాయమైనవే
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ వెల్లడి

న్యూఢిల్లీ/దుబాయ్, జనవరి 13: శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళల ప్రవేశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తన వైఖరిని మార్చుకున్నారు. మహిళలకు ఏ ప్రదేశంలోనూ అనుమతి నిరాకరించరాదన్నదే తన అభిప్రాయమని గతంలో చెప్పిన రాహుల్.. ఇప్పుడు మాట మార్చారు. దుబాయ్ పర్యటనలో ఉన్న ఆయన అక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. మహిళల హక్కుల వాదనతో పాటు సంప్రదాయాలను పరిరక్షించాలన్న వాదనలోనూ న్యాయముందని చెప్పారు. కేరళ కాంగ్రెస్ నేతలతో మాట్లాడిన తర్వాత తన వైఖరిని మార్చుకున్నట్లు రాహుల్ స్పష్టంచేశారు. శబరిమల విషయంలో నిర్ణయం తీసుకునే బాధ్యతను కేరళ పీసీసీకే అప్పగించినట్లు వెల్లడించారు. "నేను ఇరువర్గాల వాదనలు విన్నా. గతంలో నేనున్న పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులు వేరు. కేరళ ప్రజల వాదనలు విన్న తర్వాత నాకు రెండు వాదనల్లోనూ న్యాయం ఉందనిపించింది" అని రాహుల్ అన్నారు. అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు గత సెప్టెంబరు 28న తీర్పు ఇచ్చిన సందర్భంలో రాహుల్ స్పందిస్తూ.. "నా వైఖరి పార్టీ వైఖరికి వ్యతిరేకంగా ఉంది. పురుషులు, మహిళలు సమానం. మహిళలు కోరుకున్న చోటుకు వెళ్లేందుకు అనుమతించాలి" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహంలో భాగంగానే రాహుల్ తన వైఖరిని మార్చుకున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇక రాఫెల్ ఒప్పందంపై పార్లమెంటులో చర్చ సందర్భంగా ఒక మహిళ(నిర్మలా సీతారామన్) వెనుక ప్రధాని మోదీ దాక్కున్నారని చేసిన విమర్శను రాహుల్ సమర్థించుకున్నారు. రక్షణమంత్రిపై స్త్రీ ద్వేషాన్ని చాటుకున్నారన్న విమర్శలను కొట్టిపారేశారు. నిర్మల స్థానంలో పురుషుడు ఉన్నా తాను అలాగే మాట్లాడి ఉండేవాడినని స్పష్టం చేశారు. రాఫెల్ డీల్‌పై ప్రధాని లోక్‌సభలో తన వైఖరిని సమర్థించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టు, ఆర్బీఐ, సీబీఐ, ఎన్నికల కమిషన్ వంటి వ్యవస్థలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థలపై ప్రజలకున్న నమ్మకాన్ని నిలబెడతామన్నారు.

సుల్తాన్‌తో రాహుల్ చర్చలు

రెండు రోజుల దుబాయ్ పర్యటనలో భాగంగా షార్జా రాజు షేక్ సుల్తాన్ బిన్ మహ్మద్ అల్ ఖాసిమితో భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం సహా పలు అంశాలపై చర్చించారు. సుల్తాన్‌ను కలుసుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని, ఇరుదేశాల మధ్య బంధాలను బలోపేతం చేసేందుకు ఆయనతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని రాహుల్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

కర్తార్‌పూర్‌ను కాపాడలేకపోయారు: మోదీ

మన్మోహన్ సమక్షంలో కాంగ్రెస్‌పై విమర్శ

న్యూఢిల్లీ, జనవరి 13: సిక్కు మత గురువు గురునానక్ పరమపదించిన కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్‌ను దేశ విభజన సమయంలో భారత్‌లోనే ఉంచేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయలేదని ప్రధాని మోదీ విమర్శించారు. సిక్కుల 10వ గురువు గురుగోవింద్‌సింగ్ 350వ జయంతి సందర్భంగా ఆయన స్మారకార్థం రూ.350 నాణేన్ని ఆదివారం తన నివాసంలో మోదీ విడుదల చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు. భారత సరిహద్దుకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పవిత్ర క్షేత్రానికి వెళ్లేందుకు తమ ప్రభుత్వం రోడ్డు మార్గాన్ని నిర్మిస్తోందని చెప్పారు. కర్తార్‌పూర్‌లో 18 ఏళ్లు నివసించిన గురునానక్ 1539 సెప్టెంబరు 22వ తేదీన అక్కడే మృతి చెందారు. మరోవైపు, 1984లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం ఢిల్లీలో జరిగిన మారణ హోమంలో ఆప్తులను కోల్పోయిన బాధితులకు న్యాయం అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ పేర్కొన్నారు. ఏప్రిల్ 15న గురునానక్ 55వ జయంతిని దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్, సిక్కు నాయకులు పాల్గొన్నారు.



రూ. 350 నాణేన్ని విడుదల చేస్తున్న ప్రధాని మోదీ, చిత్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్



కేంద్రమంత్రి రామ్‌విలాస్ పాసవాన్ మొదటి భార్య కుమార్తె ఆశా పాసవాన్ ఆదివారం లోక్ జనశక్తి పార్టీ కార్యాలయం సమీపంలో ఆందోళన చేపట్టారు. ఆర్జేడీ నేత రబ్రీదేవిపై చేసిన వ్యాఖ్యలకు రామ్‌విలాస్ పాసవాన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "మా నాన్న రబ్రీదేవీని అవమానించారు. మా అమ్మ కూడా నిరక్షరాస్యురాలే. అందుకే ఆమెను మా నాన్న వదిలేశారు. నాన్న తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి. లేదంటే ఎల్‌జేపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తా" అని హెచ్చరించారు.

80 సీట్లలోనూ కాంగ్రెస్ పోటీ

- ఫిబ్రవరిలోనే 13 'రాహుల్ ర్యాలీలు'
- ఈసారి రెట్టింపు సీట్లు సాధిస్తాం: ఆజాద్



లఖ్‌నవూ, జనవరి 13: కేంద్రంలో అధికారం దక్కించుకోవాలంటే ఉత్తరప్రదేశ్‌లో మళ్లీ పాగా వేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. అక్కడ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఆ రాష్ట్రంలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలుంటే.. ఈసారి అన్నిట్లోనూ బరిలోకి దిగాలని నిర్ణయించింది. ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఒక్క ఫిబ్రవరిలోనే 13 బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. యూపీలో 13 జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్‌లోనూ ఆరు లోక్‌సభ సీట్లున్నాయి. వచ్చే నెలలో ప్రతి జోన్‌లోనూ ఒక్కో ర్యాలీని కాంగ్రెస్ నిర్వహించనుంది. వీటికి రాహుల్ హాజరవుతారు. పశ్చిమ యూపీ నుంచి రాహుల్ ర్యాలీలు ప్రారంభం కానున్నాయి. తొలి దశలో హాపూర్, మొరాదాబాద్, షహరాన్‌పూర్‌ల్లో వీటిని నిర్వహిస్తారు. యూపీలో పొత్తు పెట్టుకున్న ఎస్పీ-బీఎస్పీ పార్టీలు కాంగ్రెస్‌ను పక్కనబెట్టిన విషయం తెలిసిందే. దాంతో, కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్, యూపీ ఇన్‌చార్జి రాజ్ బబ్బర్ ఆదివారం సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రచార ప్రణాళికను ఖరారు చేశారు. అనంతరం ఆజాద్ విలేకరులతో మాట్లాడారు. యూపీలో పోరు కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ఉండనుందన్నారు. మొత్తం 80 స్థానాల్లోనూ పోటీ చేస్తామని ప్రకటించారు. "బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పాటు చేసే మహా కూటమిలో మేమూ ఉండాలని భావించాం. కానీ, మాతో కలిసి రావడానికి కొందరు సిద్ధంగా లేరు. అయినా, మాకేమీ నష్టం లేదు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన సీట్ల (21) కంటే ఈసారి రెట్టింపు సాధిస్తాం" అని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

త్రిముఖంతో కమలానికి చెక్!

- అందుకే, పొత్తు నుంచి కాంగ్రెస్ ఔట్
- ఆ పార్టీ ఓట్లు బీజేపీకి మళ్లకుండా ప్లాన్
- ముస్లిం, అగ్రవర్ణ ఓట్ల చీలికతో కూటమికి లబ్ధి

లఖ్‌నవూ, జనవరి 13: ఉత్తరప్రదేశ్‌లో మహాకూటమి ఏర్పాటు చేయాలని భావించారు. కానీ, కాంగ్రెస్‌ను పక్కనబెట్టి.. ఎస్పీ-బీఎస్పీ మాత్రమే పొత్తు పెట్టుకున్నాయి. అదేమిటీ.. దళిత, ముస్లిం ఓట్లను కాంగ్రెస్ చీలుస్తుంది కదా! అది బీజేపీకి లాభం కదా!? మహా కూటమి అయితే, బీజేపీని నిలువరించే అవకాశం ఉంటుంది కదా!? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, యూపీలో ద్విముఖ పోటీ కంటే.. త్రిముఖ పోటీతోనే బీజేపీకి ఎక్కువ నష్టమనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. ఎస్పీ-బీఎస్పీ పొత్తులో కలవకుండా కాంగ్రెస్ ఒంటరిగా పోటీచేస్తే బీజేపీని సులభంగా ఓడించవచ్చని, కూటమి ఓట్ల కంటే బీజేపీ ఓట్లనే కాంగ్రెస్ ఎక్కువగా చీలుస్తుందని విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ మద్దతుదారులు ఎస్పీ, బీఎస్పీ అభ్యర్థులకు ఓట్లు వేయడానికి సుతరామూ ఇష్టపడరు. దీనికితోడు, రాయ్‌బరేలీ, అమేఠీలను ఎస్పీ-బీఎస్పీలు కాంగ్రెస్‌కే వదిలేశాయి. ఒకవేళ పొత్తు పెట్టుకున్నా మరో పది సీట్లు ఇవ్వవచ్చు. అంతకుమించి ఇచ్చే అవకాశమే లేదు. అప్పుడు, ఎస్పీ-బీఎస్పీలకు ఓట్లు వేయడం ఇష్టం లేని కాంగ్రెస్ మద్దతుదారులు బీజేపీ వైపు మొగ్గు చూపే అవకాశముంది. కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తే.. దాన్ని నిలువరించవచ్చు. ఇక, ఎస్పీ-బీఎస్పీ కూటమికి యాదవులు, దళితులు, ముస్లిములు అండగా నిలుస్తారు. బీజేపీ అగ్రవర్ణ ఓటు బ్యాంకును ఓడించడానికి ఇది ఉపకరిస్తుంది. తక్షణ తలాక్ కారణంగా యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం మహిళలు కూడా బీజేపీకి ఓటు వేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ఒంటరిగా బరిలో ఉంటే ముస్లిం, అగ్రవర్ణ ఓట్లను చీల్చే అవకాశం ఉంటుందని విశ్లేషిస్తున్నారు.

కూటమిని చిత్తుగా ఓడిస్తాం: ఆదిత్యనాథ్

లఖ్‌నవూ, జనవరి 13: ఉత్తరప్రదేశ్‌లో ఏర్పడిన ఎస్పీ-బీఎస్పీ కూటమి ప్రభావం రాష్ట్ర రాజకీయాలు, బీజేపీపై ఏమాత్రం ఉండదని ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ కూటమిని బీజేపీ చిత్తుగా ఓడించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. లఖ్‌నవూలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎస్పీ-బీఎస్పీ కూటమిపై విమర్శలు గుప్పించారు.

మహాకూటమిలోకి బీజేపీ నేతలు: అఖిలేశ్

లఖ్‌నవూ, జనవరి 13: ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ పొత్తుతో బీజేపీ నేతలు, కార్యకర్తల ఆశలు గల్లంతయ్యాయని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆదివారం ట్విటర్‌లో పేర్కొన్నారు. మోదీ మంత్రమైన 'మేరా బూత్ సబ్ సే మజ్‌బూత్(నా బూత్ పటిష్ఠమైనది)' కాస్తా.. 'మేరా బూత్ హువా ఛక్నాచూర్(నా బూత్ చీలిపోయింది)' గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ విషయాన్ని బీజేపీ కార్యకర్తలే స్వయంగా చెబుతున్నారని తెలిపారు. దీంతో మహాకూటమిలోకి బీజేపీ నేతలు వచ్చి చేరుతున్నారని అన్నారు. ఎస్పీ-బీఎస్పీ కూటమి 'అరాచక కూటమి' అంటూ కేంద్రమంత్రులు, బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

డిఫెన్స్ కాలేజీ వద్ద రెక్కీ

- నకిలీ ఎన్ఏఐ అధికారి అరెస్టు



నేరేడ్‌మెట్/హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పటిష్ఠ భద్రతతో కూడిన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో నకిలీ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఏఐ) అధికారిని పోలీసులు అరెస్టు చేశారు. నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ నరసింహస్వామి కథనం ప్రకారం.. శనివారం కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అక్కడే విధుల్లో ఉన్న ఆర్మీ జవాన్లు అదుపులోకి తీసుకున్నారు. రెక్కీ ఎందుకు నిర్వహిస్తున్నావని ప్రశ్నించడంతో వాయుసేనకు చెందిన పైలట్‌గా పరిచయం చేసుకున్నాడు. గట్టిగా ప్రశ్నించడంతో 'ఎన్ఐఏ అసిస్టెంట్ కమాండెంట్‌ని' అంటూ ఢిల్లీలోని ఎన్ఐఏ హెడ్‌క్వార్టర్స్ నుంచి జారీ చేసినట్లుగా ఓ ఐడీ కార్డును చూపించాడు. అది నకిలీది అని తేలడంతో అతడి వద్ద లభించిన ఆధార్‌కార్డును బట్టి పేరు వినోద్‌కుమార్‌రెడ్డి (25) అని, ఏపీలోని కడప జిల్లాకు చెందినవాడని నిర్ధారించుకున్నారు.

వలపు వలలో భారత జవాను

పాక్‌కు లీకైన కీలక సమాచారం, ఫొటోలు.. సైనికుడి అరెస్టు.. మరో 50 మందిపైనా నిఘా

జైపూర్, జనవరి 13: అందమైన అమ్మాయి. అంతకంటే అందంగా వయ్యారాలు పోతున్న తన ఫొటోలను ఫేస్‌బుక్‌లో పెట్టింది. ఆ ఫొటోలనే ఆయుధాలుగా చేసుకుని భారత జవాన్లను టార్గెట్ చేసింది. తన పేరు అనికా చోప్రా అనీ, మిలటరీ నర్సింగ్ గ్రూపునకు కెప్టెన్ అనీ పరిచయం చేసుకుంది. సుతిమెత్తగా మాట కలిపి.. సైన్యపు మర్మాలను తెలుసుకోసాగింది. ఆమెతో మాట్లాడుతున్న జవాను సోమ్‌వీర్ ప్రవర్తనపై అనుమానం వచ్చి ఉన్నతాధికారుల నిఘా పెట్టడంతో ఆమె అసలు గుట్టు బయటపడింది. ఆమె పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐకు చెందిన మహిళగా తేలింది. దాంతో ఉన్నతాధికారులు ఆ జవానును అరెస్టు చేశారు. ఆమె వలపు వలలో అతడొక్కడే కాకుండా సుమారు మరో 60 మంది వరకూ చిక్కుకున్నట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. రాజస్థాన్‌లోని ట్యాంక్ రెజిమెంటులో పనిచేస్తున్న సోమ్‌వీర్‌కు 2016లో అనికా చోప్రా అనే పేరుతో ఓ మహిళ ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. తనకు మిలటరీ అంటే ఇష్టమని, జవాన్లంటే గౌరవమని చెబుతూ అతడితో సన్నిహితంగా మెలగసాగింది. కొద్ది రోజులకు అతడి ప్రవర్తనపై తోటి జవాన్లకు అనుమానం రావడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దాంతో వారు సోమ్‌వీర్‌పై నిఘా పెట్టడంతో ఆ మహిళ అసలు రంగు బయటపడింది. వారిద్దరి మధ్య సాగిన సంభాషణలు విశ్లేషించిన అధికారులు.. మిలటరీకి సంబంధించిన విలువైన సమాచారాన్ని సోమ్‌వీర్ ఆ మహిళకు పంపినట్టు గుర్తించారు. దాంతో రాజస్థాన్ పోలీసులు అతడిని అరెస్టు చేసి, శనివారం కోర్టులో హాజరు పరచారు. కోర్టు అతడిని జనవరి 18 వరకూ కస్టడీకి అప్పగించింది. విచారణలో సోమ్‌వీర్ మరిన్ని విస్తుపోయే అంశాలు బయటపెట్టినట్టు విచారణాధికారులు తెలిపారు. ఆర్మీకి చెందిన సమాచారమే కాకుండా.. సైన్యానికి చెందిన ఆయుధాలు, ట్యాంకర్లు, వాహనాలు, రహస్య స్థావరాల ఫొటోలను కూడా ఆమెకు పంపినట్టు అధికారులు వెల్లడించారు. అంతే కాకుండా ఆ మహిళ విసిరిన వలపు వలలో వివిధ స్థావరాల్లోని భారత జవాన్లు పెద్ద సంఖ్యలో చిక్కుకున్నట్టు అధికారులు చెప్పారు. దాంతో అధికారులు అప్రమత్తమై వారిపై కూడా నిఘా ఉంచారు.



అనికా చోప్రా



సోమ్‌వీర్

సవరించిన ఓటరు జాబితాతోనే లోక్‌సభ ఎన్నికలు: సీఈసీ

న్యూఢిల్లీ, జనవరి 13: రానున్న లోక్‌సభ ఎన్నికలను ప్రస్తుతం సవరణలు జరుగుతున్న ఓటరు జాబితా ఆధారంగా నిర్వహిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సునీల్ అరోడా అన్నారు. ప్రతి ఓటరు తన ఓటుహక్కును వినియోగించుకునేలా చూడటమే ఎన్నికల సంఘం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికల ప్రధానాధికారు (సీఈవో)లతో ఈ నెల 11, 12వ తేదీల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరు సీఈవోలు వీలైనంత తొందరగా 1950 హెల్ప్‌లైన్‌ను తమ సిస్టమ్‌లో పొందుపరచుకోవాలని, ఎవరైనా ఓటరు.. జాబితాలో తన ఓటును గుర్తించేందుకు ఈ హెల్ప్‌లైన్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇక పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు ఈసీఐ కట్టుబడి ఉందని తెలిపారు. సీఈవోలు తమకు అవసరమైన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను ముందుగానే అంచనా వేసుకోవాలని సూచించారు.

మళ్లీ పెరిగిన పెట్రో ధరలు

న్యూఢిల్లీ, జనవరి 13: పెట్రోలు, డీజిల్ ధరలు ఆదివారం మరోమారు పెరిగాయి. ఢిల్లీలో లీటరు పెట్రోలు ధర 49 నుంచి 60 పైసల మేర పెరిగి రూ.69.75కు చేరగా, లీటరు డీజిల్ ధర 59-75 పైసల మేర పెరిగి రూ.63.69కి చేరింది. ఈనెల 7, 10,11,12 తేదీల్లోనూ వరుసగా ఇంధన ధరలు పెరిగిన సంగతి తెలిసిందే.



అంతర్జాతీయ పదవి.. వద్దన్న జస్టిస్ సిక్రీ

న్యూఢిల్లీ, జనవరి 13: సుప్రీం సీనియర్ జడ్జి జస్టిస్ ఏకే సిక్రీకి అంతర్జాతీయ పదవి విషయంలో ఆదివారం హైడ్రామా జరిగింది. సీబీఐ డైరెక్టర్ ఆలోక్ వర్మను తొలగించడంలో ప్రభుత్వానికి మద్దతుగా నిలబడిన జస్టిస్ సిక్రీని కామన్‌వెల్త్ సెక్రటేరియట్ ఆర్బిట్రల్ ట్రైబ్యునల్(సీఎస్ఏటీ) పదవికి సిఫారసు చేస్తున్నట్లు వచ్చిన వార్తలపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఈ పదవిని తిరస్కరిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఆలోక్ వర్మను కొనసాగించాలా, వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకునేందుకు సమావేశమైన అత్యున్నతస్థాయి త్రిసభ్యకమిటీలో అలోక్ వర్మకు మద్దతుగా ఖర్గే నిలవగా, జస్టిస్ సిక్రీ మాత్రం ప్రభుత్వ వాదనను సమర్థించారు. ఫలితంగా అలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తప్పించగలిగారు. కేంద్రానికి సానుకూలంగా వ్యవహరించినందుకు బహుమానంగానే జస్టిస్ సిక్రీని ఈ అత్యున్నత పదవికి సిఫారసు చేసినట్లుగా ఆరోపణలు రావడంతో ఈ పదవిని ఆయన కాదన్నట్లు తెలుస్తోంది.

రాజకీయాల్లోకి సుమలత?

- అమ్మ పోటీ మంచిదే: అభిషేక్ అంబరీష్



బెంగళూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి దక్షిణాది ప్రముఖ హీరోయిన్, శాండల్‌వుడ్ రెబల్‌స్టార్ దివంగత అంబరీష్ భార్య సుమలత రాజకీయ అరంగేట్రానికి ముహూర్తం కుదిరినట్లు తెలుస్తోంది. ఆదివారం మండ్యలో జరిగిన అంబరీష్ సంస్మరణ సభలో ఈ ప్రస్తావన హల్‌చల్ చేసింది. అంబరీష్ సొంత జిల్లా మండ్యలో జరిగిన సభకు పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన సినీ హీరో దర్శన్, నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్, సీనియర్ నటుడు దొడ్డణ్ణలు మాట్లాడుతూ, సుమలత ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రతిపాదించారు. ఈ సందర్భంగా కార్యకర్తల ఉత్సాహం అవధులు దాటింది. కాంగ్రెస్ టికెట్ ఇవ్వకుంటే జేడీఎస్‌లో ప్రయత్నించండి! సాధ్యం కాదంటే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయండంటూ నినాదాలు చేశారు. అంబరీష్ అభిమానులందరూ కలసి సుమలత విజయానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆమె కుమారుడు, సినీ హీరో అభిషేక్ సైతం అమ్మ ఎన్నికల్లో పోటీ చేయడం మంచిదేనన్నారు. ఇదే వేదికపై ఉన్న సుమలత ఈ ప్రతిపాదనలను వ్యతిరేకించకపోవడంతో ఆమె రాజకీయాల్లోకి ప్రవేశించడం దాదాపు ఖాయమైనట్టేననిపిస్తోంది.

కమల్ పార్టీలో చేరతా

- ఆయన సినిమాలు తొలి రోజే చూసేదాన్ని
- శృంగార తార ముద్ర దురదృష్టకరం: షకీలా



చెన్నై, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తన అభిమాన నటుడు కమల్‌హాసన్ ఆహ్వానిస్తే, ఆయన స్థాపించిన మక్కల్ నీది మయ్యం పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నానని సినీనటి షకీలా చెప్పారు. కుటుంబ పరిస్థితుల కారణంగానే సినిమాల్లో నటించానని, దురదృష్టవశాత్తూ శృంగారతారగా తనపై ముద్రపడిందని వాపోయారు. కమల్ నటించిన చిత్రాలను విడుదల రోజే చూసేదాన్నని చెప్పారు. కమల్‌హాసన్ రాజకీయ నాయకుడిగా మారడం సంతోషంగా ఉందని, అవకాశం ఇస్తే మక్కల్ నీదిమయ్యం పార్టీలో చేరతానని అన్నారు.

కరడుగట్టిన ఉగ్రవాది జీనతుల్ హతం

- కశ్మీర్ ఎన్‌కౌంటర్ ఉద్రిక్తం



శ్రీనగర్, జనవరి 13: కరడుగట్టిన ఉగ్రవాది, ఐఈడీ పేలుళ్ల మాస్టర్‌మైండ్, అల్ బద్ర్ ఉగ్రవాద సంస్థ ముఖ్య కమాండర్ జీనతుల్ ఇస్లామ్‌ను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో భద్రతా దళాలు, పోలీసుల సంయుక్త ఆపరేషన్ లో జీనతుల్ ఇస్లామ్ సహా షకీల్ అహ్మద్ దార్ అనే మరో ఉగ్రవాది హతమయ్యాడు. కాట్‌పుర ఏరియాలో ఉగ్రవాదుల ఉనికిపై సమాచారం అందడంతో భద్రతా దళాలు కార్డన్ సెర్చ్ నిర్వహించాయి. పరిసరాల్లో నక్కి ఉన్న ఇద్దరు ఉగ్రవాదులు పోలీసులపైకి కాల్పులకు తెగబడ్డారు. భద్రతా దళాల ఎదురు కాల్పుల్లో వారు మృతిచెందారు. సంఘటనా స్థలం నుంచి ఆయుధాలు, పేలుడు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఎన్‌కౌంటర్ జరుగుతున్నప్పుడు పలువురు పరిసర ప్రాంత ప్రజలు భద్రతాదళాలపై రాళ్లు రువ్వుతూ, ఉగ్రవాదుల పరారీకి మార్గం సుగమం చేసేందుకు యత్నించడం గమనార్హం.

హైదరాబాద్‌లోని నల్సార్ సహా దేశంలో ఉన్న సుప్రసిద్ధ న్యాయ కళాశాలల్లో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్ష కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్). 2008 నుంచి ఏటా ఉమ్మడిగా ఈ పరీక్షను సదరు కళాశాలల్లో ఒకటి రొటేషన్ పద్ధతిలో నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఒడిషాలోని కటక్‌లో ఉన్న నేషనల్ లా యూనివర్సిటీ 2019 క్లాట్ నిర్వహణ బాధ్యతలను చేపట్టింది.



CLAT -2019

పదును పెడితే 'లా' సీటు

ఈ ఏడాది మే 12న క్లాట్‌ను ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించాలని కన్సార్టియం నిర్ణయించింది బెంగళూరులోని నేషనల్ లా స్కూల్(ఎన్‌ఎల్‌ఎస్‌యుఐ)లో శాశ్వత సెక్రటేరియట్‌ను ఏర్పాటు చేశారు. క్లాట్ కన్వీనర్‌గా ఒడిషాలోని ఎన్‌ఎల్‌యు వ్యవహరిస్తుంది.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్షలో అడిగే అంశాల విషయానికి వస్తే....

- **కాంప్రహెన్షన్ సహా ఇంగ్లీష్ :** కాంప్రహెన్షన్ పాసేజ్‌లు, గ్రామర్ ఆధారంగా ఇంగ్లీష్‌లో విద్యార్థికి ఉన్న సామర్థ్యాన్ని తెలుస్తారు. కాంప్రహెన్షన్ విభాగంలో ప్యాసేజ్ ప్రధానాంశంపై అభ్యర్థికి ఉన్న అవగాహన, అందులో ఉపయోగించిన పదాలకు అర్థం ఏ మేరకు తెలుసు అన్నది అంచనా వేస్తారు. గ్రామర్ విషయంలో వాక్యంలో ఉన్న తప్పులు, సరిపోయే పదాలతో ఖాళీల పూరింపు తదితరాలు ఉంటాయి. వ్యాకరణంపై దృష్టికి తోడు ఇంగ్లీష్‌లో వివిధ అంశాలను చదివే విద్యార్థులకు ఈ విభాగం పెద్ద విషయం కాదు. అయితే రీడింగ్ హ్యాబిట్ తగ్గుతున్న ఈ రోజుల్లో విద్యార్థులు కొద్దిపాటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆ అవరోధాన్ని అధిగమించగలిగితే ఎలాంటి కష్టాలు ఉండవు.
- **జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్:** జనరల్ అవేర్‌నెస్‌కు తోడు జనరల్ నాలెడ్జ్ అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై అభ్యర్థికి ఉండే అవగాహనకు సంబంధించిన పరీక్ష ఇది. చుట్టూ జరుగుతున్న పరిణామాలపై కనీస అవగాహన ఉన్న విద్యార్థులకు ఈ విభాగం సులువుగా ఉంటుంది. హిస్టరీ, జనరల్ సైన్స్, పుస్తకాలు - రచయితలు వంటి అంశాలు తెలిసి ఉండాలి. దినపత్రికల్లో వచ్చే వార్తల ఆధారంగా కరెంట్ అఫైర్స్ ప్రశ్నలు అడుగుతారు. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి పలు యాప్స్, వెబ్‌సైట్స్ ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అవన్నీ వివిధ విషయాలను క్రోడీకరించి పద్ధతిగా ఇస్తూ ఉంటాయి. వాటిని ఫాలో అయినా ఈ విభాగంలో అడిగే ప్రశ్నలను సులువుగా ఎదుర్కోవచ్చు.
- **మేథమెటిక్స్:** టెన్త్ లోపు ఎలిమెంటరీ మేథ్స్‌పై ప్రశ్నలు ఈ విభాగంలో ఉంటాయి. మేథ్స్‌లోని ప్రాథమిక నైపుణ్యాలను పరీక్షించేలా ఈ విభాగం ఉంటుంది. ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోలు, టైమ్, వర్క్ అండ్ డిస్టెన్స్, సింపుల్ అండ్ కాంపౌండ్ ఇంట్రస్ట్, యావరేజెస్ వంటి టాపిక్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. మిడిల్ నుంచి హైస్కూల్ వరకు ఉండే మేథ్స్‌పై పట్టు ఉంటే చాలు. కాన్సెప్టులను అర్థం చేసుకుని సొల్యూషన్స్‌కు షార్ట్‌కట్స్ తెలుసుకోగలిగితే సరిపోతుంది.
- **లీగల్ ఆప్టిట్యూడ్:** విద్యార్థి లా స్కూల్‌లో చేరాలని భావిస్తున్నందున న్యాయపరంగా తార్కికత ఏపాటిదో టెస్ట్ చేయాల్సి ఉంటుంది. పరిశోధించే తత్వం, ప్రాబ్లెమ్ సాల్వింగ్ ఎబిలిటీని ఈ విభాగంలో పరీక్షిస్తారు. న్యాయ సంబంధ అంశాలు కొన్నింటిని ఇస్తారు. దాన్ని అనువర్తించే విధంగా కొన్ని ఫ్యాక్ట్స్ కూడా ఇస్తారు. కొన్ని ప్రతిపాదిత అంశాలు కరెక్ట్ కాగా, మరికొన్ని కావు. తార్కిక పరిజ్ఞానంతో వాటి నిగ్గు తేల్చాలి. ఇక్కడ అనలిటికల్ రీజనింగ్ సామర్థ్యం తప్పనిసరి. డిడక్టివ్ రీజనింగ్ స్కిల్స్ అంటే ప్రత్యామ్నాయాల నుంచి ఒకొక్కటిగా తొలగించుకోగలిగే నైపుణ్యాలు అవసరం. ఆదిలో పేర్కొన్నట్టు లీగల్ సంబంధ విషయం అడిగి అందుకు నాలుగు ప్రత్యామ్నాయాలు ఇస్తారు ఉద్వేగాలను పక్కనపెట్టి, న్యాయసమ్మతంగా అనిపించే సమాధానాన్ని గుర్తించగలగాలి. న్యాయపరంగా సమకాలీన అంశాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉన్న విద్యార్థులకు ఈ టాపిక్ వెసులుబాటుగా ఉంటుంది.
- **లాజికల్ రీజనింగ్:** వివిధ ప్యాటర్న్‌లు, వాటి మధ్య ఉండే లాజికల్ లింక్, లాజిక్‌కు అందనివి గుర్తించడమే ఇక్కడ పరీక్ష. సిలోగిజమ్స్, లాజికల్ సీక్వెన్సెస్, అనాలజీస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. అయితే విజువల్ రీజనింగ్‌ను ఇక్కడ టెస్ట్ చేయరు. ప్రాథమిక స్థాయి నుంచి జరిగే ఒలింపియాడ్ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు ఈ విభాగం చాలా తేలికగా అనిపిస్తుంది. అయితే ఈ విభాగంలో మంచి స్కోర్ పొందాలంటే మాత్రం నిరంతరంగా ప్రాక్టీస్ తప్పనిసరి. ప్రాబ్లమ్ సాల్వింగ్ టెక్నిక్స్ సైతం విద్యార్థికి తెలిసి ఉండాలి.

యూజీ కోర్సుకు పరీక్ష

సబ్జెక్టు	మార్కులు
కాంప్రహెన్షన్ సహా ఇంగ్లీష్	40
జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్	50
ఎలిమెంటరీ మేథమెటిక్స్(న్యూమరికల్ ఎబిలిటీ)	20
లీగల్ ఆప్టిట్యూడ్	50
లాజికల్ రీజనింగ్	40
మొత్తం మార్కులు	**200**

పీజీ ప్రోగ్రామ్

దీనికి ఉద్దేశించి క్లాట్ 150 మార్కులకు ఉంటుంది. రెండు గంటల కాలవ్యవధి కలిగిన ఈ పరీక్షలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు 100 ఉంటాయి. ఒక్కోటి 25 మార్కులకు రెండు వ్యాస రూప ప్రశ్నలు ఉంటాయి. కాన్‌స్టిట్యూషనల్ లా 40 మార్కులకు, ఇతర లా సబ్జెక్టులు(కాంటాక్ట్‌లు, టార్ట్స్, క్రిమినల్ లా, ఇంటర్నేషనల్ లా, ఐపిఆర్, జురిస్‌ప్రుడెన్స్) 60 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి.

వ్యూహాలు

- క్లాట్‌కు గడువు రమారమి నాలుగు నెలలు ఉంది. ఒక ప్రణాళిక ప్రకారం ప్రిపేరైతే ప్రయోజనకరంగా ఉంటుంది.
- మాక్ టెస్ట్‌లు రాస్తే బలాలు, బలహీనతలు బైటపడతాయి. వాటిని చక్కగా విశ్లేషించుకుని వీక్‌గా ఉన్న ఏరియాపై దృష్టిసారించవచ్చు.
- ఇంగిష్ ఒకాబులరీలో పట్టు సాధించేందుకు షార్ట్‌కట్స్ ఏవీ లేవు. లోతుగా చదవడం ఒక్కటే ప్రత్యామ్నాయం. ఒకాబులరీ బిల్డింగ్ పుస్తకాలు కూడా ఈ విషయంలో ఉపయోగపడతాయి.
- మార్కెట్‌లో పేరున్న ఆంగ్ల దినపత్రికలు, పుస్తకాలు చదివితే ప్రయోజనాలు ఉంటాయి. ఇంగ్లీష్‌పై పట్టుకుతోడు కరెంట్ అఫైర్స్‌కు సంబంధించిన పరిజ్ఞానాన్ని పొందవచ్చు. వివిధ పదాలు, వాక్యాలపై అవగాహన కలుగుతుంది. న్యాయవాదిగా మున్ముందు కెరీర్‌లోనూ ఈ అనుభవం ఉపయోగపడుతుంది.
- మధ్య మధ్య విరామం ఇచ్చుకుంటూ రెగ్యులర్‌గా మాక్ టెస్టులకు హాజరైతే వేగం పెరుగుతుంది. అంతిమంగా అది పరీక్ష రోజున ఉపకరిస్తుంది.
- మేథ్స్‌లో ప్రశ్నలు ప్రాథమిక స్థాయిలో ఉంటాయి. బేసిక్ అర్థమెటిక్ సామర్థ్యాన్ని పెంచుకుంటే చాలా మంచిది. అది ప్రొఫెషనల్ లైఫ్‌కూ ఉపయోగపడుతుంది.
- లా చదవాలని భావించే విద్యార్థులు రాజ్యాంగం, చట్ట సంబంధ అంశాలపై ఇప్పట్నుంచీ అవగాహన పెంచుకుంటే మంచిది. రాజకీయ, ప్రపంచ పరిణామాలపై ఆసక్తిని బలంగా పెంచుకుంటే లా స్టడీ అలాగే ప్రొఫెషన్‌లో రాణించేందుకు అది బాగా తోడ్పడుతుంది.
- నల్సార్ వంటి సంస్థల్లో లా చేసే విద్యార్థులకు మంచి వేతనాలతో ఉద్యోగాలు లభిస్తాయి. వీటిపై అంతంత మాత్రంగా అవగాహన ఉంటే సరిపోదు. లా ప్రొఫెషన్‌కు సంబంధించిన అన్ని కోణాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. కమ్యూనికేషన్, రీజనింగ్ నైపుణ్యాలను బలంగా పెంచుకోవాలి. తద్వారా లీగల్ ప్రొఫెషన్‌లో అత్యున్నత స్థానాన్ని అందుకునేందుకు సన్నద్ధం కావాలి.
- ఇలాంటి టెస్టులకు, బోర్డు ఎగ్జామ్స్ మధ్య తేడా ఉంటుంది. కాంపిటేటివ్ పరీక్షలు రాసే విద్యార్థులు తరుచూ తమ సామర్థ్యాన్ని విశ్లేషించుకోవాలి. తప్పులను సరిదిద్దుకుని స్కోర్ పెంచుకునే ప్రయత్నం చేయాలి.
- అన్నింటి కంటే మించి ఏదైనా సాధించగలమన్న బలమైన సంకల్పం ఉండాలి. అది ఏ పరీక్షకైనా, మరేపనికైనా చాలా అవసరం. క్లాట్ సహా ఎక్కడైనా విజయం సాధించేందుకు సంకల్పబలం బాగా ఉపయోగపడుతుంది.

దేశవ్యాప్తంగా 21 న్యాయ విశ్వవిద్యాలయాల్లో 2019-20 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)-2019 ప్రకటన వెలువడింది.

కోర్సులు:
- అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ - అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా డిగ్రీ
  అర్హత: ఇంటర్‌లో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత. 2019 మార్చి/ఏప్రిల్‌లో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- పీజీ ప్రోగ్రామ్ - ఏడాది కాలవ్యవధి కలిగి ఎల్‌ఎల్‌ఎం డిగ్రీ
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బి డిగ్రీ ఉత్తీర్ణత. 2019 ఏప్రిల్/మేలో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక:** ఆఫ్‌లైన్ రాత పరీక్ష(క్లాట్)ద్వారా
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
- **చివరి తేదీ:** మార్చి 31
- **క్లాట్ పరీక్ష తేదీ:** మే 12
- **వెబ్‌సైట్:** https://clatconsortiumofnlu.ac.in/
- **రిజిస్ట్రేషన్ సంబంధ ఫిర్యాదులకు :** clat2019@nls.ac.in clatconsortiumofnlu.ac.in +91 97415 21069, 94825 67257 (Bengaluru) +91 84807 18979 (Odisha) 10:00 am to 05:00 pm on all working days

జాబ్ కార్నర్

నవోదయ విద్యాలయ సమితి

నవోదయ విద్యాలయ సమితి - దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రాంతీయ కార్యాలయాలు & జవహర్ నవోదయ విద్యాలయాల్లో కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 251
ఉద్యోగాలు: ప్రిన్సిపాల్ 25, అసిస్టెంట్ కమిషనర్ (అడ్మినిస్ట్రేషన్) 3, అసిస్టెంట్ 2, కంప్యూటర్ ఆపరేటర్ 3, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ) 218
అర్హత: ఉద్యోగ నిబంధనల ప్రకారం పీజీ/ బిఈడీ/ డిగ్రీ/ డిప్లొమా/ కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. నిర్దేశించిన మేరకు అనుభవం తప్పనిసరి.
వయసు: 18 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: ప్రిన్సిపాల్, అసిస్టెంట్ కమిషనర్ ఉద్యోగాలకు రూ.1500 పీజీటీలకు రూ.1000, మిగిలిన ఉద్యోగాలకు రూ.800
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: జనవరి 15 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 14
వెబ్‌సైట్: www.navodaya.gov.in

టీచింగ్ & నాన్ టీచింగ్ సిబ్బంది

హైదరాబాద్, సనత్‌నగర్‌లోని ఈఎస్‌ఐసీ మెడికల్ కాలేజ్- వివిధ ఆసుపత్రుల్లో ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ & నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 86
ఉద్యోగాలు: ఫ్యాకల్టీ(ప్రొఫెసర్/ అసోసియేట్ ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్) 25, సీనియర్ రెసిడెంట్ 40, జూనియర్ రెసిడెంట్ 4, సూపర్ స్పెషాలిటీ స్పెషలిస్టులు 9, పార్ట్ టైమ్/ ఫుల్ టైం స్పెషలిస్టులు 8
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ తేదీలు: జనవరి 22 నుంచి ఫిబ్రవరి 19 వరకు
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 18
వెబ్‌సైట్: www.esicmchyd.ac.in

యూపీఎస్సీ

UPSC

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)- నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాల భర్తీకి ఉద్దేశించిన 'యూపీఎస్సీ - ఎన్‌డీఏ & ఎన్‌ఏ (1) ఎగ్జామ్‌కు ప్రకటన విడుదల చేసింది. ఖాళీలు: 392
ఖాళీల వివరాలు: 143వ ఎన్‌డీఏ బ్యాచ్‌కు కేటాయించిన ఖాళీలు 342 (ఆర్మీ 208, నేవీ 42, ఎయిర్ ఫోర్స్ 92), 105వ ఇండియన్ నేవల్ అకాడమీ కోర్సుకు కేటాయించిన ఖాళీలు 50
అర్హత: పన్నెండో తరగతి/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నేవల్ విభాగాలకు మాత్రం మేథమెటిక్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి. నిర్దేశించిన శారీరక ప్రమాణాలు తప్పనిసరి
వయసు: 2000 జూలై 2 నుంచి 2003 జూలై 1 మధ్య జన్మించి ఉండాలి. అభ్యర్థులు అవివాహితులై ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, జనరల్ ఎబిలిటీ టెస్ట్, ఎస్ఎస్‌బి టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
రాత పరీక్ష జరుగు తేదీ: ఏప్రిల్ 21
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
దరఖాస్తు ఫీజు: రూ.100
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 4
వెబ్‌సైట్: www.upsconline. nic.in

ఆఫీసు సిబ్బంది

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీసీఆర్‌డీఏ)- ప్లానింగ్ & ఎల్‌ఎస్‌ఈ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఖాళీలు: 20 **ఒప్పంద వ్యవధి:** ఏడాది
ఉద్యోగాలు: అసోసియేట్ ప్లానర్ 2, సీనియర్ ఆర్కిటెక్ట్ 5, ఆర్కిటెక్ట్ 5, సీనియర్ అర్బన్ డిజైనర్ 2, అర్బన్ డిజైనర్ 2, సీనియర్ ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్ట్ (ప్లానింగ్) 2, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్ట్ (ప్లానింగ్) 2
అర్హత: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బిఈ లేదా మాస్టర్స్ పూర్తిచేసి ఉండాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 23
వెబ్‌సైట్: www.crda.ap.gov.in

మేనేజ్‌మెంట్ ట్రైనీలు

విశాఖపట్నంలోని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్- గేట్ 2019 స్కోరు ద్వారా మేనేజ్‌మెంట్ ట్రైనీల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం ఖాళీలు: 77
విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రికల్ 20, మెకానికల్ 31, మెటలర్జీ 26
అర్హత: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో బిఈ/ బీటెక్ పూర్తిచేసి ఉండాలి.
వయసు: 2018 డిసెంబరు 1 నాటికి 27 ఏళ్లు మించ కూడదు.
ఎంపిక: గేట్ 2019 స్కోరు, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా. **ట్రైనింగ్ వ్యవధి:** ఏడాది
దరఖాస్తు ఫీజు: రూ.500 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 20
వెబ్‌సైట్: www.vizagsteel.com

స్పెషలిస్ట్ ఆఫీసర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)- స్పెషలిస్ట్ ఆఫీసర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఖాళీలు: 31
ఉద్యోగాలు: డిప్యూటీ మేనేజర్ (స్టాటిస్టీషియన్) 2, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్- అగ్రికల్చర్/ ఇంటర్నేషనల్ బ్యాంకింగ్/ రిటైల్ బ్యాంకింగ్/ కార్పొరేట్ బ్యాంకింగ్ 3, మేనేజర్- అగ్రికల్చర్/ ఇంటర్నేషనల్ బ్యాంకింగ్/ రిటైల్ బ్యాంకింగ్/ కార్పొరేట్ బ్యాంకింగ్ 3, మేనేజర్(బిజినెస్ అనలిస్ట్/ కస్టమర్ సర్వీస్ అనలిస్ట్) 2, మేనేజర్(ఆన్‌లైన్ ఫుల్‌ఫిల్‌మెంట్/ ఇంటిగ్రేషన్ అండ్ జర్నీస్/ సూపర్ స్టోర్ ఫుల్‌ఫిల్‌మెంట్) 3, మేనేజర్ (డిజిటల్ మార్కెటింగ్) 4, లీగల్ హెడ్ 1, డీజీఎం (ఎన్‌సీఎల్‌టీ) 1, డీజీఎం(లా) 1, ఎగ్జిక్యూటివ్ (క్రెడిట్ మానిటరింగ్) 10, హెడ్ (ప్రొడక్ట్ ఇన్వెస్ట్ అండ్ రీసెర్చ్) 1
అర్హత: పీజీ/ బిఈ/ సీఏ ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి. **ఎంపిక:** షార్ట్ లిస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.600 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.100)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 31
వెబ్‌సైట్: www.sbi.co.in/careers

వివరాలు ఇవిగో

వరల్డ్ హిస్టరీని ఎక్కడ చదవొచ్చు?

☞ నేను బిఏ ఫైనలియర్ చదువుతున్నాను. విదేశాల్లో వరల్డ్ హిస్టరీకి సంబంధించిన సబ్జెక్టులతో పీజీ చేయాలని ఆలోచన ఉంది. ప్రొఫైల్ ఎలా తయారు చేసుకోవాలి? అలాగే దీనికి ప్రభుత్వం నుంచి ఏమైనా సహాయం అందుతుందా తెలుపగలరు?

- మాధవి, జనగాం

- అంతర్జాతీయ సంబంధాలు, అంతర్జాతీయ భద్రత, శాంతి, నిరాయుధీకరణ, పొలిటికల్, కాంటెంపరరీ చరిత్ర, వరల్డ్ హిస్టరీ, కల్చర్, డెవలప్‌మెంట్ అండ్ హ్యూమన్ రైట్స్, శరణార్థుల రక్షణ - శరణార్థులపై అధ్యయనం తదితర కోర్సులను మీరు చదవొచ్చు. ప్రపంచంలోని అత్యుత్తమ యూనివర్సిటీల్లో చదవడానికి అవకాశం దొరికి, ఆర్థిక స్తోమత లేనివారికి కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ స్కాలర్‌షిప్‌లను అందిస్తుంది. వివరాల కోసం ఆ శాఖ వెబ్‌సైట్ (http://mhrd.gov.in/scholarships)చూడొచ్చు.

మ్యూజిక్ టీచర్‌గా స్థిరపడాలి...

☞ నాకు మ్యూజిక్ అంటే చాలా ఇష్టం. 20 సంవత్సరాలకు పైగా ప్రైవేటు ఉద్యోగం చేశాను. ఆ సమయంలోనే కర్ణాటక క్లాసికల్ వోకల్ నేర్చుకున్నాను. తర్వాత మ్యూజిక్ టీచర్‌గా స్థిరపడ్డాను. అమెరికా లేదా యూరప్‌లో మ్యూజిక్ టీచర్‌గా స్థిరపడే అవకాశం నాకు ఉందా?

- తనీష్, హైదరాబాద్

- మీరు చెబుతున్నదానిని బట్టి మీకు 45 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉండే అవకాశం ఉంది. ఈ వయస్సు వారికి విదేశాల్లో ఉద్యోగం దొరకడం చాలా కష్టం. అయితే మీరు ఏదైనా సంస్థలో పనిచేస్తున్నట్లు అయితే, వారికి మీరు వెళ్లాలనుకుంటున్న దేశంలో బ్రాంచ్‌లకు బదిలపై మాత్రం వెళ్లవచ్చు. ఇదికాకుండా ఇంకొక అవకాశం కూడా ఉంది. మీకు మంచి ఆర్థిక స్తోమత ఉండి మీరు వెళ్లాలనుకున్న దేశానికి చెందిన పౌరుడిని భాగస్వామిగా చేసుకుని మ్యూజిక్ స్కూల్‌ను ప్రారంభించవచ్చు. లేదా మ్యూజిక్ స్కూల్‌లో విద్యను అభ్యసించడం కోసం కూడా మీరు విదేశాలకు వెళ్లవచ్చు, అక్కడ పార్ట్‌టైమ్ ఉద్యోగం కూడా చేయవచ్చు.

• గోవర్ధనం కిరణ్‌కుమార్

చిరునామా: వివరాలు ఇవిగో, కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్వినీ ఎన్‌క్లేవ్, హుడా హైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033



ప్రైజ్‌మనీ




చాంపియన్ బెంగళూరు

ఫైనల్లో ముంబైపై గెలుపు ● ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

బెంగళూరు: కిడాంబి శ్రీకాంత్ సారథ్యంలోని బెంగళూరు రాప్టర్స్ పీబీఎల్ నాలుగో సీజన్ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో బెంగళూరు 4-3 స్కోరుతో నిరుటి రన్నరప్ ముంబై రాకెట్స్‌పై గెలిచింది. కీలకమైన ఐదో, ఆఖరి మ్యాచ్ పురుషుల డబుల్స్‌లో బెంగళూరు జోడీ అహ్‌సాన్/సెతియవాన్ 15-13, 15-10 స్కోరుతో ముంబై ద్వయం జంగ్/లీయాంగ్‌ను చిత్తు చేసి బెంగళూరును తొలిసారి విజేతగా నిలిపింది. అంతకుముందు పోటాపోటీగా సాగిన పురుషుల రెండో సింగిల్స్‌లో ముంబై ఆటగాడు సమీర్ వర్మ 7-15, 15-12, 15-3తో సాయి ప్రణీత్‌పై గెలిచి జట్టును టైటిల్ రేస్‌లోకి తెచ్చాడు. కానీ పురుషుల డబుల్స్‌లో ఓడడంతో ఆ జట్టుకు మరోసారి టైటిల్ అందని ద్రాక్షే అయింది. మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌తో ఫైనల్ పోరు ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌ను ముంబై ట్రంప్‌గా ఎంచుకోగా కిమ్/బెర్నాడెత్ జోడీ 15-8, 15-14తో మార్కస్ ఎలిస్/స్మిత్‌పై గెలిచి ఆ జట్టుకు 2-0తో శుభారంభం అందించింది. అయితే పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ 15-7, 15-10తో ఆంటొన్‌సెన్‌పై నెగ్గడంతో ప్రత్యర్థి ఆధిక్యాన్ని బెంగళూరు1-2కి తగ్గించింది. తదుపరి మహిళల సింగిల్స్‌ను బెంగళూరు ట్రంప్‌గా ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో ఉ థీ ట్రాంగ్ 15-8, 15-9తో ముంబై షట్లర్ శ్రియాన్సీ పర్దేశిని చిత్తుచేసింది. ఫలితంగా బెంగళూరు 3-2తో ముందంజ వేసింది. ఆపై సమీర్ గెలుపొందినా, డబుల్స్ జోడీ ఓడడంతో ముంబైకు నిరాశ తప్పలేదు.

కివీస్ టూర్‌కు శుభ్‌మన్


మయాంక్‌కు గాయం


శుభ్‌మన్ గిల్

న్యూఢిల్లీ: యువ సంచలనం శుభ్‌మన్ గిల్‌కు సెలెక్టర్ల నుంచి పిలుపు అందింది. న్యూజిలాండ్‌తో జరిగే వన్డే, టీ20 సిరీస్ కోసం గిల్‌ను జట్టులోకి తీసుకున్నారు. కాగా, ఆస్ట్రేలియాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో సస్పెన్షన్‌కు గురైన హార్దిక్ పాండ్యా స్థానాన్ని ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌తో భర్తీ చేశారు. ఆసీస్‌తో జరిగే రెండో వన్డే కంటే ముందే శంకర్ జట్టులో చేరనున్నాడని బీసీసీఐ ప్రకటించింది. ఓ టీవీ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో హార్దిక్, కేఎల్ రాహుల్‌లపై వేటుపడిన సంగతి తెలిసిందే. గిల్ ఎంపిక కివీస్ సిరీస్‌కు మాత్రమేనని స్పష్టం చేసింది. తొలుత రాహుల్ స్థానంలో మయాంక్ అగర్వాల్‌ను ఎంపిక చేశారు. కానీ అతడు గాయంతో ఇబ్బంది పడుతుండడంతో గిల్‌ను తీసుకున్నారు.

పదేళ్లకే చాంపియన్

● ఖేలో యూత్ గేమ్స్‌లో షూటర్ అభినవ్ షా సంచలనం



పుణె: 'పిట్ట కొంచెం.. కూత ఘనం' అన్నట్టు ఆ చిన్నారి పదేళ్ల వయసులోనే జాతీయ చాంపియన్‌గా నిలిచి సంచలనం సృష్టించాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన పదేళ్ల అభినవ్ షా ఖేలో యూత్ గేమ్స్ షూటింగ్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టి ఔరా అనిపించాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మెహులీ ఘోష్‌తో కలిసి అభినవ్ స్వర్ణం గెలిచాడు. ప్రస్తుతం ఆరో తరగతి చదువుతున్న అభినవ్... మాజీ షూటర్ జైదీప్ కర్మాకర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాడు. జైదీప్ 2012 ఒలింపిక్స్‌లో త్రుటిలో పతకాన్ని కోల్పోయాడు.

మేఘనా రెడ్డి, శివరామకృష్ణకు పతకాలు


మేఘన
దీప్తి
శివరామకృష్ణ

హైదరాబాద్/కడప (స్పోర్ట్స్): ఖేలో యూత్ గేమ్స్‌లో తెలుగు క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. తెలంగాణకు చెందిన మేఘనా రెడ్డి రిథమిక్ జిమ్నాస్టిక్స్ వ్యక్తిగత హూప్ విభాగంలో స్వర్ణంతో పాటు వ్యక్తిగత బాల్ కేటగిరిలో రజతం దక్కించుకుంది. కడప స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి అయిన శివ రామకృష్ణ యాదవ్ అండర్-21 విభాగం 81 కిలోల వెయిట్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. అండర్-17 81 కిలోల విభాగంలో శివరామకృష్ణ రజతం గెలిచాడు. ఇక, అండర్-17 బాలికల వెయిట్‌లిఫ్టింగ్‌లో ఏపీకి చెందిన ధాత్రి 71 కిలోల విభాగంలో స్వర్ణం నెగ్గగా.. 76 కిలోల విభాగంలో చుక్కా శ్రీలక్ష్మి కాంస్యం అందుకుంది. అండర్-17 బాలికల 200 మీటర్ల రేసులో తెలంగాణ అథ్లెట్ దీప్తి రజత పతకం సాధించింది.

పోరాడుతున్న పాకిస్థాన్

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టులో పాకిస్థాన్ విజయం కోసం పోరాడుతోంది. 381 పరుగుల భారీలక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ ఆదివారం ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 153 రన్స్ చేసింది. అసద్ షఫీక్ (48), బాబర్ ఆజమ్ (17) క్రీజులో ఉన్నారు. స్టెయిన్‌కు రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 303 రన్స్‌కు ఆలౌటైంది. డికాక్ (129) సెంచరీ చేశాడు.



ఫుట్‌బాల్ ఒలింపియన్ జుల్ఫికరుద్దీన్ ఇకలేరు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): హైదరాబాద్ ఫుట్‌బాల్ దిగ్గజం, ఒలింపియన్ మహమ్మద్ జుల్ఫికరుద్దీన్ (83) అనారోగ్యంతో ఆదివారం కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సికింద్రాబాద్‌లోని పద్మారావు నగర్‌కు చెందిన జుల్ఫికర్ 17 ఏళ్ల వయసులో జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో నాలుగోస్థానంలో నిలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నారు. కానీ, ఆ విశ్వక్రీడల్లో ఆయన ఒక్క మ్యాచ్‌లో కూడా బరిలోకి దిగలేదు. అయితే, 1959లో సింగపూర్‌లో జరిగిన మెడెకా కప్‌తో జుల్ఫికర్ తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడారు. భారత్ తరపున మొత్తం మూడు మ్యాచ్‌ల్లో పాల్గొన్న ఆయన ఓ గోల్ చేశారు. టోక్యో ఆసియా క్రీడల్లోనూ భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన ఆయన.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్‌గా మూడు సార్లు సంతోష్ ట్రోఫీని సాధించారు. జుల్ఫికర్ మృతికి తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం సంతాపం తెలిపింది. కాగా, భారత ఫుట్‌బాల్‌కు జుల్ఫికర్ చేసిన సేవ ఎన్నటికీ మరువలేనిదని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్ కొనియాడారు.

నేటి నుంచి ప్రొ రెజ్లింగ్ లీగ్

పంచకుల (హరియాణా): ప్రొ.రెజ్లింగ్ లీగ్ నాలుగో సీజన్‌కు సోమవారం తెరలేవనుంది. మొత్తం ఆరు జట్లు తలపడే ఈ లీగ్ ఈనెల 31వరకూ జరగనుంది. సోమవారం సాయంత్రం జరిగే పోరులో వరల్డ్ నెంబర్ వన్ బజరంగ్ పూనియా సారథ్యంలోని డిఫెండింగ్ చాంపియన్ ఎన్‌సీఆర్ పంజాబ్ రాయల్స్-ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత వినేష్ ఫొగట్ నేతృత్వంలోని ముంబై మరాఠీతో తలపడనుంది.

రాయుడు బౌలింగ్ అనుమానాస్పదం

ప్రకటించిన ఐసీసీ



దుబాయ్: భారత బ్యాట్స్‌మన్, పార్ట్‌టైం ఆఫ్ స్పిన్నర్ అంబటి రాయుడు బౌలింగ్ అనుమానాస్పదంగా ఉందని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రకటించింది. ఈమేరకు ఆస్ట్రేలియాతో శనివారం జరిగిన తొలి వన్డే అనంతరం మ్యాచ్ అధికారుల బృందం తమకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించింది. ఆ మ్యాచ్‌లో కేవలం రెండు ఓవర్లే వేసిన రాయుడు వికెట్ ఏమీ లేకుండా 13 పరుగులు ఇచ్చాడు. అయితే ప్రస్తుతానికి బౌలింగ్ చేసేందుకు రాయుడుకు ఎలాంటి అడ్డంకులూ లేవు. 'రాయుడు బౌలింగ్‌ను నిశితంగా పరిశీలిస్తాం. 14 రోజులపాటు అతడు బౌలింగ్ పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ కాలంలో అతడు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో బౌలింగ్ చేయవచ్చు. బౌలింగ్ పరీక్ష ఫలితాలు వచ్చాక తదుపరి నిర్ణయం తీసుకుంటాం' అని ఐసీసీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 46 మ్యాచ్‌ల వన్డే కెరీర్‌లో రాయుడు 20.1 ఓవర్లలో 41.33 సగటుతో మూడు వికెట్లు పడగొట్టాడు. ఆరు టీ 20లు ఆడినా వాటిల్లో బౌలింగ్ చేయలేదు.



ఫెడరర్
జొకోవిచ్
సెరెనా

'రికార్డు' టైటిల్ వేటలో..

● 24వ గ్రాండ్‌స్లామ్‌పై సెరెనా దృష్టి ● ఏడో టైటిల్ కోసం ఫెడరర్, జొకోవిచ్
● భారత్ నుంచి ప్రజ్ఞేష్ ఒక్కడే ● నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్

అమ్మగా మారినా తనలో సత్తా ఏమీ తగ్గలేదని సెరెనా విలియమ్స్ నిరూపించుకుంటుందా? ఈ క్రమంలో టెన్నిస్ చరిత్రలోనే అత్యధిక గ్రాండ్‌స్లామ్స్ నెగ్గి 'రికార్డు'ను సమం చేయగలుగుతుందా? పురుషుల విభాగంలో ఇప్పటిదాకా ఎవరూ సాధించని రీతిలో ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను డిఫెండింగ్ చాంప్ ఫెడరర్, నెంబర్‌వన్ జొకోవిచ్‌లలో ఎవరైనా దక్కించుకోగలరా? తేలాలంటే నేటి నుంచి ఆరంభమయ్యే ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్‌ను తిలకించాల్సిందే!


వోజ్నియాకి


నడాల్

మెల్‌బోర్న్: ఏడాది ఆరంభంలో జరిగే తొలి గ్రాండ్‌స్లామ్.. ఆస్ట్రేలియన్ ఓపెన్ అంటే టెన్నిస్ ప్రేమికులతో పాటు ఆటగాళ్లు కూడా ఇష్టపడతారు. అందుకే దీన్ని 'హ్యాపీ స్లామ్' అని పిలుస్తుంటారు. సోమవారం నుంచి ఈనెల 27 వరకు జరిగే ఈ టోర్నీలో పురుషుల, మహిళల సింగిల్స్‌లో మొత్తం 128 మంది ఆటగాళ్లు తలపడుతున్నారు. అయితే వీరిలో కొందరికి ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రత్యేకం కానుంది. ప్రపంచ మూడో ర్యాంకర్ రోజర్ ఫెడరర్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్నాడు. గతేడాది ఫైనల్లో మారిన్ సిలిచ్‌ను ఓడించి ఆరో ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను సాధించగా గ్రాండ్‌స్లామ్స్ సంఖ్యను 20కి పెంచుకున్నాడు. ఈసారి టైటిల్ నిలబెట్టుకుంటే 37 ఏళ్ల ఫెడెక్స్ ఖాతాలో రికార్డు స్థాయిలో ఏడో టైటిల్ చేరుతుంది. ఇప్పటిదాకా ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను ఇన్ని సార్లు గెలిచిన ఆటగాడు లేడు. అయితే వరల్డ్ నెంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్‌తో అతడికి గట్టి పోటీనే ఎదురుకానుంది. అంతేకాదు.. జొకోవిచ్ కూడా ఏడో టైటిల్‌పైనే కన్నేశాడు. వీరిద్దరూ ఆసీస్ గ్రేట్ రాయ్ ఎమర్సన్‌తో కలిసి ఆరు టైటిళ్లతో సమానంగా ఉన్నారు. ఇక ప్రపంచ రెండో ర్యాంకర్, స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ తన ఫిట్‌నెస్ సమస్యలను వెనక్కినెట్టి రెండో టైటిల్ కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ టోర్నీకి సన్నాహకంగా జరిగిన బ్రిస్బేన్ ఓపెన్ నుంచి అతడు ఫిట్‌నెస్ సమస్యతోనే వైదొలిగాడు. ఇదిలావుండగా ఈ టోర్నీ తర్వాత టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పబోతున్న ఇంగ్లండ్ స్టార్ ఆండీ మర్రేపై అందరి దృష్టి నెలకొంది. గాయాలు వెంటాడుతుండడంతో అతడికిదే చివరి గ్రాండ్‌స్లామ్ కానుంది.

యువ ఆటగాళ్లతో పోటీ: వెటరన్ స్టార్లకు ఈసారి యువ ఆటగాళ్లు పోటీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ముఖ్యంగా నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్‌తో ప్రమాదమే. భవిష్యత్ తారగా పిలుచుకుంటున్న ఈ 21 ఏళ్ల జర్మన్ స్టార్ ఖాతాలో ఇప్పటిదాకా గ్రాండ్‌స్లామ్ లేదు. ఫెడరర్, జొకోవిచ్‌లను ఓడించగల సత్తా జ్వెరేవ్‌కు ఉందని విశ్లేషకుల అంచనా. బోర్నా కోరిక్ (క్రొయేషియా), కారెన్ కచనోవ్ (రష్యా) కూడా టాప్-3కి షాక్ ఇవ్వగల సమర్థులే. మరోవైపు భారత్ నుంచి ప్రజ్ఞేష్ గుణేశ్వరన్ ఒక్కడే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడబోతున్నాడు.

సెరెనా సాధిస్తుందా?

రెండేళ్ల క్రితం 8 వారాల గర్భంతో ఇక్కడ ఏడోసారి చాంపియన్‌గా నిలిచిన సెరెనా విలియమ్స్ ఈసారి రికార్డు గ్రాండ్‌స్లామ్స్‌పై కన్నేసింది. మొత్తం 24 స్లామ్స్‌తో మార్గరెట్ కోర్ట్‌తో సమంగా నిలవాలని ఆరాటపడుతోంది. అలాగే అమ్మగా తొలి గ్రాండ్‌స్లామ్‌ను దక్కించుకోవాలనుకుంటోంది. గతేడాది వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌లో సెరెనా ఫైనల్ చేరింది. మంగళవారం తొలి రౌండ్‌లో ఆడనుంది. ఇక డిఫెండింగ్ చాంపియన్ కరోలిన్ వోజ్నియాకి, ప్రపంచ నెంబర్‌వన్ సిమోన హలెప్ అంత సులువుగా ప్రత్యర్థులకు లొంగే రకం కాదు. హలెప్ తొలిరౌండ్‌లో కనేపితో తలపడనుండగా నాలుగో రౌండ్‌లో సెరెనా ఎదురయ్యే చాన్స్ ఉంది. అలాగే షరపోవా, స్టీఫెన్స్, కెర్బర్, క్విటోవా, ఒసాక, కీస్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

నాకౌట్‌పై భారత్ గురి

● బహ్రెయిన్‌తో మ్యాచ్ నేడు
● ఏఎఫ్‌సీ ఆసియా కప్

రా. 9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-2లో

షార్జా: థాయ్‌లాండ్‌పై ఘన విజయంతో ఆసియా కప్‌ను ఆరంభించిన భారత సాకర్ జట్టు.. రెండో మ్యాచ్‌లో యూఏఈ చేతిలో ఓడి నిరాశపరిచింది. ఇప్పుడు సోమవారం బహ్రెయిన్‌తో జరిగే చివరి గ్రూప్ మ్యాచ్‌లో నెగ్గి నాకౌట్ బెర్త్ దక్కించుకోవాలని ఆరాట పడుతోంది. ఈ మ్యాచ్‌ను కనీసం డ్రా చేసుకున్నా టీమిండియా ప్రీ క్వార్టర్స్‌కు అర్హత సాధిస్తుంది. ఈ మ్యాచ్‌తో భారత్ తరపున అత్యధిక మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించిన భూటియా (107) రికార్డును కెప్టెన్ సునీల్ ఛెత్రి సమం చేయనున్నాడు. ఇదే గ్రూప్‌లో థాయ్‌లాండ్‌పై యూఈఏ నెగ్గితే.. బహ్రెయిన్ చేతిలో ఓడినా భారత్ నాకౌట్ చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

14 పరుగులకే చైనా ఆలౌట్

బ్యాంకాక్: అంతర్జాతీయ మహిళల టీ20 క్రికెట్‌లో ఒకే మ్యాచ్‌లో రెండు రికార్డులు బద్దలయ్యాయి. థాయ్‌లాండ్ మహిళల టీ20 స్మాష్‌లో భాగంగా ఆదివారం యూఏఈ, చైనా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ముందుగా యూఏఈ మూడు వికెట్లకు 203 పరుగులు చేయగా.. ఆ తర్వాత బరిలోకి దిగిన చైనా జట్టు దారుణమైన ఆటతీరుతో 10 ఓవర్లు ఆడి 14 పరుగులకే కుప్పకూలింది. దీంతో మహిళల టీ20లో అత్యల్ప స్కోరును నమోదు చేసిన చెత్త రికార్డును చైనా మూటగట్టుకుంది. అలాగే, ఈ మ్యాచ్‌లో యూఏఈ 189 పరుగుల భారీ తేడాతో గెలవడం మరో రికార్డు. గతేడాది ఆగస్టులో నమీబియా అత్యధికంగా 179 పరుగుల తేడాతో గెలిచిన రికార్డు ఇప్పుడు కనుమరుగైంది.

జాతీయ హ్యాండ్‌బాల్‌లో ఏపీకి నిరాశ

సిద్దిపేట కల్చరల్ (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు నిరాశ ఎదురైంది. ఆదివారం జరిగిన పోటీలో మహారాష్ట్ర 12-6తో ఏపీపై గెలిచింది. ఇతర మ్యాచుల్లో తమిళనాడుపై పుదుచ్చేరి, జమ్మూపై యూపీ, చండీగఢ్‌పై పంజాబ్ గెలుపొందాయి.

రాజస్థాన్ రాయల్స్ చీఫ్ కోచ్‌గా ఆప్టన్

ముంబై: ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ ప్యాడీ ఆప్టన్‌ను తమ ప్రధాన కోచ్‌గా తిరిగి నియమించుకుంది. గతంలో ఆప్టన్ 2013లో కోచ్‌గా ఉన్నపుడు రాజస్థాన్ సెమీఫైనల్ చేరింది. ఆప్టన్ ప్రపంచవ్యాప్తంగా పలు జట్లకు కోచ్‌గా వ్యవహరించాడు. 2011లో భారత జట్టు ప్రపంచకప్‌ను గెలుచుకోవడమేగాక టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని సాధించడంలో కండిషనింగ్ కోచ్‌గా ఆప్టన్ పాత్ర కీలకం.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: **K. Srinivas**, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .**Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.

POWERED BY
NPCI
भारतीय राष्ट्रीय भुगतान निगम
NATIONAL PAYMENTS CORPORATION OF INDIA

ప్రజా శ్రేయస్సు కోరీ జారీ చేయడం జరుగుతుంది.

మీకు తెలిసినవారందరికి తెలియజేయండి

అలా చేయడంతో వారు వారి **UPI వివరాలను** ఎవ్వరికి వెల్లడించరు.

	1. మీ డెబిట్ కార్డ్ వివరాలను ఎవ్వరికి ఇవ్వకండి (కార్డ్ నంబర్, గడువు ముగింపు మరియు CVV నంబర్)
OTP	2. మీకు వచ్చిన OTPని ఎవ్వరికి వెల్లడించకండి
SMS	3. మీకు తెలియని నంబర్లకు SMSలు ఫార్వార్డ్ చెయ్యకండి

ఈ సందేశాన్ని ఇతరులకు తెలియజేసి, మోసపూరిత కార్యచరణలను నివారించేందుకు తోడ్పడండి

SOHOSQUARE

BHIM
BHARAT INTERFACE FOR MONEY
UPI
UNIFIED PAYMENTS INTERFACE

ఏమైనా ఫిర్యాదులు/సమస్యలు ఉంటే, దయచేసి వెంటనే మీ బ్యాంక్‌ను సంప్రదించండి.